
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
శనివారం 12 ఆగస్టు 2017 | 16





ఆంధ్రజ్యోతి ఫోకస్

గృహాణం వీడేనా!?

ఆ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఒకటి కాదు.. రెండు కాదు.. అక్షరాలా పదేళ్లకుపైగానే అయ్యింది. ఏం లాభం. నేటికీ పూర్తి కాలేదు. నాటి పాలకులు, అధికారుల అలసత్వం, అవినీతి కారణంగా పేదలకు సొంతింటి కల కల్లగానే మిగిలిపోతోంది. 2004-14 మధ్యలో జిల్లాకు లక్షకు పైగా ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో ఇంకా 16 వేలకుపైగానే అసంపూర్తిగా ఉన్నాయి. మరో పది వేలకు పైగా అసలు కనిపించడం లేదు. పునాదులకూ నోచుకోలేదు. ఇన్నేళ్లు గడుస్తున్నా అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేయలేకపోవడంతో చాలా ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో రూ.కోట్ల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరుగా మారింది. ఇప్పటికీ బాధిత పేదలు తమ సొంతింటి కల ఎప్పటికి నెరవేరుతుందా..! అని కళ్లల్లో ఒత్తులేసుకొని ఎదురు చూస్తున్నారు. నాటి పాలకులు, వారి అనుచరులు మాత్రం పేదల ఇళ్ల పేరుతో రూ.కోట్లు మింగేశారు. దీనిపై రెండేళ్ల నుంచి విచారణ సా..గుతూనే ఉంది.

- 'ఇందిరమ్మ' ఇళ్ల నిర్మాణాల్లో అంతులేని అలసత్వం
- దశాబ్దం గడిచినా పూర్తికాని నిర్మాణాలు
- జిల్లాలో అసంపూర్తిగా 16 వేల ఇళ్లు
- మరో 10 వేలు కాగితాల్లోనే!
- నాటి పాలకులు, అధికారుల నిర్లక్ష్యం
- రూ.కోట్ల నిధులు మొండిగోడలపాలు
- నేటికీ పేదలకు కలగానే సొంతిల్లు
- ఇప్పటికైనా మేల్కొని పూర్తి చేస్తారా?

8 లో..



అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ గృహాలు

మిగిలింది 4 రోజులే... తేలాల్సింది 10 వేలు

- విద్యార్థుల సర్వేలో సీఆర్‌పీలు తలమునకలు
- వేగవంతం చేయాలంటున్న అధికారులు

9

పోలీస్ కస్టడీకి క్రికెట్ బుకీలు

- ఐదుగురిని అప్పగించిన న్యాయస్థానం
- తిరిగి ప్రారంభమైన విచారణ
- పోలీస్ పాత్రపైనా వివరాలు సేకరణ
- నేతల గుండెల్లో గుబులు

ఇక అయిపోయిందనుకున్న క్రికెట్ బుకీల వ్యవహారం మళ్లీ మొదలైంది. జాతీయ క్రికెట్ బుకీలు అయిన కృష్ణ సింగ్‌తోపాటు మరో 8 మంది జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. మరింత విచారణ కోసం వీరిని తమకు అప్పగించాలని పోలీసులు న్యాయస్థానాన్ని అభ్యర్థించడంతో శుక్రవారం ఐదుగురికి అనుమతి లభించింది. కృష్ణసింగ్, షేక్.షంషీర్, ఉట్టుకూరు వెంకటరమేష్ అలియాస్ డీటీఎస్ రమేష్, తిన్నేరు రమేష్‌కుమార్, అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డిలను మూడు రోజులపాటు పోలీసులు విచారించనున్నారు. బెట్టింగ్‌ల వ్యవహారంలో ఇంకెంతమంది కీలకంగా వ్యవహరించారు. ఎంతమంది నేతలకు భాగస్వామ్యం ఉంది తదితర అంశాలతో పాటు పోలీసుల పాత్రపైనా పూర్తిస్థాయిలో విచారించేందుకు ఎస్పీ రామకృష్ణ సన్నద్ధమయ్యారు. మరోవైపు పరారీలో ఉన్న వారి కోసం కూడా పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు.

7

'దేశం'లో కొలువులు

- సంస్థాగత కమిటీల ఏర్పాటు
- మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నియామకం 8

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు పెంచండి

- డీఈవో మువ్వా రామలింగం 3



అండర్-12 బాలికల విభాగంలో మొదటి బహుమతి సాధించిన బాలికల జట్టు

ఆంధ్రా.. అదరహో!

- మూడు విభాగాలలో విజేతలుగా..
- ఆసక్తి రేపిన ఫైనల్స్

ముగిసిన జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

- వివరాలు 16లో..




చెంగాళమ్మకు పుష్పయాగం

సూళ్లూరుపేటలో చెంగాళమ్మ అమ్మవారికి శుక్రవారం రాత్రి వేడుకగా పుష్పయాగం జరిగింది. శ్రావణ శుక్రవారం సందర్భంగా జరిగిన ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు బారులు తీరారు. 16

ఫైనాన్స్ భూతం

- వాహనాల రుణం పేరుతో నిలువు దోపిడీ
- జిల్లాలో 300 పైగా అనధికార సంస్థలు
- ఆర్బీఐ నిబంధనలు పట్టవు.. స్టాంప్‌డ్యూటీ చెల్లించరు!
- ఫ్లాట్ అంటూ రూ.10వడ్డీతో రుణం
- ఒక్క నెల ఈఎంఐ కట్టకుంటే అంతే!
- రౌడీలతో దౌర్జన్యం.. ఇళ్ల దగ్గర గొడవ
- బెంబేలెత్తిపోతున్న సామాన్య ప్రజానీకం..

6 లో..



కొందరి కాసుల కక్కుర్తి మరికొందరికి శాపంగా మారుతోంది. ఆర్‌బీఐ నిబంధనలు తుంగలో తొక్కుతూ జిల్లాలో పుట్టగొడుగుల్లా అనధికార ఫైనాన్స్ సంస్థలు వెలుస్తున్నాయి. ఇష్టం వచ్చినట్లు వడ్డీ విధించడం.. ఆ మొత్తాన్ని సకాలంలో చెల్లించలేకపోతే రౌడీలతో బెదిరించడం ఎక్కువయ్యాయి. ముఖ్యంగా నెల్లూరులో సుమారు 250కిపైగా అనధికార ఫైనాన్స్ సంస్థలు ఉన్నట్లు సమాచారం. వీరు సామాన్యుల అవసరాలను ఆసరా చేసుకుని తమ దందా సాగిస్తున్నారు. ప్రధానంగా ఆటోలు, బైక్‌లు, కార్లకు ఫైనాన్స్‌లు ఇస్తూ అంతకు అంత వసూలు చేస్తున్నారు. వాహనం ఉంటేనే కుటుంబం గడవాల్సి ఉండటంతో సామాన్యులు కూడా ఫైనాన్షియర్ విధించినంత వడ్డీలు చెల్లించుకుంటూ.. కట్టలేని పరిస్థితుల్లో వాహనాలను వదులుకుంటున్నారు. అడిగేవారు లేకపోవడంతో అనధికార ఫైనాన్షియర్‌ల ఆగడాలు ఇటీవల ఎక్కువైపోయాయి.

సొంత లాభం కొంత మానుకుని పొరుగు వాడికి తోడుపడవోయ్.. అన్నట్లు, తనకున్న దాంట్లో కొంత ఇతరుల కోసం త్యాగం చేయాలని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని, నరుడే నారాయణుడన్న వాక్కులను ఆచరించిన వెంకయ్య స్వామి అదే విషయాన్ని తన భక్తులకూ ఉపదేశించారు.

- వెంకటాచలం



వెంకయ్య స్వామి సమాధి

చేజర్ల మండలంలోని నాగులవెల్లటూరుకు చెందిన సోంపల్లి పెంచలయ్య, పిచ్చమ్మ దంపతుల కుమారుడు వెంకయ్య నామమాత్రంగానే చదువుకున్నారు. చిన్ననాటి నుంచే వ్యవసాయంపై ఆసక్తి పెంచుకున్నారు. వయసుతో పాటు ఆధ్మాత్మిక చింతనను కూడా పెంచుకున్న ఆయన సామాన్యులకు అర్థం కాని రీతిలో మాట్లాడుతుండడంతో పిచ్చి వెంకయ్యగా పిలిచేవారు. కొంత కాలానికి వ్యవసాయం వదిలిపెట్టి పలు పుణ్య క్షేత్రాలకు వెళ్లి తపమాచరించిన అనంతరం చివరిగా గొలగమూడి చేరారు. ఆంజనేయ స్వామి ఆలయం పక్కన ఉన్న కోనేటి సమీపంలో బొంతజెముడు పుల్లలతో మంట వేసుకుని తంబుర మీటుతూ ఓం నారాయణ, ఆది నారాయణ అంటూ ఆధ్యాత్మిక లోకంలో విహరించేవాడు. అక్కడ ఆయనకు కొందరు శిష్యులు ఏర్పడ్డారు. తనపై నమ్మకంతో వచ్చే వారికి వేలిముద్రలు వేసి ఇవ్వడం, చీటీలు రాసి ఇవ్వడం వంటి చర్యలతో ఆశీర్వదించేవారు. స్వామి అవసాన దశలో నడవలేని స్థితికి చేరారు. ఆయన కోరిక మేరకు శిష్యులు స్వామిని కంచి, తిరువళ్లూరు, శ్రీరంగం, తిరుపతి తదితర క్షేత్రాలకు డోలీల్లో తీసుకెళ్లారు.

పవిత్ర ధుని

'అగ్నిగుండం కోటి లింగాల పూజ గదయ్యా' అన్న స్వామి వారి వాక్కు భాగంలోనే ధుని ఏర్పాటు చేశారు. భక్తులు అందులో బొంతజెముడు పుల్లలు, కొబ్బరి కాయలు వేస్తున్నారు. స్వామి సమాధి దర్శనానికి ముందే ధుని చుట్టూ ప్రదక్షిణలు చేయడం ఆనవాయితీగా మారింది.



వెంకయ్యస్వామి ఆశ్రమ మందిరం

నరుడే నారాయణుడు

- చాటి చెప్పిన వెంకయ్యస్వామి
- తనదైన శైలిలో జీవనవేదం చెప్పిన అవధూత
- 18 నుంచి గొలగమూడిలో ఆరాధనోత్సవాలు

● స్వామి నిర్యాణం

1982వ సంవత్సరం ఆగస్టు 24న వెంకయ్యస్వామి కాలధర్మం చేశారు. అయితే ఆయన యోగముద్రలో ఉన్నారని శిష్యులు 3 రోజుల వరకు సమాధి చేయలేదు. దాంతో శరీరం ఉబ్బి పోవడంతో సమాధి చేయక తప్పదని భావించిన శిష్యులు స్వామి పార్థివ దేహాన్ని తరలిస్తుండగా ముల్లు తగిలి రక్తం కారింది. దీంతో ఏంచేయాలో తెలియని శిష్యులు సమాధి చేయాలా, వద్దా అని రెండు చీటీలు రాసి, లాటరీ పద్ధతిలో నిర్ణయం తీసుకోవాలనుకున్నారు. సమాధి చేయాలని చీటీ రావడంతో తూర్పు వైపు తల ఉంచి సమాధి చేశారు.

● ఆకలిగొన్నవారికి అన్నం పెట్టాలయ్యా..

ఆకలిగొన్నవారికి అన్నం పెట్టాలయ్యా.. అని స్వామి వారు చెబుతుండేవారు. ఏ దానంతోనూ మనిషిని సంతృప్తి పరచలేమని, అన్నదానం ద్వారానే అది సాధ్యమవుతుందని స్వామి చెబుతుండేవారు. దానిని అనుసరించి ఆశ్రమ నిర్వాహకులు భక్తులు ఇచ్చే బియ్యం, పప్పులు, కూరగాయలతో నిత్యం వేలాది మంది భక్తులకు అన్నదానం చేస్తున్నారు. భక్తులు ఇచ్చిన విరాళాలతో ఒకే సారి 700 మంది భోజనం చేయడానికి వీలుగా ఆశ్రమంలో డైనింగ్ హాలు నిర్మించారు.

● స్వామి సూక్తులు

బాధలను ఆధ్యాత్మిక చింతనతో ఉతికేయడం చాకలి యోగమని, కోరికలను తెంచుకోవడం మంగలియోగమని స్వామి వారు నర్మగర్భంగా చెప్పేవారు.'పావలా దొంగిలిస్తే రూపాయి పోతుందయ్యా' అనే సూక్తిని ఇతరుల సొమ్మును కాజేస్తే కలిగే అనర్థాలను స్వామి స్పష్టంగా వివరించేవారు. ఆధ్యాత్మిక భావనకు దూరం కావద్దని 'దారం తెగిపోకుండా చూసుకుంటే.. నీ బాగోగులు నేను చూస్తానని' స్వామి వారు తన భక్తులకు స్పష్టంగా చెప్పారు. అందువల్ల గొలగమూడి ఆశ్రమానికి వచ్చే భక్తులు స్వామి వారు నివసించిన కుటీరంలో ఇచ్చే దారాన్ని చేతికి కట్టించుకుంటారు.

● ఆరాధన

స్వామి కాలధర్మం చెందిన ఆగస్టు 24 వ తేదీన ప్రతి ఏటా ఆరాధనోత్సవం నిర్వహిస్తున్నారు. కాలక్రమంలో ఆశ్రమ నిర్వహణ విషయంలో ఏర్పడిన వివాదం కారణంగా హైకోర్టు ఆదేశానుసారం ఆశ్రమ అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి ఆరాధనోత్సవాలతో పాటు, భక్తులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నారు. ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో గొలగమూడికి వచ్చి స్వామి కృపకు పాత్రులవుతుంటారు.

● తిరుమల తరహాలో అభివృద్ధి

గొలగమూడి వెంకయ్య స్వామి ఆశ్రమ అభివృద్ధి గుడిసె స్థాయి నుంచి 50 ఎకరాలకు విస్తరించింది. తిరుమల తరహాలో ఇక్కడ అభివృద్ధి చేశారు. ఆశ్రమానికి సుమారు రూ.100 కోట్లకు పైగా విలువ చేసే ఆస్తులు సమకూరాయి. ఆశ్రమ ఈవోగా విశ్రాంత ఐఏఎస్ అధికారి బాలసుబ్రహ్మాణ్యం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి.పేద విద్యార్థుల కోసం ఆశ్రమం వారు ఉచిత భోజనం, వసతి కల్పించి విద్యాబోధన చేస్తున్నారు. వీరికోసం టాటా సంస్థ వారు రూ. కోటి విరాళమివ్వగా, ఆశ్రమం మరో రూ. 80 లక్షలు వెచ్చించి హాస్టల్ భవనం నిర్మించింది. భక్తుల వసతి కోసం ఆశ్రమం వారు 140 గదులను నిర్మించారు. వీటితో పాటు సత్రాలను నిర్మించారు. రూ. 4 కోట్లతో కల్యాణమండపం నిర్మించారు. ఆరాధనోత్సవం రోజున నిర్వహించే తెప్పోత్సవం కోసం రూ.47.80 లక్షలు వెచ్చించి కోనేరును ఆధునికీకరించారు. రూ.3.50 కోట్లతో అతిథి గృహాలను నిర్మిస్తున్నారు. అర్చకుల నివాసం కోసం రూ. 80 లక్షలతో భవనాలు నిర్మిస్తున్నారు. ఆశ్రమానికి మొక్కుబడి కింద వచ్చిన బియ్యాన్ని నాణ్యత ఉండేలా చేయడానికి రూ.20 లక్షలతో మిల్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆశ్రమ ప్రాంగణంలో ధ్యానమందిరాన్ని నిర్మించారు. ఆశ్రమం ప్రాంగణమంతా సోలార్ దీపాలను ఏర్పాటు చేశారు.

● ఎలా వెళ్లాలి?

నెల్లూరు నగరం నుంచి కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఈ గొలగమూడి పుణ్యక్షేత్రం ఉంది. జాతీయ రహదారి నుంచి కంటేపల్లి మీదుగా గొలగమూడికి వెళ్లడానికి ఆర్టీసీ బస్సులతో పాటు ఆటోలు కూడా అందుబాటులో ఉంటాయి. నెల్లూరు ఆర్టీసీ బస్టాండు నుంచి బస్సులు, ఆటోలు అందుబాటులో ఉంటాయి.



అన్నదానం స్వీకరిస్తున్న భక్తులు



ఆశ్రమం నిర్వహిస్తున్న పాఠశాల



రంగులతో ముస్తాబైన ముఖద్వారాలు



పెన్నానదిలో కుంకుమను నిమజ్జనం చేస్తున్న మహిళలు

పెన్నా తీరాన భక్తి పరవళ్లు

సంగంలోని పెన్నానది ఒడ్డున వెలసిన కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా లక్ష కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. వేదపండితులు ఏకాదశ ద్రవ్యములతో, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. బ్రహ్మశ్రీ కనుమళ్ల సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో ముత్తైదువులు సామూహిక లక్ష కుంకుమార్చనలో పాల్గొన్నారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ నిర్మాల్య కుంకుమను ముత్తైదువులు పెన్నానది జలాల్లో నిమజ్జనం చేశారు. దీంతో పెన్నానది జలాలు ఎరుపెక్కాయి. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాలనుంచి మహిళలు వందల సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఆలయంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ మాఘం గిరి బాబు, ఆలయ ప్రధాన అర్చకుడు టంగుటూరి గోపాలకృష్ణమూర్తి, గ్రామపెద్దలు కోటు వెంకట కరుణాకర్‌రెడ్డి, పెంచలయ్య, అనిల్‌కుమార్‌రెడ్డి కమిటీ సభ్యులు గ్రంధి గోపీకృష్ణ, కుండా సుబ్బారావు, నాగరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

- సంగం



కామాక్షిదేవి, సంగమేశ్వరస్వామి వార్లకు అభిషేకం



లక్ష కుంకుమార్చనలో మహిళలు

ఉద్యోగ వర్గం

పశుసంవర్ధక శాఖలో ఖాళీలు భర్తీ చేయాలి

- వెటర్నరీ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామిరెడ్డి



నెల్లూరు (వ్యవసాయం) : పాడి మరింత మెరుగైన సేవలు అందించేందుకు పశుసంవర్ధక శాఖకు సంబంధించి క్షేత్ర స్థాయిలో ఉన్న ఖాళీలన్నింటినీ ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలి. తద్వారా మెరుగైన పాలనా విధానానికి నాంది పలకాలి. పశు సంవర్ధక శాఖలో పాలనా వ్యవహారాలను డివిజన్ స్థాయిలో పర్యవేక్షించే ఏడీలందరికీ వాహన సదుపాయం కల్పించాలి. పాలనా పరంగా ప్రోత్సహించాలి. వెటర్నరీ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులందరికీ పెండింగ్‌లో ఉన్న పది నెలల పీఆర్సీ అరియర్స్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి.

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు పెంచండి

● 16 నుంచి ప్రత్యేక కార్యక్రమాలు
● డీఈవో మువ్వారామలింగం

నెల్లూరు (క్యాంపస్) : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక పీఠం (ఓపెన్ స్కూల్) అడ్మిషన్లు (2017- 18 విద్యా సంవత్సరంలో) పెంచేందుకు అందరూ కృషి చేయాలని డీఈవో మువ్వా రామలింగం సూచించారు. నగరంలోని డీఈవో కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక పీఠం జిల్లా కో- ఆర్డినేటర్ ఎల్‌సీ రమణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్‌ఐవో, డీవీఈవోలతో ఓపెన్ స్కూల్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఈ అడ్మిషన్లు పెంపుదలలో భాగంగా ఈ నెల 16 నుంచి విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జిల్లాలోని పలు సెజ్‌లు, షాపింగ్‌మాల్స్, పోర్టు ట్రేడ్ యూనియన్లు, హోంగార్డులు, ఇలా పలు ప్రాంతాలలో ఉన్నత విద్యను అభ్యసించిన వారిని ఓపెన్ స్కూల్‌లో చేర్పించేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నామన్నారు. ర్యాలీలు క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సెప్టెంబర్ 30 తేదీ వరకు అడ్మిషన్లు పొందే అవకాశం ఉందని, జిల్లాలో ఉన్న పలు స్టడీ సెంటర్‌లలో అడ్మిషన్లు పొందవచ్చని తెలియజేశారు. అనంతరం అడ్మిషన్లు పెంపొందించేందుకు ప్రత్యేక ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐవో బాబూజాకబ్, డీవైఈవో బీమా వెంకయ్య, డిప్యూటీ డీఈవోలు పాల్గొన్నారు.



డీఈవో కార్యాలయం వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

'డాక్టర్ కిషోర్స్ రత్నం' మెగా రక్తదాన శిబిరం

నెల్లూరు (వైద్యం) : ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యా సంస్థల ఆధ్వర్యంలో నెల్లూరులోని ఐఎంఏ హాలులో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మంత్రి నారాయణ ఓఎస్‌డీ పెంచలరెడ్డి ప్రారంభించారు. రత్నం విద్యా సంస్థలకు చెందిన 106 మంది ఉపాధ్యాయులు, సిబ్బంది రక్తదానం చేశారు. ఓఎస్‌డీ మాట్లాడుతూ జిల్లా ప్రతిష్ఠను ప్రపంచ వ్యాప్తంగా చాటిన వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతిగా ఎంపిక కావడం జిల్లావాసులకు గర్వకారణమన్నారు. రత్నం విద్యా సంస్థలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రక్తదానం చేసిన వారిని విద్యా సంస్థల డైరెక్టర్లు డాక్టర్ కృష్ణ కిషోర్, వాసంతి కిషోర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓఎస్‌డీ పెంచలరెడ్డి



రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి

బిట్రగుంట: బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం మోటారుసైకిలుపై గూడూరు బాలయపల్లె మండలం వెళుతూ డివైడర్‌ను ఢీకొని కింద పడిపోయిన మద్దూరు మస్తానయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న మోహనకృష్ణ సోదరుడి మృతదేహాన్ని చూసి చలించిపోయాడు. శింగరాయకొండ నుంచి మద్యం సేవించి అతివేగంతో బైక్‌పై వస్తున్న వారిద్దరూ డివైడర్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగి ఉంటుందని తిప్ప పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణకుమార్ తెలిపారు. ఇద్దరు చిన్నాన్న, పెదనాన్న పిల్లలని బాలాయపల్లి మిండవల్లి గ్రామానికి చెందిన వారని ఆయన అన్నారు. మస్తానయ్య, మోహన్‌కృష్ణ రైలులో టీలు, భోజనాలు అమ్ముకునే కాంట్రాక్టు కూలీలన్నారు. మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


మద్దూరు మస్తానయ్య మృతదేహం

రైల్వే పట్టాలపై యువకుడి మృతదేహం

కావలిరూరల్: కావలి-బిట్రగుంట రైల్వేస్టేషన్ల మధ్య వెంకటేశ్వరపాలెం స్టేషన్ సమీపంలో దిగువ మార్గంలోని పట్టాలపై గుర్తుతెలియని యువకుడి(35) మృతదేహాన్ని శుక్రవారం రైల్వే కీమన్ గుర్తించాడు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యంకాలేదు. మృతదేహంపై రోజ్‌కలర్ షర్ట్, కాఫీ కలర్ ప్యాంటు ఉన్నాయి. 5.6 అడుగుల ఎత్తు చామనఛాయ కలిగి ఉంది. మృతదేహం పడి ఉన్న తీరును బట్టి రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు కింద పడి ఉంటాడని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ పీ భాస్కర్ తెలిపారు.

IN THE COURT OF
VII ADJ, GUDUR
IA No. 394/2015 in
OS No. 290/2014
P.V.Rajalakshmi ....Petitioner
Vs
R.K.Estates, Sullurpet, Represented by its Partner Dabbala Raja Reddy (Died) & Others ....Defendant
NOTICE TO RESPONDENTS
Respondent 14: Boddapati Venkata Subba Rao, S/O Late Boddapati Sathya Narayana, residing at Qtr.No.E/88, Pulicat Nagar (KRP), Sullurpet
Respondent 22: Thallam Sai Kiran Kumar, S/O Prabhakar, residing at Panduranga Street, Sullurpet
Respondent 31: Murugareddi Sasidharan, S/O Ramachandra Reddy, residing at Flat No. 2, Ground Floor, Block C3, Keerthi Enclave, NH5 Road, Kotapoluru Village & Post, TADA Mandal
Respondent-37: Jelumudi Masthanaiah, S/o Venkata Krishna Reddy, residing at Krishnapadu Village, Somavarapadu Post, Jaladanki Mandal
Please take notice that the above matter is posted for your appearance on 24-8-2017 and if you do not appear before the above court, on that day, at about 10:30 a.m., either personally or through your advocate, you will be set exparte and the matter will be decided in your absence.
Date of Hearing: 24-8-2017
V. SANKARA NARAYANA,
Advocate, Nellore

నాయుడుపేట నగర పంచాయతి
ఆర్.ఓ.సి.నెం.55/2017/ఏ1 తేది.11.08.2017
బహిరంగ వేలం ప్రకటన
నాయుడుపేట నగర పంచాయతికి చెందిన ఈ క్రింది దుకాణ సముదాయమునందలి రూముకు నగర పంచాయతి కార్యాలయములో కమిషనరుగారిచే కాని, వారి అనుమతి పొందినవారిచే కాని తే.17-08-2017ది గురువారము ఉదయం గం.10.30ల నుండి బహిరంగ వేలము జరుగును. వేలములో పాల్గొనువారు నగర పంచాయతి కార్యాలయము పనివేళలయందు వివరములను తెలుసుకొనవలసినదిగా తెలియజేయడమైనది.

వ. నెం.	వేలము వివరములు	లీజు కాలము	చెల్లించవలసిన ధరావత్తు మొత్తము రూ.	స్థిరాస్తి విలువ (సాల్వెన్సి)
1.	శ్రీ నేదురుమల్లి జనార్ధనరెడ్డి దుకాణ సముదాయము రూము నెం.16. (యస్.సి)	తేది.1-8-2017ది నుండి తేది.31-5-2019 వరకు	1,00,000/-	3,00,000/-

కమీషనర్
నాయుడుపేట నగర పంచాయతి

ఎంఎస్ఎఫ్ కళాశాలల బంద్ ప్రశాంతం

కావలిటౌన్: మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కావలిలో నిర్వహించిన కళాశాలల బంద్ ప్రశాంతంగా జరిగింది. ఎంఎస్ఎఫ్ నియోజక వర్గ ఇన్‌చార్జ్ దేవరపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు ఇచ్చిన హామీని నెరవేర్చనందుకు నిరసనగా ఈ బంద్ నిర్వహించామన్నారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఉద్యమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు మానవహారాలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికైనా సీఎం స్పందించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి


శిక్షణ శిబిరంలో కావలి మండల నేతలు

కావలిరూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ కావలి మండల ప్రధాన కార్యదర్శి ప్రళయకావేరి భాస్కర్ పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా కందుకూరులో జరుగుతున్న టీడీపీ శిక్షణ శిబిరంలో శుక్రవారం కావలి మండలానికి చెందిన పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ శిబిరంలో భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులు, ఉద్యోగాలకోసం రాబోవు రోజులలో ఇతర రాష్ట్రాలు, దేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్య, ఉద్యోగ అవకాశాలు మన రాష్ట్రంలో ఉండేలా చేస్తున్నారన్నారు. గ్రామాలలో గ్రూపు రాజకీయాలు లేకుండా స్థానిక నాయకులు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లి పార్టీని పటిష్ట పరచాలన్నారు.

ఈ కార్యక్రమంలో తుమ్మలపెంట, అన్నగారి పాలెం, మన్నెంగిదిన్నె గ్రామ కమిటీ అధ్యక్షులు యల్లంగారి పార్వతయ్య, చెంచంగారి శ్రీను, మాచేపల్లి వెంకట్రావు తదితరులతో పాటు గ్రామ ప్రధాన కార్యదర్శులు పులి రమణయ్య, సురేష్, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విశ్వోదయ' రెక్టార్ కార్యాలయం ముట్టడి


ఆందోళన చేస్తున్న తొలగించిన బోధనేతర సిబ్బంది, ప్రజాసంఘాల నేతలు

కావలి: జవహర్ భారతి కళాశాలలో అక్రమంగా విధుల నుంచి తొలగించిన బోధనేతర సిబ్బందిని తిరిగి విధులలోకి తీసుకోవలని న్యాయపోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆందోళ చేస్తున్న విషయం విదితమే. ఈ ఆందోళనలో భాగంగా శుక్రవారం విశ్వోదయ రెక్టార్ చాంబర్ ముట్టడి జరిగింది. సిబ్బంది చేస్తున్న ఆందోళన 33వ రోజుకు చేరినా స్పందించని జేబీ యాజమాన్య నిర్లక్ష్యవైఖరి నశించాలని న్యాయపోరాటకమిటీ ఆధ్వర్యంలో సిబ్బంది, ప్రజా సంఘాల నాయకులు నినాదాలు చేశారు. చాంబర్‌లో ఉద్యోగులను బయటకు పంపి తాళాలు వేశారు. న్యాయపోరాట కమిటీ సభ్యులు మాట్లాడుతూ 33 రోజులుగా ఆందోళన చేస్తున్నా యాజమాన్యం తీరు దున్నపోతుపై వాన పడిన చందంగా ఉందన్నారు. విద్యార్థులు లేక పోయినా వారి పేర్లతో నిధులు స్వాహా చేయటంపై చూపిన శ్రద్ధ బోధనేతర సిబ్బందిపై లేదని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ నిధులతో నడుస్తున్న విద్యాసంస్థలో జరుగుతున్న అక్రమాలపై ప్రభుత్వం ఎందుకు స్పందించడంలేదని, జవహర్‌భారతి చట్టాలకు అతీతమైనదా అని వారు ప్రశ్నించారు. తక్షణమే సమస్యను పరిష్కరించకపోతే విశ్వోదయ విద్యాసంస్థలపై నిరవధిక పోరాటాలకు వెనుకాడ పోమన్నారు. ఈ కార్యక్రమంలో కరవది భాస్కర్,పెంచలయ్య, ఎన్‌జె వర్మ, డేగా సత్యం, సోమిశెట్టి బ్రహ్మయ్య, చేవూరు వర ప్రసాద్, ప్రసన్న కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

కావలి: శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఉండి వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్నారు. ఉదయాన్నే ఇళ్లలో అమ్మవారికి పూజచేసి నివేదించారు. కావలి కలుగోళ శాంభవి ఆలయంలో ప్రతి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. శ్రావణ శుక్రవరం కావటంతో మహిళలు అధిక సంఖ్యలో కలుగోళ్ల శాంభవిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేసారు. ఆలయం ముందు ధ్వజస్థంభం వద్ద మహిళలు ప్రమిదలలో దీపారాధనలు వెలిగించారు. అమ్మవారిని పూజిస్తే సమస్యలు తొలగి, అభీష్టి సిద్ధిస్తుందన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం. పట్టణంలోని పలు ఆలయాలకు వెళ్లి మహిళలు పూజలుచేసి అమ్మవార్లను దర్శించుకున్నారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

దగదర్తి: దగదర్తి గ్రామంలోని దుర్గాభవాని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం చేశారు.. కలశం, కొబ్బరికాయ, పసుపు కుంకుమతో అమ్మవారి ప్రతిమను ఏర్పాటుచేసి శాస్త్రోక్తంగా వరలక్ష్మీ వ్రతం ఆచరించారు. వరలక్ష్మివ్రతం ప్రాశస్త్యాన్ని, పవిత్రతను అర్చకులు భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.


కలుగోళ శాంభవి ఆలయంలో మహిళ వ్రతం


దగదర్తి రామలింగేశ్వర ఆలయంలో ..

యూటీఎఫ్ 44వ ఆవిర్భావ దినోత్సవం

కావలిటౌన్: యూటీఎఫ్ 44వ ఆవిర్భావ దినోత్సవం కావలి యూటీఎఫ్ ప్రాంతీయకార్యాలయంలో శుక్రవారం మండల శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా యూటీఎఫ్ సీనియర్ నాయకుడు ఆకుల రమణయ్య యూటీఎఫ్ జెండా ఆవిష్కరించారు. చలపతిశర్మ నాయకత్వంలో యూటీఎఫ్ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చలపతిశర్మ మాట్లాడుతూ యూటీఎఫ్ నిరంతరం ఉపాధ్యాయుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. అనేక సమస్యలు ఉద్యమాల ద్వారా పరిష్కరించుకున్నామని, ఉపాధ్యాయులను విభజిస్తూ కొత్త పింఛను విధానం అమలులోకి తెచ్చారని, దానిని రద్దు చేసేవరకు ఉద్యమిస్తామన్నారు. అందుకు యూటీఎఫ్ కార్యకర్తలతోపాటు ఉపాధ్యాయులందరూ సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఆసన్నమైనదని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మాధవరావు, టీ.శ్రీనివాసరావు, తిరుమలరావు, ఆనంద్‌బాబు, చాంద్‌బాషా, రాజేంద్ర, హనుమంతరావు, రఫి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కావలిరూరల్: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులను దూరం చేయవచ్చని కొవూరుపల్లి వైద్యాధికారి సురేంద్రబాబు పేర్కొన్నారు. కావలి రూరల్ మండలం మొర్లవారిపాలెంలో శుక్రవారం వైరల్ జ్వరాలపై శిబిరం జరిగింది. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో నీటినిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. సబ్ యూనిట్ అధికారి మాతయ్య మాట్లాడుతూ గ్రామంలోని ఇళ్లలో దోమల నివారణకు పైరిత్రం మందును పిచికారి చేయించామన్నారు. గురువారం జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ గ్రామాన్ని సందర్శించి నీటిలో లార్వా పెరగటంతోనే వైరల్ జ్వరాలు వ్యాపిస్తున్నట్లు తెలిపారన్నారు. ఈ శిబిరంలో వైద్యపరీక్షలు అనంతరం రాం సెంటర్ ప్రతినిధులు మనోహర్ రెడ్డి, ఆయన బృందం ఐరన్, కాల్షియం మందులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచు వాదినాల తులశమ్మ, పంచాయతీ కార్యదర్శి నాగేంద్రకుమార్, ఎంపీహెచ్‌వో శ్రీనివాసులు , ఏఎన్ఎంలు సౌజన్య, గీత, స్వర్ణలత, శ్యామలతో పాటు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

కావలి(క్రైం): కావలి రూపాయిమిద్దె వద్ద రోడ్డుపక్కన నిలబడి ఉన్న బత్తిన యానాదమ్మను శుక్రవారం సాయంత్రం ముసునూరు వైపు నుంచి వస్తున్న మోటారు సైకిలు ఢీకొంది. ఈ ప్రమాదంలో యానాదమ్మ తలపై రక్తగాయాలయ్యాయి. కావలి రూరల్ మండలం లింగంగుంటకు చెందిన బత్తిన యానాదమ్మ స్థానిక శ్రీకృష్ణ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఆయాగా పనిచేస్తోంది. మందులకోసం వచ్చి రోడ్డుపక్కన నిలబడి ఉన్న ఆమెను అటుగా మోటార్‌సైకిలుపై వస్తున్న అడపాల విజయ్ కుమార్ మద్యం మత్తులో అదుపుతప్పి ఢీ కొట్టాడు. గాయపడిన యానాదమ్మను ప్రథమ చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కావలి రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చికిత్సపొందతున్న యానాదమ్మ

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కావలిరూరల్: కావలి పట్టణంలోని బిట్-1, బిట్-2 ప్రాంతాలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని శుక్రవారం ట్రాన్స్‌కో ఏడీఈ సురేష్‌బాబు తెలిపారు. విద్యుత్ తీగల మరమ్మతులు, చెట్లకొమ్మలు తొలగింపులో భాగంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులకు కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నామని సహృదయతో ఈ విషయాన్ని గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

కొద్దిపాటి వర్షానికే ట్రంకురోడ్డు జలమయం

కావలిటౌన్: కావలిలో శుక్రవారం సాయంత్రం కురిసిన కొద్దిపాటి వర్షానికే ట్రంకు రోడ్డు జలమయ మైంది. ప్రధానంగా ఎంపీడీవో కార్యాలయం నుంచి బ్రిడ్జి కూడలి వరకు డ్రైనేజీ మురుగు వర్షపునీరు కలిసి రోడ్డుపై నిల్వ చేరడంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. దుర్గంధాన్ని భరించలేక ముక్కుమూసుకొని వెళ్లడం కనిపించింది. డ్రెయిన్ పూడిపోవడంతో వర్షపునీరు ముందుకు ప్రవహించక కాలువలో మురుగు రోడ్డెపెకి తన్నుకొచ్చింది.

జలదంకి: శుక్రవారం జలదంకి మండలంలో వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు విడతవారీగా వర్షం పడుతూనే ఉంది. ఈ వర్షంతో పంట పొలాల్లో నీరు చేరింది. మండలంలో సాగులో ఉన్న పంటలు పత్తి, వేరుశెనగ తీతలు జరుగుతుండగా వర్షం కారణంగా నిలిచిపోయాయి. వేరుశెనగ పంట పలుచోట్ల పీకడంతో తడిసిపోయి నష్టం వాటిల్లింది. రైతులు వేరుశెనగ పంటను కుప్పలు వేసేందుకు ప్రయత్నించినా వర్షం కారణంగా వీలుపడలేదు.


జలమయమైన కావలి ట్రంకురోడ్డు


జలదంకిలో రోడ్డుపై వర్షపునీటి మడుగు

జలదంకిలో మాజీ ఎమ్మెల్యే మేకపాటి పర్యటన

జలదంకి: జలదంకి, కావలిలో మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం మండల వైసీపీ నాయకుల ఇళ్లకు వెళ్లారు. కావలి పట్టణంలో జిల్లా వైసీపీ రైతు విభాగం నాయకుడు రావి ప్రసాద్ బావమరిది వివాహ కార్యక్రమానికి హాజరై వరుడుని ఆశీర్వదించారు. అనంతరం జలదంకి వైసీసీ నాయకులు నిమ్మకాయల మాలకొండయ్య ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. మేకపాటి వెంట నాయకులు పాలవల్లి మాలకొండారెడ్డి, తిప్పారెడ్డి యదునందనరెడ్డి, గుర్రం జగ్గయ్య, సురేశేషారెడ్డి తదితరులున్నారు.

బిందు సేద్యంపై రైతులకు శిక్షణ



రైతులకు శిక్షణలో మాట్లాడుతున్న అధికారులు

కలిగిరి: మండలంలోని తూర్పుగుడ్లదొన గ్రామంలో ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ సేద్యం పథకం (ఏపీఎంఐపీ) వారు, ఆత్మ వారి సౌజన్యంతో బిందు, తుంపర్ల సేద్యంపై శుక్రవారం రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన (ఎంఐడీసీ) నరేష్ మాట్లాడుతూ బిందు, తుంపర్ల సేద్యం వలన రైతుకు ఎన్నోలాభాలున్నాయన్నారు. ఈ విధానంలో తక్కువ నీటితో పంటలు సాగు చేసి అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ఈ విధానంలో సాగుచేస్తున్న పంటలకు చీడపీడలు వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయన్నారు. దీంతో పురుగు మందుల ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. బిందు, తుంపర్ల విధానంలో పంటలు పండించే రైతులకు ప్రభుత్వం రాయితీ ద్వారా డ్రిప్ పరికారాలు, స్ప్రింకర్లను అందిస్తోందన్నారు. 2017-18 పంట కాలంలో 10 వేల హెక్టార్లలో బిందు సేద్యం ద్వారా పంటలు సాగుచేయడానికి ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో శ్రీనివాస్, 'ఆత్మ' రవీంద్రుడు, ఎంఐఏవో కాట్రాజు, రైతులు పాల్గొన్నారు.

పక్కా ఇళ్ల మంజూరుకు ప్రతిపాదనలు



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న బీఎమ్మార్

అల్లూరు: మండల పరిధిలోని ఇస్కపల్లి పంచాయతీలో 49మంది మత్స్యకారుల కుటుంబాలకు పక్కా ఇళ్ల మంజూరుకు కృషి చేస్తున్నానని సీఆర్‌డీఏ సభ్యుడు బీద మస్తాన్‌రావు తెలిపారు. శుక్రవారం ఇస్కపల్లి పంచాయతీలో ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ తీర ప్రాంతంలో మత్స్యకారులకు తాను ఎప్పుడూ సహకరిస్తూనే ఉంటానని, ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు మంజూరే తన లక్ష్యమన్నారు. రాయిపేటకు చెందిన 56 మంది దళిత మహిళలకు భూమి కొనుగోలు పథకం ద్వారా మంజూరైన భూమి హక్కు ధ్రువీకరణలను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ మోహన్‌రావు, ఏఈ వెంకటయ్య, స్థానిక నాయకులు బీద గిరిధర్, హారూన్ రషీద్, బండి వెంకటరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మను దర్శించిన ఎమ్మెల్సీ బీద

అల్లూరు: మండలంలోని ఇస్కపల్లిలో మూడురోజులుగా గంగమ్మ తల్లికి నిర్వహిస్తున్న మహా కుంభాభిషేకంలో శుక్రవారం ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, బీద గిరిధర్ పాల్గొన్నారు. అమ్మవారికి మహాకుంభాభిషేక అలంకరణ, అమ్మవారి దివ్యదర్శనం , మహాపూర్ణాహుతి తదితర కార్యక్రమలలో విశేషపూజలు చేశారు. ఈ సందర్భంగా గంగమ్మ ఆలయం వద్ద జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దగదర్తి: దగదర్తి మండలంలో విద్యుత్ సబ్‌స్టేషన్లు, లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ మన్మధరావు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ ఉండదని, విద్యుత్ సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఎస్సీ వర్గీకరణలో మాటతప్పిన బీజేపీ, టీడీపీలు

బిట్రగుంట: ఎన్నికల సమయంలో బీజేపీ, టీడీపీలు హామీ ఇచ్చి మాటతప్పి నేటికి మూడేళ్లుగా వర్గీకరణ అంశాన్ని పరిష్కరించకుండా నాన్చుడు ధోరణిని అవలంభిస్తున్నారని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పందిటి శ్రీనివాసులు మాదిగ అన్నారు. బోగోలు మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలను శుక్రవారం ఎమ్మార్పీఎస్. ఎంఎస్‌ఎఫ్ సభ్యుల ఆధ్వర్యంలో నిరసనలు చేస్తూ పాఠశాలలను మూసివేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఏసుపోగు జయరాజ్ మాదిగ శ్రీనివాసులు మాట్లాడుతూ మాదిగలకు న్యాయం జరిగేంతవరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సాలూరు విజయ్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు గుర్రం వెంకటేశ్వర్లు, బంకా జయరాజ్ మాదిగ, ఏగూరి మాలకొండయ్య, తేళ్ల వినయ్‌కుమార్, కొంగు ఇస్రాయేలు, ఉప్పుటూరి శివకుమార్, మర్లపాటి జాన్, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తల్లిదండ్రులకు శోకం మిగిల్చిన పుత్రులు

కొండాపురం: ఇద్దరు కుమారులు వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో మృతి చెంది ఆ తల్లితండ్రులు శోకాన్ని మిగిల్చారు. కొండాపురం మండలంలోని సాయిపేట పంచాయతీ బీసీ కాలనీలో మల్లె మాలకొండ్రాయుడు, అంకమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఎంతో కష్టపడి వారు తమ పిల్లలను అల్లారు ముద్దుగా పెంచుకున్నారు. చదువు మధ్యలోనే ఆపి కుటుంబ పోషణలో తండ్రికి చేదోడుగా ఉండేందుకు బేల్దారి పనులను చేసేందుకు ఇద్దరు కుమారులు పట్టణాలకు వలస వెళ్లారు. కూలీపనులు చేస్తూ కొంతవరకు ధనాన్ని సంపాదిస్తుడంటంతో కుటుంబం సజావుగానే సాగుతోంది. పెద్దకుమారుడు దత్తాత్రేయ(24) రెండేళ్ల కిందట తెలంగాణా రాష్ట్రంలోని నాగార్జునసాగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందా డు. ఆ విషాదం నుంచి ఇంకా తేరుకోక ముందే చిన్నకుమారుడు మహేష్ (24) గురువారం కావలి మండలం రాజువారిచింతలపాలెం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రెండేళ్ల తేడాతో ఇద్దరు కుమారులు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో తల్లిదండ్రుల రోదనకు అం తే లేకుండా పోయింది. కుమారులిద్దరూ అవివాహితులు గా 24 ఏళ్లకే మరణించడం తల్లిదండ్రులకు పుట్టెడు దుః ఖాన్ని మిగిల్చింది. ఆ కాలనీ వాసులను ఈ విషాదం కలచి వేసింది. ఆ కుటుంబాన్ని కావలి మార్కెటింగ్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ జి. నరసింహులు, జన్మభూమి కమిటీ సభ్యుడు వీ. వెంకటేశ్వర్లు, సంఘ బంధ కోశాధికారి జీ.అనుసూయమ్మ, ఇర్ల అంకబాబు, ఇర్ల మహేష్ తదితరులు పరామర్శించారు. మృతుడు మహేష్ చంద్రన్న బీమా పథకంలో నమోదు చేసుకున్నందున అంత్యక్రియలకు గాను తక్షణ సహాయంగా ఐదువేల నగదు ఐకేపీ అధికారిణి మల్లేశ్వరి కుటుంబసభ్యులకు అందచేశారు. ప్రమాదంలో మరణించినందున ఐదు లక్షల నగదు ప్రభుత్వం నుంచి అందుతుందని ఆమె తల్లిదండ్రులకు తెలిపారు.



కుమారుడి మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు



చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది

ఎమ్మార్ వ్యాక్సిన్ తప్పనిసరి

కొండాపురం: 9 నెలల నుంచి 15 ఏళ్లలోపు పిల్లలకు ఎమ్మార్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని పీహెచ్‌ఎన్ సుజాత అన్నారు. శుక్రవారం మండలంలోని సాయిపేట కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్‌ను సిబ్బంది వేశారు. పాఠశాలకు హాజరుకాని విద్యార్థులకు ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు ఆవుట్‌రీచ్ విద్యార్థులుగా భావించి వ్యాక్సిన్ వేస్తారని ఆమె తెలిపారు. కాంప్లెక్స్ పరిధిలో 711 మంది విద్యార్థులుండగా 95 శాతం మందికి వ్యాక్సిన్ వేశామన్నారు. ప్రతి బుధవారం గ్రామాలలో 9 నెలలు నిండిన చిన్నారులకు ఏఎన్‌ఎమ్‌లు వ్యాక్సిన్ వేస్తారన్నారు.

తమ్ముళ్లకు శిక్షణ తరగతులు



శిక్షణ తరగతులకు వెళ్లిన నాయకులు

అల్లూరు: తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు మండలం నుంచి టీడీపీ నాయకులు తరలివెళ్లారు. ప్రకాశం జిల్లా కందుకూరులో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి మండల కన్వీనర్ బిట్రగుంట ఉమాప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో 15మంది నాయకులువెళ్లారు. వీరిలో సయ్యద్ సాహెబ్, శ్రీకాంత్, హరీష్‌రెడ్డి, ప్రభాకర్, రాజేంద్ర, తదితరులు ఉన్నారు.

18 నుంచి వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు

వెంకటాచలం : ఈ నెల 18 నుంచి 24వతేదీ వరకు గొలగమూడి వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. 18 ఉదయం సర్వభూపాల వాహనసేవ, రాత్రికి కల్పవృక్ష వాహనసేవ, 19 ఉదయం హనుమంత వాహనసేవ, రాత్రికి చంద్రప్రభ వాహనసేవ, 20 ఉదయం చినశేష వాహనసేవ, రాత్రికి హంస వాహనసేవ, 21 ఉదయం సూర్యప్రభ వాహనసేవ, రాత్రికి గజ వాహనసేవ, 22 ఉదయం అశ్వవాహనసేవ, రాత్రికి పెదశేషవాహనసేవ, 23 ఉదయం సింహ వాహనసేవ, రాత్రికి గరుడ వాహనసేవ, 24 ఉదయం రథోత్సవం, రాత్రికి తెప్పోత్సవం నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. ఉత్సవాలు జరిగే రోజుల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు.

వైపరీత్యాలను తెలిపే టవర్


ముత్తుకూరు: ప్రకృతి వైపరీత్యాలను ముందుగా తెలుసుకునేందుకు అవసరమైన టవర్‌ను ముత్తుకూరు తహసీల్దారు కార్యాలయం వెనుక నిర్మిస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు ఎల్ అండ్ టీ సంస్థ శుక్రవారం ప్రారంభించింది. ఆ సంస్థ రాష్ట్ర ప్రతినిధి సుజన్ మాట్లాడుతూ ఈ టవర్ నిర్మాణం ద్వారా సునామీ, తుపాను, పిడుగులు, భూకంపాల రావడానికి ముందే సమాచారం తెలుస్తుందన్నారు. తద్వారా ఏర్పడే ముప్పు నుంచి తప్పించుకునే అవకాశం ఉందన్నారు. తహసీల్దారు పర్యవేక్షణలో సమాచార నిర్వహణ ఉంటుందన్నారు.

అడుగడుగునా గోతులే...

జలదంకి: తొమ్మిదోమైలు నుంచి బీకే అగ్రహారం, బ్రాహ్మణక్రాక మీదుగా బోగోలు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు అడుగడుగునా గోతులు పడి వాహనచోదకులకు పరీక్ష పెడుతోంది. దాదాపు ఐదు కిలోమీటర్ల దూరం బోగోలు మండలం తాళ్ళూరు పొలిమేర వరకు రోడ్డంతా తారు లేచి మార్జిన్లు అధ్వానంగా మారాయి. రాత్రిళ్లు ద్విచక్రవాహనదారులు గోతులలో పడి పలువురు గాయపడుతున్నారు. బ్రాహ్మణక్రాక నాయుడుచెరువు సమీపంలో కల్వర్టు రంధ్రం పడడంతో స్థానికులు కంకర తోలి పూడ్చారు. రోడ్డు అధ్వాన స్థితిపై ఆర్ అండ్‌బీ అధికారులకు విన్నవించినా ఫలితం లేదని స్థానికులు వాపోయారు. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే రద్దీ రోడ్డు ఇలా ఉంటే పట్టించుకోకపోవడంపై స్థానికులు సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలంటున్నారు.



రోడ్డుపై గోతుల్లో నిలిచిన వర్షపు నీరు



రోడ్డు మధ్యలో లేచిపోయిన తారు

భార్యను వేధించిన

న్యాయవాదికి ఐదేళ్ల జైలు శిక్ష

కోవూరు: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన ఓ న్యాయవాదికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ శుక్రవారం మేజిస్ట్రేట్ పెదఖాసీమ్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కోవూరు మండల పరిధిలోని గంగవరం గ్రామానికి చెందిన నెల్లూరు కాశయ్య కుమార్తె మస్తానమ్మ వివాహం పదేళ్ల క్రితం నెల్లూరు నగరానికి చెందిన మోచర్ల సురేష్‌తో జరిగింది. ఆయన న్యాయవాదిగా నెల్లూరు కోర్టుల్లో ప్రాక్టీస్ చేస్తున్నారు. వారికి ఓ కుమారుడు పుట్టాడు. వివాహమైన తరువాత కొంత కాలానికి భార్యను అదనపు కట్నం కోసం వేధించడం ప్రారంభించాడు. వేధింపులు తట్టుకోలేక ఆమె గంగవరంలోని పుట్టింటికి వచ్చేసింది. న్యాయం చేయాల్సిందిగా కోరుతూ కోవూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. రూ.2.15లక్షలు జరిమానా విధించారు. న్యాయవాదికి శిక్ష పడటం ఆసక్తిని సంతరించుకొంది.

షార్‌లో రాగితీగ చోరీ

● నిందితుడి పట్టివేత, మరో ముగ్గురు పరారీ

శ్రీహరికోట,(సూళ్లూరుపేట): శ్రీహరికోట సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రం 2వ ప్రయోగవేదిక 1వ గేట్‌వద్ద ఓ బ్యాగులో 6 చుట్టల రాగివైరును దొంగతనంగా తీసుకువెళ్తున్న ఓ యువకుడిని సీఐఎస్ఎఫ్ బలగాలు శుక్రవారం పట్టుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు దొరవారిసత్రం మండలం తనియాలికి చెందిన వేలూరు కుమారస్వామి, కె. నాగరాజు, ఎస్‌కే షరీఫ్, బి. సోమశేఖర్ ఓ కాంట్రాక్టర్ వద్ద కూలీ పనులు చేసేవారు. షార్‌లోని రాగివైరును వీరు తస్కరించి ఓ బ్యాగులో వేశారు. వేలూరు కుమారస్వామి ఈ బ్యాగును తీసుకువస్తుండగా సీఐఎస్ఎఫ్ పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. 7.4 కిలోల రాగి వైరుతోపాటు ఆ యువకుడిని అదుపులోకి తీసుకుని శ్రీహరికోట పోలీసులకు అప్పగించారు. వారి దర్యాప్తులో ఈ చోరీలో తనియాలికి చెందిన నాగరాజు, షరీఫ్, సోమశేఖర్ ప్రమేయం కూడా ఉన్నట్లు నిందితుడు కుమారస్వామి తెలిపినట్లు ఎస్ఐ చెంగయ్య తెలిపారు. నిందితుడిని కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.



చోరీకి పాల్పడ్డ యువకుడు

రైలు ఢీకొని ఒకరి మృతి

గూడూరు (టౌన్): గూడూరు మండలంలోని దివిపాళెం రైల్వే గేటు వద్ద గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. గూడూరు మండలం విందూరు గ్రామానికి చెందిన చిన్నబ్బయ్య(45) దివిపాళెం రైల్వే గేటు సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు గూడూరు నుంచి చెన్నై వైపు వెళ్లే ఓ రైలు ఢీ కొనడంతో మృతి చెందాడు. ఈ మేరకు రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.



చిన్నబ్బయ్య మృతదేహం

అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి

ఉదయగిరి రూరల్: మండల పరిధిలోని గన్నేపల్లి పంచాయతీ మిట్టపల్లి గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. స్థానికంగా నివసించే దారపనేని కేశవులు(45) వరికుంటపాడు మండలం రామాపురానికి చెందిన చెన్నమ్మను వివాహం చేసుకుని అక్కడే ఉంటున్నాడు. స్వగ్రామమైన మిట్టపల్లిలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చి వెళుతుండేవాడు. పది రోజులుగా కేశవులు మిట్టపల్లిలో తల్లిదండ్రుల వద్దనే ఉంటున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయలుదేరిన ఆయన గ్రామ సమీపంలోని పొలాల్లో అపస్మారకస్థితిలో పడి ఉండడం గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు తెలియచేశారు. వారు 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతని మృతికి కారణాలు తెలియరాలేదు.

85 కేజీల వానపాముల పట్టివేత

చిల్లకూరు: మండలంలోని బూదనం టోల్ ప్లాజా సమీపంలో శుక్రవారం సీఐ అక్కేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి 85 కేజీల వానపాములు పట్టుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ అంకమ్మ మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం ఆరంబాకంకు చెందిన జయకుమార్, డీన్ అహ్మద్‌లు కుమరన్ అనే వ్యక్తి దగ్గర నుంచి వానపాములు కొనుగోలు చేసి ఆరంబాకం నుంచి నెల్లూరుకు కారులో తరలిస్తుండగా టోల్ ప్లాజా సమీపంలో వాహనాలు తనిఖీ చేసి 85 కేజీల వానపాములు, ఇద్దరు నిందితులు, కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వానపాములను అటవీశాఖ అధికారులకు అప్పగిస్తామన్నారు.

ఫైనాన్స్ భూతం

- వాహనాల రుణం పేరుతో నిలువు దోపిడీ
- జిల్లాలో 300 పైగా అనధికార సంస్థలు
- ఫ్లాట్ అంటూ రూ.10 వడ్డీతో రుణం
- బెంబేలెత్తుతున్న సామాన్య ప్రజానీకం..



నెల్లూరు(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 44 వేల ఆటోలు, గూడ్స్ వాహనాలు 23 వేలు, కార్లు 30 వేలు, 3.5 లక్షల బైక్‌లు జిల్లాలో ఉన్నాయి. మరో 20 వేలకుపైగా ట్రాక్టర్ ట్రాలీలు ఉన్నాయి. వీటిలో సింహభాగం ఫైనాన్స్‌లో ఉంటాయి. అందులోనూ అనధికార ప్రైవేటు ఫైనాన్షియర్ల వద్ద ఉన్నవే ఎక్కువ. చాలా మంది పేద, మధ్య తరగతి వారే ఎక్కువగా ట్రాన్సుపోర్టు వాహనాలైన ఆటోలు, ట్రాక్టర్లు కొనుగోలు చేస్తుంటారు. వాటి ద్వారానే జీవనం సాగిస్తుంటారు. అయితే పూర్తి మొత్తం చెల్లించి వాహనాన్ని కొనుగోలు చేసే స్తోమత వారికి ఉండదు. ఎవరివద్దనైనా ఫైనాన్స్ తీసుకొని నెలసరి పద్దులు చెల్లిస్తుంటారు. ఒకప్పుడు లైసెన్స్ పొందిన ఫైనాన్స్ సంస్థల వద్దే ఫైనాన్స్ తీసుకునే వారు. ఆ సంస్థలు ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం పని చేస్తాయి. ఆర్‌బీఐ నిర్దేశించిన వడ్డీ విధించడంతోపాటు ప్రభుత్వానికి స్టాంప్ డ్యూటీ చెల్లిస్తారు. వరుసగా మూడు నెలలు ఈఎంఐ చెల్లించకపోతే వాహనాన్ని తీసుకెళ్తారు. అప్పుడు ఆ మొత్తానికి వడ్డీ కట్టి వాహనాన్ని విడిపించుకునే అవకాశం ఉండేది. లైసెన్స్ కలిగిన సంస్థల్లో ప్రతి సంవత్సరం ఆడిటింగ్ జరుగుతుండటంతో ఇష్టం వచ్చిన విధంగా వసూలు చేసే అవకావం ఉండేది కాదు. అయితే ఈ సంస్థల్లో ఫైనాన్స్ పొందాలంటే అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉండాల్సి ఉండడంతో వాహన కొనుగోలుదారులు ఇబ్బంది పడేవారు. ఇదే అదునుగా ఇటీవల కాలంలో అనధికార ఫైనాన్షియర్లు జిల్లాలో ఎక్కువయ్యారు. వీరు ప్రభుత్వానికి స్టాంప్ డ్యూటీ చెల్లించరు.. ఆర్‌బీఐ నిబంధనలూ పాటించరు. ఫైనాన్స్ కోసం వచ్చిన వారి అవసరాన్ని బట్టి వీరు వడ్డీ విధిస్తారు.

● **ఫ్లాట్ పేరుతో నిలువు దోపిడీ**

ప్రస్తుతం జిల్లాలో సుమారు 300 మంది వరకు అనధికార ఫైనాన్షియర్లు ఉన్నట్లు సమాచారం. అందులో 250 మంది వరకు ఒక్క నెల్లూరు నగరంలోనే ఉన్నారు. మిగిలిన వారు గూడూరు, కావలి, నాయుడుపేట ప్రాంతాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. మిగతా ప్రాంతాల్లో ఒకరిద్దరు చొప్పున ఫైనాన్స్ ఇస్తున్నారు. కాగా వీరికి చాలా వాహన షోరూంలు సహకరిస్తాయి. లైసెన్స్‌డ్ ఫైనాన్స్ సంస్థల నుంచి ఫైనాన్స్ పొందడం కొంచెం కష్టంగా మారడంతో కొందరు వాహనాలు కొనేందుకు షోరూంలకు వచ్చినా ఫైనాన్స్ దొరక్క వెనుదిరుగుతున్నారు. దీంతో ఆ షోరూంల యజమానులు ఈ అనధికార ఫైనాన్షియర్లతో సంబంధాలు పెట్టుకుని, రుణసదుపాయం కల్పిస్తున్నారు. ఎక్కువ డాక్యుమెంట్లు అవసరం లేకుండా ఫైనాన్స్ ఇచ్చేస్తారు. ఫైనాన్స్ తీసుకునేవాళ్లు ముందుగా ఫైనాన్షియర్ సూచించిన నిబంధనలకు ఒప్పుకుంటూ సంతకాలు పెట్టాలి. సుమారు నలభై వరకు సంతకాలు తీసుకుంటారు. అనివార్య పరిస్థితుల్లో ఒక నెల ఈఎంఐ కట్టకపోతే వాహనాన్ని తీసుకెళ్లవచ్చన్న నిబంధన అందులో ఉంటుంది. అయితే వీరు విధించే వడ్డీని చూస్తే ఆశ్చర్యం కలగకతప్పదు. ఎంత ఫైనాన్స్ తీసుకుంటారో అంత మొత్తానికి ఎన్ని నెలలు పద్దులు పెట్టుకుంటారో అన్ని నెలలకు కలిపి ఒకేసారి వడ్డీ లెక్కించి ఆ మొత్తాన్ని నెలసరి వాయిదాలుగా విభజిస్తారు. అంటే వినియోగదారుడు నెల వాయిదా చెల్లిస్తున్నా దానికి మాత్రం వడ్డీ ఉండదు. కట్టిన మొత్తానికి వడ్డీ కూడా తగ్గదు. చివరి నెల వరకు ఫైనాన్స్ తీసుకున్న మొత్తానికి వడ్డీ చెల్లించాల్సిందే. ఈ లెక్కన చూస్తే మొదట ఇచ్చేటప్పుడు రూ.2 వడ్డీతో ఇస్తారు. అది ఫైనాన్స్ తీరేసరికి రూ.8 నుంచి 10 వడ్డీ లెక్కకు వస్తుందని అంచనా. ఉదాహరణకు ఒక వ్యక్తి ఆటో కోసం రూ.లక్ష ఫైనాన్స్ తీసుకున్నాడంటే నలభై నెలలు వాయిదాలు నిర్ణయించుకుంటే ఆ ప్రకారం రూ.2 వడ్డీ లెక్కన నలభై నెలలకు రూ.80 వేలు అవుతుంది. అంటే మొత్తం రూ.1.8 లక్షలు అన్నమాట. ఈ నలభై నెలలకు సరాసరి చొప్పున నెలకు రూ.4,500 వాయిదా చెల్లించాలి.

● **ఆలస్యమైతే బెదిరింపులు**

పలువురు ఫైనాన్షియర్లు జట్టుగా చేరి కొంత మంది రికవరీ ఏజెంట్లను నియమించుకుంటారు. వీరిలో ఎక్కువగా రౌడీ నేపథ్యం ఉన్నవారే ఉంటారు. ఈ ఏజెంట్లు నిత్యం రికవరీ జాబితా తీసుకుని తిరుగుతుంటారు. ఎవరైనా ఒక నెల వాయిదా చెల్లించకపోతే మరుసటి రోజే ఆ ఇంటి ముందు ప్రత్యక్షమవుతారు. బెదిరింపులకు దిగుతారు. కొన్ని సమయాల్లో వాహనాలు కూడా తీసుకెళ్లిపోతారు. ఇటీవల నెల్లూరు నగరంలో అనధికారికంగా ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్న ఓ కార్పొరేటర్ వద్ద హరనాథపురానికి చెందిన ఓ వ్యక్తి బైక్ కోసం రూ.37 వేలు ఫైనాన్స్ తీసుకున్నాడు. మొత్తానికి రూ.2 వడ్డీ లెక్కన నెలనెలా వాయిదాలు చెల్లించడం ప్రారంభించాడు. అయితే మధ్యలో ఒక నెల వాయిదా కట్టడం ఆలస్యమైంది. దీంతో వెంటనే ఆ ఫైనాన్స్ కార్పొరేటర్ ఏజెంట్లు సదరు వ్యక్తి ఇంటి వద్దకు వచ్చి బైక్ తీసుకెళతామని బెదిరించారు. ఇది తెలుసుకున్న సదరు ఫైనాన్షియర్ అక్కడికి చేరుకున్నారు. ఇంతలో సదరు వ్యక్తికి చెందిన వారంతా ఇంటి వద్దకు రావడంతో ఇప్పుడు గొడవ పెట్టుకుంటే తన భాగోతం బయటపడుతుందని ఆ ఫైనాన్స్ కార్పొరేటర్ వచ్చే నెల నుంచి సమయానికి వాయిదా చెల్లించాలని వెళ్లిపోయాడు. కాగా సమయానికి వాయిదా చెల్లించలేకపోతే ఓవర్ డ్యూ పేరుతో కొంత మొత్తాన్ని జరిమానాగా వసూలు చేస్తారు. అదే విధంగా వాహనం ఫైనాన్స్ ఇచ్చేటప్పుడు స్టాంపింగ్ చార్జెస్, డాక్యుమెంట్ చార్జెస్, ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్ చార్జెస్ అంటూ రకరకాల పేరుతో అదనంగా తీసుకుంటారు.

వివాహిత బలవన్మరణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ (ఇన్‌సెట్‌లో) ధనలక్ష్మి(ఫైల్)

- ఉరేసుకొని ఆత్మహత్య
- అల్లుడి వేధింపులతోనేనని తండ్రి ఫిర్యాదు
- పోలీసుల అదుపులో అల్లుడు
- వెలుగులోకి ఆలస్యంగా ఘటన

నెల్లూరు (క్రైం): సంతోషంగా వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టిన నెలలోనే ఆమెకు కష్టాలు ప్రారంభమయ్యాయి. భర్త అన్ని వ్యసనాలకూ బానిసయ్యాడు. భార్యను నిత్యం వేధించసాగాడు. మారాలని ఆమె వేడుకొంది. అతనిలో మార్పు రాలేదు. భర్త వేధింపులకు తట్టుకోలేక ఆమె ఎక్కువగా తల్లిదండ్రుల వద్దే ఉంటూ వచ్చింది. రెండు మూడుసార్లు కుటుంబ పెద్దలంతా సర్దిచెప్పి ఆమెను కాపురానికి పంపించారు. ఏమైందో.. ఏమో కానీ భర్త ఇంట్లో లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. గురువారం జరిగిన ఈ సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు భర్తను అదుపులోకి తీసుకున్నారు.. వివరాల్లోకి వెళితే.. పొదలకూరు మండలం చెన్నారెడ్డిపాలెం గ్రామానికి చెందిన పలుకూరు నారాయణరెడ్డికి కుమారుడు ఓబులేరెడ్డి, కుమార్తె ధనలక్ష్మి(20) ఉన్నారు. కుమారుడు ప్రస్తుతం ఎంబీఏ చదువుతున్నాడు. కుమార్తె ఇంటర్మీడియట్ వరకూ చదివింది. తన ఆర్థిక పరిస్థితులు బాగోలేకపోవడంతో నారాయణరెడ్డి తన కుమార్తెకు గతేడాది ఏప్రిల్ 20న తూర్పుపల్లి గ్రామానికి చెందిన కోడూరు నరసింహారెడ్డితో పెద్దల సమక్షంలో వివాహం చేశాడు. పెళ్లయిన 20 రోజులకే అతను భార్యతో గొడవలు పెట్టుకోసాగాడు. ఆమెను పుట్టింట్లో వదిలి వెళ్లాడు. నవంబరులో అందరూ సర్దిచెప్పి అత్తారింటికి కాపురానికి పంపించారు. అప్పుడప్పుడూ భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో ఆమె తన బాధలను పుట్టింట్లో చెప్పేది. ఈ నేపథ్యంలో వారు ఆరు నెలల క్రితం నగరంలోని వేదాయపాలెం రైల్వేగేటు సందులో ఉన్న సాహితీ ప్యారడైజ్ అపార్ట్‌మెంట్‌లో ఇంటిని అద్దెకు తీసుకున్నారు. నరసింహారెడ్డికి జేసీబీలు ఉన్నాయి. వాటి నిర్వాహణ నిమిత్తం ఎక్కువగా బయటే ఉండేవాడు. అప్పుడప్పుడూ ఇంటికి వచ్చేవాడు. ఆమె ఒంటరిగా ఉండలేక తిరిగి తండ్రి వద్దకు వెళ్లిపోయింది. ఇటీవల ఇరు కుటుంబాల వారు ఆమెకు మళ్లీ నచ్చచెప్పారు. ఈ నెల 9వ తేదీన తన మామ పెంచలరెడ్డి ఆమెను అపార్టుమెంట్‌లో వదలి వెళ్లాడు. ఈనెల 10న మధ్నాహ్నం ధనలక్ష్మి తన భర్తతోపాటు తల్లిదండ్రులకు కూడా ఫోన్‌చేసి మాట్లాడింది. తాను ఒంటరిగా ఉండలేక పోతున్నానని తెలిపింది. కాలక్షేపం కోసం టీవీ, ఇంటి సామగ్రి కొనుగోలు చేసి ఇవ్వాలని తండ్రిని కోరింది. శనివారం వచ్చి అన్నీ తీసిస్తానని చెప్పాడు. అదేరోజు సాయంత్రం అల్లుడు నరసింహారెడ్డి తన మామకు ఫోన్ చేసి 'నీ కుమార్తె ఉరివేసుకుని' మృతి చెందిందని సమాచారం అందించాడు. దాంతో ఆయన బంధువులతో కలిసి నెల్లూరుకు చేరుకున్నాడు. కుమార్తె మృతదేహాన్ని చూసి బోరున విలపించాడు. ఈ సంఘటనపై అపార్టుమెంటు వాసులు బోదనగర పోలీసులకు సమాచారం అందించారు. నగర ఇన్‌చార్జి డీఎస్పీ బాలసుందరరావు, సీఐ మంగారావు, ఎస్ఐ విజయ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. తన కుమార్తెను అల్లుడు శారీరకంగానూ, మానసికంగానూ వేధింపులకు గురి చేయడంతోనే ఆమె బలవన్మరణానికి పాల్పడిందని మృతురాలి తండ్రి నారాయణరెడ్డి ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు మృతిరాలి భర్తను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతురాలి తండ్రితో మాట్లాడుతున్న డీఎస్పీ

విష జ్వరాల నివారణకు ప్రత్యేక చర్యలు

డీఎంహెచ్‌వో వరసుందరం



? : జిల్లాలో జ్వరాల అదుపునకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! : ప్రస్తుతం వర్షాకాలం కావడంతో జ్వరాల తీవ్రత ఎక్కువగానే ఉంది. విష జ్వరాల కేసులు కూడా నమోదవుతున్నాయి. ఎక్కడెక్కడ జ్వరాలు ప్రబలుతున్నాయో తెలుసుకుని ఆయా ప్రాంతాల్లో జ్వరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

? : డెంగ్యూ, మలేరియా వ్యాధుల నివారణ పరిస్థితి ఏమిటి.

! : జిల్లాలో డెంగ్యూ, మలేరియా కేసులు నమోదవుతున్నాయి. నెల్లూరులో ఈ వ్యాధితో ఓ చిన్నారి మృతి చెందింది. ఈ నేపథ్యంలో ప్రాణాంతక వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటి నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో ఈ వ్యాధుల లక్షణాలున్న కేసులు నమోదయ్యాయి. అక్కడ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

? : దోమల నివారణ ఎలా...

! : విష జ్వరాలకు కారణమైన దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటిని పరిశీలించి నీటి నిల్వలు ఉంచుకోవద్దని సూచిస్తున్నాం. మూడురోజులకు మించి నీటి నిల్వలు ఉంటే డెంగ్యూ వ్యాధికి కారణమైన టైగర్ దోమ ఆ మంచి నీటిలోనే తన సంతతిని పెంచుకుంటుంది. ఈ పరిస్థితిలో ఎవ్వరూ నీటినిల్వలను ఉంచుకోవద్దు. అలాగే లార్వా దశలోనే దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. మందులు స్ప్రేచేసి వాటిని నిర్మూలిస్తున్నాం.

? : వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా...

! : జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రత్యేకించి డెంగ్యూ, మలేరియా వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఆయా వ్యాధులకు గురికాకుండా తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలను వివరిస్తున్నాం. ఒకవేళ వ్యాధులు వస్తే ఎలాంటి చికిత్సలు తీసుకోవాలి, అందుబాటులో ఉన్న వైద్య విధానాలు ఏమిటి, ఏ ఆసుపత్రికి వెళ్లాలి వంటి వివరాలు తెలియజేస్తున్నాం.

- నెల్లూరు (వైద్యం)

పోలీస్ కస్టడీకి క్రికెట్ బుకీలు



కృష్ణసింగ్ షేక్.షంషీర్ డీటీఎస్ రమేష్ రమేష్‌కుమార్ అనిల్‌కుమార్

- ఐదుగురిని అప్పగించిన న్యాయస్థానం
- తిరిగి ప్రారంభమైన విచారణ

నెల్లూరు (క్రైం) : జిల్లాలో సంచలనం రేపిన క్రికెట్ బుకీల అరెస్టులు, విచారణ పూర్తయిందని ఊపిరి పీల్చుకున్న కొంతమంది కీలక నేతల గుండెల్లో గుబులు ప్రారంభమైంది. ఈ నెల 3వ తేదీన కీలకమైన జాతీయ బుకీలను అరెస్టు చూపి రిమాండ్ తరలించడంతో ఈ బెట్టింగ్ వ్యవహారం ఇక ముగిసిందనుకున్నారు. అయితే, తప్పించుకున్న నిందితులతోపాటు సూత్ర, పాత్రధారులైన కొందరు పెద్ద మనుషుల వ్యవహారం బట్టబయలు చేసేందుకు ఎస్పీ రంగం సిద్ధం చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన దేవళం కృష్ణసింగ్‌తో పాటు మూలాపేటకు చెందిన షేక్.షంషీర్, స్టోన్‌హౌస్‌పేట పప్పులవీధికి చెందిన ఉట్లుకూరు వెంకటరమేష్ అలియాస్ డీటీఎస్ రమేష్, సూళ్లూరుపేటకు చెందిన అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, స్టోన్‌హౌస్‌పేటకు చెందిన తిన్నేరు రమేష్‌కుమార్, కావలికి చెందిన గుర్రం వెంకటేశ్వర్లు, బుచ్చికి చెందిన నంద్యాల అరుణ్‌కుమార్, పొదలకూరుకు చెందిన మన్నెం శ్యాంప్రసాద్, నెల్లూరుకు చెందిన దాసరి సుశాంత్‌లను ప్రధాన ముద్దాయిలుగా గుర్తించారు. వీరిపై మాదక ద్రవ్యాల నిరోధక చట్టం, విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దౌర్జన్యం వంటి సంఘటనలతో కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. దీంతో నాన్ బెయిలబుల్ సెక్షన్‌లతో వీరిని కేంద్ర కారాగారానికి తరలించారు. వీరితోపటు మరో 21 మంది బుకీలు, 85 మంది పంటర్లు, బెట్టింగ్ రాయుళ్లపై కూడా కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా వీరందరికీ బెయిల్ మంజూరైంది.

● పోలీసు కస్టడీలోకి బుకీలు..

కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న 9 మంది ప్రధాన బుకీల్లో ఐదుగురిని శుక్రవారం పోలీసు కస్టడీలోకి తీసుకున్నారు. వీరిలో దేవళం కృష్ణసింగ్, షేక్.షంషీర్, ఉట్లుకూరు వెంకటరమేష్ అలియాస్ డీటీఎస్ రమేష్, తిన్నేరు రమేష్ కుమార్, అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. పోలీసు కస్టడీకి అప్పగిస్తూ మెదటి తరగతి 5వ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఇన్‌చార్జి జడ్జి వాసుదేవన్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో పోలీసులు ఈ ఐదుగురు బుకీలను మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని తిరిగి విచారణ ప్రారంభించారు. ఈ బెట్టింగ్‌ల వ్యవహారంలో ఇంకెంత మంది కీలకంగా వ్యవహరించారు? ఎంతమంది నేతలకు ఇందులో భాగస్వామ్యం ఉందన్న అంశాలతోపాటు పోలీసుల పాత్రపైనా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టేందుకు ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ సన్నద్ధమయ్యారు. పరారీలో ఉన్న వారి కోసం కూడా పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. దీంతో ఈ కేసు తిరిగి పోలీసుల చేతికి వెళ్లడంతో దీంట్లో భాగస్వామ్యులైన వారి గుండెల్లో గుబులు మొదలైంది.

క్రికెట్ పంటర్ అనిల్‌బాబు అరెస్ట్

నెల్లూరు (క్రైం) : జిల్లాలో సంచలనం కలిగించిన క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో కొన్ని రోజులుగా తప్పించుకు తిరుగుతున్న క్రికెట్ పంటర్ కొండూరు అనిల్‌బాబును శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. నెల్లూరు బీవీ నగర్‌లోని అతని నివాసం వద్ద ఐదో నగర సీఐ మంగారావు అనిల్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. విచారణలో కీలకమైన అంశాలు వెల్లడించినట్లు తెలిసింది.

స్వర్ణాంధ్రప్రదేశ్ బడాబాబులకా..

బలహీన వర్గాలకా!?

కేంద్ర కార్మిక శాఖ కనీస వేతనాల సలహా బోర్డు చైర్మన్ ఆవుల గోవర్ధన్

నెల్లూరు (క్యాంపస్) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిత్యం స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మిస్తామని వాగ్దానాలు చేస్తుంటారని, అయితే ఆ స్వర్ణాంధ్ర ప్రదేశ్ బడాబాబుల కోసమా, బడుగు బలహీన వర్గాల కోసమో అర్థం కావడం లేదని కేంద్ర కార్మిక శాఖ కనీస వేతనాల సలహా బోర్డు చైర్మన్ ఆవుల గోవర్ధన్ అన్నారు. శుక్రవారం నెల్లూరు జిల్లాలోని పలు పరిశ్రమల్లో పర్యటించిన ఆయన అక్కడ పని చేస్తున్న కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నగరంలోని బీజేపీ కార్యాలయంలో విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత కార్మికుల గురించి అసలు ఆలోచించడం లేదన్నారు. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం కార్మిక శాఖ కనీస వేతనాల సలహా బోర్డులో వేతనాల సవరణపై చర్చించి రెండు సార్లు కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు అసలు కార్మిక శాఖ కనీస వేతనాల సలహా బోర్డు ఏర్పాటు చేయలేదని, బోర్డు లేనప్పుడు వేతనాలు ఎలా పెంచుతారని ప్రశ్నించారు. వెంటనే కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు ఇచ్చేందుకు కార్మిక శాఖ కనీస వేతనాల సలహా బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లడుతున్న కేంద్ర కార్మిక శాఖ కనీస వేతనాల సలహా బోర్డు చైర్మన్ ఆవుల గోవర్ధన్

వెంకయ్యను కలిసిన బీజేపీ నాయకులు



ఢిల్లీలో వెంకయ్యానాయుడుతో బీజేపీ నాయకులు

నెల్లూరు (క్యాంపస్) : ఉపరాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేసిన ముప్పవరపు వెంకయ్యానాయుడును శుక్రవారం ఢిల్లీలో బీజేపీ జిల్లా నాయకులు కలిసి సన్మానించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి మాట్లాడుతూ బీజేపీలో కీలక నాయకుడిగా వ్యవహరించిన వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతి కావడం గర్వకారణమన్నారు. ఆయన చూపిన బాటలోనే అడుగులు వేస్తూ పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ కాలేషా సస్పెన్షన్ ఎత్తివేత

నెల్లూరు (వైద్యం) : నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యుడు కాలేషా సాహెబ్‌పై సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారన్న కారణంగా రెండు ఇంక్రిమెంట్లు కోత విధించింది. జూన్ 16వ తేదీన కలువాయికి చెందిన సుబ్బరాయుడు అనే రోగి ఆసుపత్రిలో మృతి చెందడానికి డాక్టర్ కాలేషా నిర్లక్ష్యమే కారణమంటూ వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య ఈ నెల 4వ తేదీన డాక్టర్ కాలేషాను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే, ప్రభుత్వ వైద్యుల సంఘం ఆందోళన ఫలితంగా ఈ నెల 7వ తేదీ గుంటూరు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్బారావు బృందం నెల్లూరులో విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దానిని పూర్తిగా పరిశీలించిన డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుషన్ వారు డాక్టర్ కాలేషాపై సస్పెన్షన్ ఎత్తివేశారు.

ఎరువుల దుకాణాలపై దాడులు

కోట: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలపై శుక్రవారం సాయంత్రం వ్యవసాయశాఖ స్పెషల్ స్క్వాడ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ మేరకు వ్యవసాయశాఖ ఏడీ మారుతీదేవి ఆధ్వర్యంలో దుకాణాల్లో విక్రయాలపై ఆరాతీశారు. రికార్డులు పరిశీలించారు. లైసెన్స్‌కు సంబంధించిన ఓ ఫారాలు లేకుండా ఎరువులు విక్రయాలు జరిపి ఉన్నట్లు గుర్తించారు. దీంతో రెండు ఎరువుల దుకాణాల్లో రూ.3.53 లక్షల విలువైన ఎరువులు విక్రయించరాదని ఆదేశించారు. ఆమె వెంట వ్యవసాయ అధికారి నిర్మల, సిబ్బంది ఉన్నారు.

టీడీపీ సంస్థాగత
కమిటీల నియామకం

నెల్లూరు(ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా కొత్తగా ఎన్నికైన మండల, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర శుక్రవారం ప్రకటించారు. మూడేళ్ల క్రితమే ఎన్నికలు పూర్తయినా పలు కారణాలతో జాబితా ప్రకటించడం వాయిదా పడింది. శుక్రవారం జాబితా విడుదలైంది. వివరాలు ఇలా ఉన్నాయి.

మండలం/పట్టణం	అధ్యక్షుడు	ప్రధాన కార్యదర్శి
అల్లూరు	బిట్రగుంట ఉమాప్రసాద్‌రెడ్డి	షేక్.సయ్యద్‌సాహెబ్
బోగోలు	మాలేపాటి నాగేశ్వరరావు	పాయసం శ్రీనివాసరావు
దగదర్తి	బొట్టా ఆదినారాయణ	కంచర్ల వెంకటకృష్ణ
కావలి	యాదగిరి సుబ్బరాయుడు గుప్తా	జ్యోతిబాబురావు
కావలిరూరల్	కోసూరు వెంకటేశ్వర్లు	ప్రళయకావేరి భాస్కర్
చేజర్ల	మోడేపల్లి కృష్ణచౌదరి	రావి లక్ష్మీనరసారెడ్డి
ఆత్మకూరురూరల్	సుంకర పెంచలచౌదరి	కేతా విజయభాస్కర్‌రెడ్డి
ఏఎస్‌పేట	ఏలూరి మాల్యాద్రి	పులిమి సుధాకర్‌రెడ్డి
అనంతసాగరం	మెట్టుకూరు కృష్ణారెడ్డి	శాకమూరి సుబ్బారావు
సంగం	గండ్లపల్లి శ్రీనివాసయాదవ్	ఆనం ప్రసాద్‌రెడ్డి
మర్రిపాడు	శాకమూరి నారాయణ	ఒంటెద్దు కృష్ణారెడ్డి
ఆత్మకూరు	చిల్లారి ఆదిశేషయ్య	పుచ్చలపల్లి రవీంద్రరెడ్డి
విడవలూరు	బెజవాడ వంశీకృష్ణారెడ్డి	నాటారు వెంకటేశ్వర్లు
కొడవలూరు	కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి	పాటూరు రమేష్
ఇందుకూరుపేట	రావిళ్ల వీరేంద్రకుమార్	బొద్దుకూరు సుధాకర్
కోవూరు	ఏలూరు కృష్ణయ్య	గునపాటి రవీంద్రరెడ్డి
బుచ్చిరెడ్డిపాళెం	బత్తల హరికృష్ణ	దుగ్గిశెట్టి హరనాథ్
నెల్లూరురూరల్	వేమిరెడ్డి అశోక్‌రెడ్డి	పులి రాంగోపాల్
వెంకటాచలం	దశరథ నాగేంద్రప్రసాద్‌యాదవ్	ఈపూరు సుబ్బారెడ్డి
మనుబోలు	గాలి రామకృష్ణారెడ్డి	సూరపనేని కిషోర్
తోటపల్లిగూడూరు	బొమ్మి సురేంద్ర	తోటపల్లి రామ్మోహన్
ముత్తుకూరు	దువ్వూరు విశ్వమోహన్‌రెడ్డి	ఆలూరు విష్ణువర్ధన్‌రెడ్డి
పొదలకూరు	మోపూరు శ్రీనివాసులురెడ్డి	కండే మస్తానయ్య
కోట	మద్దాలి సర్వోత్తమరెడ్డి	కృష్ణపట్నం చంద్రశేఖర్
వాకాడు	దువ్వూరు అజిత్‌రెడ్డి	దోసకాయల కృష్ణమూర్తి
చిల్లకూరు	పెనుబోలు జానకీరామిరెడ్డి	సరుపూరు సురేష్
చిట్టమూరు	గణపర్తి కిషోర్	గుంపర్ల చిన్న నారాయణ
గూడూరురూరల్	కొండూరు వెంకటేశ్వరరాజు	అల్లి గోవర్ధన్
గూడూరు	పులిమి శ్రీనివాసులు	నిమ్మకాయల నరసింహులు
పెళ్లకూరు	వేలూరు మురళీకృష్ణారెడ్డి	గంగాబత్తిన రామకృష్ణ
తడ	కామిరెడ్డి మురళీరెడ్డి	రామాపురం నీలకంఠం
ఓజిలి	విజయ్‌కుమార్‌నాయుడు	నల్లమాకల కమలాకర్‌బాబు
నాయుడుపేటరూరల్	కామిరెడ్డి రాజారెడ్డి	బిరదవాడ నారాయణ
నాయుడుపేటటౌన్	కందలి కృష్ణారెడ్డి	నన్నబాల సుబ్బారావు
సూళ్లూరుపేటరూరల్	కొప్పు శంకరయ్య	పాశం వెంకటసుబ్బయ్య
సూళ్లూరుపేట టౌన్	వాకిచర్ల రమేష్	ఏఆర్.బాలచంద్ర
దొరవారిసత్రం	వేనాటి సతీష్‌రెడ్డి	టి.శ్రీనివాసులు
బాలాయపల్లి	రావి మస్తాన్‌నాయుడు	కును శ్రీహరి
డక్కిలి	పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి	మేరిగ రామయ్య
వెంకటగిరి	మంకు ఆనంద్	శ్రీరామదాసు గంగాధర్
వెంకటగిరిరూరల్	కొక్కు సంజీవరెడ్డి	చెంచు నరసింహులు
సైదాపురం	గుంటమడుగు కృష్ణంరాజు	అమ్మినేని సుబ్రహ్మణ్యం
రాపూరు	దందోలు వెంకటేశ్వరరెడ్డి	ముళ్లపాటి సుబ్బయ్య
కలువాయి	గోనుగుంట వెంకటేశ్వరనాయుడు	షేక్.కరిముల్లా
ఉదయగిరి	దుగ్గిబోయిన వెంకటస్వామి	శనివారపు వెంకటేశ్వరరెడ్డి
సీతారామపురం	ముత్తంశెట్టి చెన్నకేశవులు	నేలటూరి జాషువా
వింజమూరు	చల్లా వెంకటేశ్వర్లు	గూడా నరసారెడ్డి
జలదంకి	పున్నూరు భాస్కర్‌రెడ్డి	మండపల్లి మాల్యాద్రి
కొండాపురం	బొట్లగుంట హరిబాబు	పాదర్ల తిమోతి
కలిగిరి	వేళ్ల నరేంద్రబాబు	పి.వి.సుబ్బారావు
దుత్తలూరు	ఉండేళ్ల గురవారెడ్డి	తాళ్లూరి దయానందం

గృహాణం వీడేనా!?



చిల్లకూరు : ఇందిరమ్మ గృహం ముందు పిచ్చి మొక్కలు

- ● 'ఇందిరమ్మ' ఇళ్ల నిర్మాణాల్లో అంతులేని అలసత్వం
- ● జిల్లాలో అసంపూర్తిగా 16 వేల ఇళ్లు
- ● నాటి పాలకులు, అధికారుల నిర్లక్ష్యం
- ● రూ.కోట్ల నిధులు మొండిగోడలపాలు

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) : పేదల సొంతింటి కల సాకారం చేయాలన్న ఉద్దేశంతో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ పేరుతో గృహనిర్మాణ పథకాన్ని ప్రవేశపెట్టింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు ఇస్తామని ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా లక్షల ఇళ్లు మంజూరు చేసింది. ఇదే క్రమంలో జిల్లాకు కూడా సుమారు లక్షన్నర ఇళ్లను కేటాయించింది. 2004-14 మధ్యలో జిల్లాకు 1.37 లక్షల ఇళ్లు మంజూరయ్యాయి. మొదట్లో ఒక్కో ఇంటికి రూ. 25 వేల చొప్పున నిధులు కేటాయించారు. పెరిగిన నిర్మాణ ఖర్చులతో ఆ మొత్తం సరిపోలేదు. దాంతో లబ్ధిదారులు వెనుకంజ వేశారు. ముఖ్యమంత్రి ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డి హయాంలో మరో రూ. 50 వేలు కేటాయించారు. ఆ నిధులు లబ్ధిదారునికి సక్రమంగా చేరకపోవడంతో చాలా ఇళ్లు పూర్తి కాలేదు. సొంత స్థలం లేని చోట్ల ప్రత్యేకంగా ఇందిరమ్మ కాలనీల పేరుతో ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టింది. గ్రామాల్లో వ్యక్తిగతంగా ఇళ్లు నిర్మించుకునే వారికి ఇళ్లు దక్కాయి. ఆర్భాటంగా ప్రారంభమైన ఈ పథకం కాంట్రాక్టర్లు, కొందరు అధికారులకు భోజ్యంగా మారింది. నాసిరకంగా నిర్మించి సొమ్ము స్వాహా చేశారు. ఫలితంగా పేదల ఇళ్ల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

● అసంపూర్తిగా 16 వేలకుపైనే..

కాంగ్రెస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో దశల వారీగా జిల్లాకు మంజూరైన ఇళ్లల్లో ఇప్పటికీ సుమారు 16 వేలకు పైగానే ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయి. చాలా ఇళ్లు లింటెల్ లెవల్‌లో ఆగిపోయాయి. మరికొన్ని బేస్ లేవల్ దాటలేదు. వాటికి బిల్లులు మంజూరు కాలేదు. అందుకు నాటి పాలకులు, అధికారుల నిర్లక్ష్యమే కారణమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇల్లు వచ్చిందన్న సంతోషంలో చాలా మంది పేదలు ఉన్న ఇళ్లను కూల్చేసి పక్కన తాత్కాలికంగా గుడిసెలను ఏర్పాటు చేసుకొన్నారు. ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించినా బిల్లులు రాకపోవడంతో వారు కల నెరవేరలేదు.టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిర ఆవాస్ యోజన(ఐఏవై) కింద లింటెల్ లెవల్‌లో ఉన్న ఇళ్లను పూర్తి చేయాలని భావించింది. అది కూడా కార్యరూపం దాల్చ లేదు. ఆ తర్వాత అసంపూర్తిగా ఉన్న ఇంటికి రూ.25 వేలు మంజూరు చేసేలా నిబంధనలు తీసుకొచ్చింది. ఆ మొత్తమూ సరిపోదన్న ఉద్దేశంతో చాలా మంది లబ్ధిదారులు నిర్మాణాన్ని పూర్తి చేసుకునేందుకు ముందుకు రాలేదు. దీంతో ఏ ఇంటికి ఎంత అవసరం? అన్న అంశంపై అధికారలు మరోసారి సర్వే చేస్తున్నారు. లింటెల్ లెవల్‌లో ఉన్న ఇళ్లకు అవసరమైన నిధులు సమకూర్చి బేస్ లెవల్‌లోనే ఆగిపోయిన లబ్ధిదారులకు కొత్తగా ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణం పథకం కింద ఇళ్లు మంజూరు చేస్తే ఎలా ఉంటుందన్న దానిపై ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇదే సమయంలో కొత్తగా ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరవుతున్నాయి... నిర్మాణంలో ఉన్నాయి. కొన్ని పూర్తవుతున్నాయి. ఎప్పుడో దశాబ్దం క్రితం ఇళ్లు మంజూరైనా ఇంత వరకూ తమకు సొంతిళ్లు లేవనీ, ఇప్పుడు మంజూరైన వాళ్లకు మాత్రం పూర్తవుతున్నాయనీ 'ఇందిరమ్మ' లబ్ధిదారులు వాపోతున్నారు.

● కనిపించని ఇళ్లు 10 వేలకుపైనే..

'ఇందిరమ్మ' ద్వారా మంజూరైన కొన్ని ఇళ్లు ప్రస్తుతం భూమ్మీద కన్పించడం లేదు. ఆ సంఖ్య పదివేలకుపైనే ఉంటుందని అంచనా. పేదల పేర వచ్చిన సొమ్మును కొందరు అధికారులు, కాంట్రాక్టర్లు దుర్వినియోగం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదట ఇందిరమ్మ ఇళ్లలో జరిగిన అవినీతిని తేల్చేందుకు పూనుకుంది. ప్రతి ఇంటికీ జియో ట్యాంగింగ్ చేసి ఏ ఇల్లు ఏ దశలో ఉందో గుర్తించాలని అధికారులను ఆదేశించింది. ఆ సర్వేలో అనేక నమ్మలేని నిజాలు వెలుగులోకి వచ్చాయి. చాలా మంది నాయకులు గ్రామాల్లో పేదల ముసుగులో ప్రజాధనాన్ని అప్పనంగా మింగేశారని బట్టబయలైంది. జియో ట్యాంగింగ్ చేస్తున్న దశలో పేపర్ మీద ఉన్న ఇళ్లు చాలా వరకూ భూమ్మీద కనిపించ లేదు. సుమారు పది వేలకు పైగా ఆ జాబితాలో ఉన్నట్టు గృహ నిర్మాణ సంస్థ అధికారులు గుర్తించినట్లు తెలిసింది. అంటే రూ.కోట్లు ఇతరుల జేబుల్లోకి చేరాయి. ఇందులో అప్పటి అధికారుల పాత్ర కూడా ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది. అక్రమాలు తేలితే రెవెన్యూ రికవరీ చట్టాన్ని(ఆర్ఆర్ యాక్టు) ప్రయోగించైనా సరే వసూలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికీ అది జరగలేదు. దోచుకున్నవారు మాత్రం దర్జాగా ఉన్నారు. మొండిగోడలను ఇళ్లు ఉన్న పేదలకు మాత్రం నిరాశే మిగిలింది.



అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ గృహాలు

● ఉదాహరణలివిగో..

చిల్లకూరు మండలం నాంచారమ్మ పేటకు చెందిన 110 మంది పేదలకు ఇళ్లు కట్టించేందుకు ఏఎంసీ గోదాము పక్కనే ఐదు ఎకరాల్లో స్థలం తీసుకున్నారు. 2006లో ఈ కాలనీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇప్పటికి 11 ఏళ్లు గడిచినా నిర్మాణాలు మాత్రం అసంపూర్తిగానే ఉన్నాయి. వాటిలో చాలా వరకూ ఇప్పటికే శిథిలావస్థకు చేరి కూలిపోయే దశకు చేరుకున్నాయి. 110 ఇళ్లకు ఇప్పటికే రూ.లక్షలు ఖర్చు చేశారు. కాలనీలో రోడ్లు వేసి కాలువులు కట్టారు. కరెంటు స్తంభాలు ఏర్పాటు చేశారు. ఇళ్లు మాత్రం పూర్తి కాలేదు. వాటి స్థితిని చూసి ఒక్క లబ్ధిదారుడు కూడా ఇక్కడ ఉండేందుకు ముందుకు రాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అప్పట్లో సరైన ప్రణాళిక లేకుండా దోచుకోవడానికే అన్నట్లుగా నిర్మాణాలు ప్రారంభించి వదిలేశారు. ఇదే మాదిరి జిల్లాలో అనేక ఇందిరమ్మ కాలనీలు నిరుపయోగంగా ఉన్నాయి. ఇటువంటి ఇళ్లపై అధికారులు, పాలకులు ఎప్పుడు దృష్టి పెడతారో.. ఇంకెప్పుడు పూర్తి చేస్తారో చూడాలి మరి.



2కే రన్‌లో యువతీ యువకులు

యువత తలచుకుంటే ఏదైనా సాధ్యం: జేసీ-2

● ఘనంగా యువజన దినోత్సవం

నెల్లూరు (వేదాయపాళెం) : యువత తలుచుకుంటే అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూప గలదని, ఇది చరిత్ర చెప్పిన నిజమని జాయింట్ కలెక్టర్- 2 వెంకట సుబ్బారెడ్డి అన్నారు. యువజన సర్వీసుల శాఖ(సెట్నెల్) ఆధ్వర్యంలో నెల్లూరులోని నారాయణ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జేసీ-2 మాట్లాడుతూ యువత వ్యసనాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకుంటోందన్నారు. స్వామి వివేకానంద బోధనలు ఆచరించి సన్మార్గంలో నడవాలని సూచించారు. యువత పెడత్రోవ పట్టకుండా తల్లిదండ్రులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సెట్నెల్ సీఈవో డాక్టర్ సీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పుట్టుకతో వచ్చేది జ్ఞానం, విద్యతో వచ్చేది విజ్ఞానం అని చెప్పారు. వీటితో ప్రపంచంలో ఎక్కడైనా బతకవచ్చన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు సత్ప్రవర్తన అలవర్చి, బాగా చదివించినపుడు వారు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుతారన్నారు. ఈ కార్యక్రమానికి ముందు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానం నుంచి కేవీఆర్ పెట్రోల్ బంక్ కూడలి వరకు 2కే రన్ నిర్వహించారు. దీనిని హోంగార్డు డీఎస్పీ శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. యువకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవీఎస్ నాయుడు, ఎస్ రమేష్ బాబు, ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ జీ శ్రీనివాసులు రెడ్డి, కే మురళీ మోహన్‌రాజు, మహమ్మద్ గయాజ్ అహ్మద్, డీ సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

మిగిలింది నాలుగు రోజులే..
తేలాల్సింది పదివేలు



వీరంపల్లిలో విద్యార్థి గణన చేస్తున్న సీఆర్‌పీ

● విద్యార్థుల సర్వేలో తలమునకలైన సీఆర్‌పీలు
● వేగవంతం చేయాలంటున్న అధికారులు

మనుబోలు: బడి ఈడు పిల్లల్లో పాఠశాలల్లో చేరిన, చేరని వారి గణాంకాల కోసం చేపట్టిన సర్వే కొనసా..గుతోంది. ప్రజాసాధికార సర్వే నివేదికను అనుసరించి విద్యార్థుల వివరాలతో సరిపోల్చినపుడు బడిలో చేరినవారి సంఖ్య తక్కువగా కనుబడుతోందని ప్రభుత్వం గుర్తించింది. దీంతో ప్రతి విద్యార్థిని బడిబాట పట్టించాలని ఈ సర్వే చేపట్టింది. ఈ గణన స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని అధికారులు చేపట్టారు. అయితే ప్రజాసాధికార సర్వేలో వచ్చిన విద్యార్థుల వివరాలకు, సీఆర్‌పీలు తీసిన గణాంకాలకు మధ్య పదివేల వ్యత్యాసం జిల్లా వ్యాప్తంగా కనబడుతోంది. సీఆర్పీల గణనకు గడువు ఇంకా నాలుగు రోజులు మాత్రమే ఉంది. ఈలోగా పదివేల మంది విద్యార్థుల లెక్కలు సీఆర్‌పీలు ఎలా తేలుస్తారో వేచి చూడాల్సిందే. బడి పిలుస్తోంది కార్యక్రమం ఆశించనంత పలితం ఇవ్వలేదు. దీంతో ప్రభుత్వం తాజాగా విద్యార్థి గణన చేపట్టాలని నిర్ణయించింది. జిల్లా విద్యాశాఖలో ఉంటున్న 318 సీఆర్‌పీలు, 46 ఎమ్ఐఎస్ కో-ఆర్డినేటర్లు, ఐఈఆర్‌టీలను ఎన్యుమరేటర్లుగా నియమించింది. రెండు నెలల కిందటే వీరికి సర్వేపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల్లో చేర్పించాల్సిన స్థూల ప్రవేశాలు (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో), నికర ప్రవేశాలు (నెట్ ఎన్‌రోల్ మెంట్ రేషియో) చేరుకోలేదన్నది ప్రభుత్వ ఉద్దేశ్యం. ఈ గణనలో జిల్లాలోని కేంద్రీయ, నవోదయ విద్యాలయాలు, ప్రైవేట్, గుర్తింపు పొందిన, పొందని పాఠశాలల వివరాలు సైతం నమోదు చేస్తారు. ఈ నివేదిక ఆగస్టు 1వ తేదీ లోగా ఎస్ఎస్ఏ నుంచి రాష్ట్ర విద్యాశాఖకు చేరాల్సి ఉంది. అయితే జిల్లాలో సర్వే పూర్తి కాకపోవడంతో రెండు వారాల గడువు పొడిగించారు. 16వ తేదీకి గణన పూర్తి చేయాలని విద్యాశాఖాధికారులు ఎన్యుమరేటర్లపై ఒత్తిడి పెంచారు.

వివరాలు ఇలా..

ప్రజాసాధికార సర్వే ప్రకారం 5-14 మధ్య వయస్సున్న పిల్లలు 47,891 మంది బడికి వెళ్లడం లేదని గుర్తించారు. వీరు ఏ కారణాలతో బడికి వెళ్లడం లేదు, అవగాహన కల్పించి ఎంతమందిని చేర్పిస్తున్నారు తదితర వివరాలు నివేదిక ద్వారా తెలపాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఎన్యుమరేటర్లు 13,681 మంది పిల్లలను తల్లిదండ్రులకు అవగాహన కల్పించి సర్కారు బడిలో చేర్పించారు. ఇంకా 23,570 మంది పిల్లలు పొలాలు, గుంతల వద్ద ఉండిపోవడం, ఇతర ప్రాంతాలకు వలసివెళ్లిన వారు, వివాహాలు అయిన వారుగా గుర్తించారు. ఇంత చేసినా ప్రజాసాధికార సర్వేతో పోల్చితే 10 వేల మంది విద్యార్థుల సంఖ్య తేలడంలేదు. వీరు ఎక్కడున్నారు, నూరుశాతం గణన ఎందుకు చేయలేకపోయారని సీఆర్‌పీలపై అధికారులు మండిపడుతున్నారు.

వీరు బడి ముఖమే చూడరు..

ప్రభుత్వ ప్రాథమిక విద్యకు అన్ని వసతులు కల్పిస్తున్నా గిరిజన, మత్స్యకార కాలనీల్లో పిల్లలు బడి ముఖం చూడడంలేదన్నది ప్రభుత్వ అంచనా. అందుకే జీఈఆర్, ఎన్ఈఆర్‌ల మధ్య వ్యత్యాసం ఉంటోందంటున్నారు. ఏటా బడిబాట కార్యక్రమం నిర్వహించినా ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఈ విద్యార్థి గణనతోనైనా లోపాలు సరిదిద్దేందుకు వీలుంటుందని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.



గణనపై సీఆర్‌పీలను ప్రశ్నిస్తున్న ఎస్ఎస్ఏ అధికారి

ప్రజా సాధికార సర్వే ప్రకారం..

ప్రజాసాధికార సర్వే వివరాలతో విద్యార్థి గణన చేపడతారు. ఎన్యుమరేటర్లు ఏపీజీఈఆర్ యాప్‌లో నమోదైన విద్యార్థి ఆధార్ సంఖ్య ఆధారంగా ఒక్కో విద్యార్థిని గుర్తించి, వారికి కేటాయించిన పాఠశాల కోడ్ (యుడైస్ కోడ్) ద్వారా తరగతి వారీగా నమోదు చేస్తారు. తరువాత పాఠశాలలకు వెళ్లి విద్యార్థి స్థితిని తెలుసుకుంటారు. ఒక వేళ విద్యార్థి బడికి రావడం లేదని తెలిస్తే నేరుగా ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడతారు.

ఎన్యుమరేటర్లకు ట్యాబ్‌లు

ఎన్యుమరేటర్లుకు ఆండ్రాయిడ్ ఫోన్లు, ట్యాబ్‌లు ఇచ్చారు. వీరు పాఠశాలల్లో ఉన్న పిల్లలను గుర్తించి ఏపీజీఈఆర్ యాప్‌లో నమోదు చేస్తారు. రోజుకు ఒక రెవెన్యూ గ్రామాన్ని సర్వే చేయాలని నిర్దేశించారు. ఈ ప్రకారం గడువు దగ్గరపడుతున్నా అన్ని మండలాల్లో నూరు శాతం గణన ఇంకా పూర్తికాలేదు.

16 నాటికి తేల్చేయాలి



ఈనెల 16వ తేదీ నాటికి జిల్లాలో విద్యార్థి గణన పూర్తిచేయాలి. ఇప్పటికి కొన్ని మండలాల్లో 90 శాతం, 95 శాతం సర్వే పూర్తి చేశారు. మిగిలిన పదివేల మంది విద్యార్థుల లెక్క త్వరలోనే తేల్చేందుకు సర్వే వేగవంతం చేయాలని సూచించాం. సెక్టోరియల్ అధికారులు కూడా ఒక్కొక్కరు తొమ్మిది మండలాలు తీసుకుని అంతుచిక్కని లెక్క కోసం పర్యవేక్షిస్తున్నారు.

- పీవీ రమేష్, ఎస్ఎస్ఏ ఏఎస్‌వో

రైతులకు న్యాయం చేస్తాం

వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



సమస్యలపై ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న గ్రామస్థులు

డక్కిలి: ఆల్తూరుపాడు రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న ప్రతి రైతుకు న్యాయం చేస్తామని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన గూడూరు ఆర్డీవో అరుణబాబుతో కలిసి ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధిత రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రిజర్వాయరు నిర్మాణం వల్ల ఈ ప్రాంతానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ ప్రాంతంలో ఎకరా లక్ష రూపాయలు ఉండే భూముల విలువ రూ.6.50 లక్షలకు పెంచారన్నారు. దీంతో ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులకు పెద్ద ఎత్తున నష్టపరిహారం అందుతుందని చెప్పారు. ప్రాజెక్టులు వచ్చినప్పుడు అందరూ ఎంతో కొంత త్యాగం చేయాలని సూచించారు. అయితే ఒక వైపు రిజర్వాయరు నార్మాణం మరోవైపు నడికుడి రైల్వేలైను రావడంతో తమకున్న ఎకరా, రెండు ఎకరాల భూమిని పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేయగా, ఏళ్ల తరబడి సాగు చేస్తున్న భూములకు పట్టాలు లేవని, కనీసం సాగుకూడా అధికారులు రాయలేదని, తమ పరిస్థితి ఏమిటని కొందరు బాధితులు ఎమ్మెల్యే రామకృష్ణకు మొరపెట్టుకొన్నారు. ఈ విషయమై కలెక్టరుతో చర్చించి అందరికీ న్యాయం జరిగేలా చూస్తామన్నారు. రిజర్వాయరు నిర్మాణంలో ఆల్తూరుపాడు, చీకిరేణిపల్లి, ఆల్తూరుపాడు వెల్లంపల్లి గ్రామాల్లో సుమారు 150 ఎకరాలు రైతులు సాగు భూములను కోల్పోతారని అధికారులు అంచనా వేశారు. ఇంత పెద్ద మొత్తంలో భూములు కోల్పోతే తమ పరిస్థితి ఏమిటని ఆ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అవసరమైతే భూములు ఎక్కువగా కోల్పోకుండా ఉండేందుకు రిజర్వాయరు అలైన్‌మెంటులో మార్పునకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఆర్డీవో అరుణ్‌బాబు మాట్లాడుతూ రిజర్వాయరు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందిస్తామన్నారు. భూ రికార్డుల్లో ఏవైనా తప్పులు దొర్లితే వాటిని చక్కదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సయ్యద్ మున్నీర్ బాషా, ఎంపీడీవో విజయలక్ష్మి, వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య, ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, సీసీ నాయుడు, కేవీకే ప్రసాద్, సర్పంచు మునిరత్నం, తీర్థంపాడు ఎంపీటీసీ చంద్రమౌళి, నాయకులు హరినాథ్ పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో ఆగిన చంబల్‌పూర్

బిట్రగుంట : బనస్వాది నుంచి చంబల్‌పూర్ వెళ్లే 08302 సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఇంజన్‌లో సాంకేతిక లోపం కారణంగా 40 నిమిషాలు బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో ఆగిపోయింది. బిట్రగుంట రైల్వే స్టేషన్ దక్షణ ఎల్‌సీ గ్రేట్ 144 వద్ద శుక్రవారం 10.55 నిమిషాలకు నిలిచిపోగా విషయం తెలుసుకున్న రైల్వే టీఎక్స్ఆర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఇంజన్‌లో సాంకేతిక లోపాన్ని గుర్తించి మరమ్మతు చేయడంతో 11.46 నిమిషాలకు చంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ పరుగు ప్రారంభించింది. గేటు వద్ద రైలు నిలిచిపోవడంతో రాకపోకలు తీవ్ర అంతరాయం కలిగింది. ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

నేడు నమో వెంకటేశాయ రథం రాక

నెల్లూరు (సాంస్కృతికం) : హైదరాబాద్‌కు చెందిన శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం ఆధ్వర్యంలో తిరుమల వేంకటేశ్వరస్వామికి 15వసారి ఏడు కోట్ల జపనామం సమర్పణ (వెంకటేశ్వరనామకోటి పుస్తకాలు) అందరికీ తెలియజేస్తూ రథయాత్ర ప్రారంభమైంది. ఆ యాత్ర శనివారం సాయంత్రం నెల్లూరు చేరుతుందని మహామంత్ర పీఠం నెల్లూరు శాఖ కన్వీనర్ శివనారాయణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పప్పులవీధిలోని మహాలక్ష్మి ఆలయం వద్ద భక్తుల పూజలు అందుకున్న అనంతరం రాత్రి మాగుంట లే అవుట్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుతుందని తెలిపారు.

అయ్యా.. నా బిడ్డకు ప్రాణభిక్ష పెట్టండి

● 9 ఏళ్లుగా ఆస్తులన్నీ అమ్మి వైద్యం చేయించాం
● శస్త్ర చికిత్సకు రూ.15 లక్షలు అవసరమన్నారు..
● ఎమ్మెల్యే, ఆర్డీవో ఎదుట బాలిక తల్లి ఆవేదన

డక్కిలి: 'అయ్యా.. దయగల బాబులారా.. నా బిడ్డకు ప్రాణ భిక్ష పెట్టండని' ఓ బాలిక తల్లి అధికారులు, ప్రజాప్రతినిధుల ఎదుట మొరపెట్టుకుంది. తొమ్మిదేళ్లుగా ఉన్న ఆస్తులన్నీ తెగనమ్మి వైద్యం అందించామని, ఇక తమ వద్ద ఏమి లేదని ఆవేదన వ్యక్తం చేసింది. శస్త్ర చికిత్స చేయడానికి రూ.15 లక్షలు ఖర్చు అవుతాయని డాక్టర్లు చెప్పారని, అంత సొమ్ము భరించే ఆర్థిక స్థోమత లేదన్నారు. డక్కిలి మండలంలోని ఆల్తూరుపాడు గ్రామానికి చెందిన పదేళ్ల చందన తొమ్మిదేళ్లగా అనారోగ్యంతో బాధపడుతోంది. ప్రస్తుతం రెండవ తరగతి చదువుతున్న చందనకు ఏడాది వయస్సు ఉన్నప్పడే బోన్ మెరియాస్, తలసేమియా వంటి వ్యాధులకు గురైంది. అప్పటి నుంచి కుమార్తెను కాపాడుకునేందుకు తల్లిదండ్రులు ఉన్న ఆస్థినంతా అమ్మి వైద్యం చేయించారు. ప్రస్తుతం ఆ బాలిక ఆరోగ్యం రోజు రోజుకూ క్షీణిస్తోంది. ఆపరేషన్ చేస్తే తప్ప ప్రయోజనం లేదని, దానికి రూ. 15 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు నిర్ధారించారు. అంత డబ్బు వారి వద్ద లేకపోవడంతో ఆపరేషన్ చేయించలేదు. ఈ క్రమంలో గూడూరు ఆర్డీవో అరుణ్‌బాబుతో కలసి ఆల్తూరుపాడుకు వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వచ్చారని తెలుసుకున్న బాలిక తల్లి శ్రీదేవి తన కుమార్తెతో వచ్చి తన దీనగాథను ఎమ్మెల్యేకి వివరించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే రామకృష్ణ ఆ బాలిక పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించి మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి, జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్యనాయుడు ఉన్నారు.



తన బిడ్డకు వైద్యం చేయించమని ఎమ్మెల్యేను కోరుతున్న బాలిక తల్లి

1976 మే 25 ఏ వారం అవుతుంది?

మెంటల్ ఎబిలిటి

1. 200 కిమీ పొడవైన రహదారిపై రెండు కార్లు చెరోవైపు నుంచి ప్రయాణిస్తున్నాయి. మొదటి కారు 40 కిమీ ప్రయాణించిన తరవాత కుడివైపునకు తిరిగి 20 కిమీ ప్రయాణించింది. మరల ఎడమవైపునకు తిరిగి 35 కిమీ ప్రయాణించింది. తదుపరి ఎడమవైపునకు తిరిగి మెయిన్ రోడ్డుకు చేరుకొంది. రెండో కారు చిన్న లోపంతో కేవలం 55 కిమీ మాత్రమే ప్రయాణించింది. అయితే ప్రస్తుతం ఆ రెండు కార్ల మధ్య దూరం ఎంత?
ఎ) 60 కిమీ బి) 80 కిమీ సి) 75 కిమీ డి) 70 కిమీ

2. 6842109357 సంఖ్యలో మొదటి అంకెను రెండో స్థానంలోకి, రెండో అంకెను మొదటి స్థానంలోకి, మూడో అంకెను నాలుగో స్థానంలోకి, నాలుగో అంకెను మూడో స్థానంలోకి ఇలా అన్ని అంకెలు మారగా ఏర్పడిన కొత్త సంఖ్యలో ఎడమ నుంచి అయిదో అంకెకు గల మూడో కుడి అంకె?
ఎ) 9 బి) 5 సి) 3 డి) 4

3. కింది సంఖ్యలను ముందుగా వ్యతిరేక దిశలో రాసి తరవాత ఆ సంఖ్యలను అవరోహణ క్రమంలో రాస్తే మధ్య సంఖ్య మధ్య అంకె?
853, 942, 687, 439, 924, 168, 316
ఎ) 8 బి) 2 సి) 1 డి) 4

4. 80 మంది విద్యార్థులు ఉన్న ఒక వరసలో కిరణ్ ఎడమ నుంచి 32వ స్థానంలోను, తరుణ్ కుడి నుంచి 28వ స్థానంలోను ఉన్నారు. అయితే ప్రస్తుతం వారిద్దరి మధ్య గల విద్యార్థుల సంఖ్య?
ఎ) 20 బి) 40 సి) 28 డి) 26

5. ఒక వరసలో అచ్యుత్ ఎడమ నుంచి పదో స్థానంలోను, కుడి నుంచి ఆరోస్థానంలోను ఉన్నాడు. ఆ వరసలో మొత్తం సభ్యుల సంఖ్య 34 ఉండాలంటే ఎంతమంది వ్యక్తులు అవసరం?
ఎ) 12 బి) 19 సి) 21 డి) 18

6. వివేక్‌కు అతని సోదరి పుట్టిన రోజు ఆగస్టు 20, 25 మధ్య అని గుర్తు. అతని తండ్రికి తమ కుమార్తె పుట్టిన రోజు సెప్టెంబరు 23, 28 మధ్య అని గుర్తు అయితే వివేక్ సోదరి పుట్టిన రోజు ఎప్పుడు?
ఎ) ఆగస్టు 24 బి) సెప్టెంబరు 24
సి) చెప్పలేం డి) ఏదీకాదు

7. పాట్నాకు ఒక రైలు ప్రతి 80 నిలకు ఉంది. విచారణాధికారి తనను కలిసిన ప్రయాణికుడితో రైలు వెళ్లిపోయి 15నిలు అయింది. తరవాతి రైలు గం.10.15నిలకు అని చెప్పాడు. అయితే ఈ సమాచారాన్ని విచారణాధికారి ప్రయాణికుడితో ఏ సమయంలో చెప్పాడు?
ఎ) గం. 9.10 ని. బి) గం. 10.20 ని.
సి) గం. 9.30 ని. డి) ఏదీకాదు


8. కింది సిరీస్‌లో ముందు సరిసంఖ్య, తరవాత బేసి సంఖ్య గల సరి సంఖ్యలు ఎన్ని ఉన్నాయి?
8 4 3 9 8 6 5 9 2 3 6 8 4 2 7 9 2 8 3 9
ఎ) రెండు బి) మూడు సి) నాలుగు డి) ఏమీ లేవు

9. ప్రశ్నార్థకం గుర్తు గల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి

8	5	961
7	8	522
9	3	?

ఎ) 843 బి) 441 సి) 924 డి) 462

10. ప్రశ్నార్థకం గుర్తు గల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి





Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

ఎ) 65 బి) 92 సి) 48 డి) 64

11. ఒక అంకె 3 కన్నా పెద్దది 7 కన్నా చిన్నది. అదే అంకె 5 కన్నా పెద్దది, 9 కన్నా చిన్నది. అయితే ఆ అంకె?
ఎ) 8 బి) 4 సి) 6 డి) 9

12. 1976 మే 25 ఏ వారం అవుతుంది?
ఎ) గురువారం బి) మంగళవారం
సి) బుధవారం డి) సోమవారం

13. కింది సిరీస్‌లో ముందు సరిసంఖ్య, తరవాత బేసి సంఖ్య గల బేసి సంఖ్యలు ఎన్ని ఉన్నాయి?
8 4 3 9 2 5 6 8 5 2 7 3 4 6 8 7 9 2 1 4 8 9 3
ఎ) నాలుగు బి) మూడు సి) రెండు డి) ఏమీలేవు

14. ఇంటర్వ్యూ నిర్వహించడానికి మేనేజింగ్ డైరెక్టర్ గం. 11.00 కంటే 15 ని.లు ముందుగా వచ్చారు. ఈయన చైర్మన్ కంటే 25ని.లు ముందు వచ్చారు. చైర్మన్ ఇంటర్వ్యూ సమయం కంటే 20 నిలు ముందు వచ్చారు. అయితే ఇంటర్వ్యూని ఎప్పుడు నిర్వహించాలనుకొన్నారు?
ఎ) గం. 11.00 ని. బి) గం. 11.30 ని.
సి) గం. 11.15 ని. డి) ఏదీకాదు

15. కింది పదాలను నిఘంటువు ప్రకారం అమర్చిన తరవాత మధ్యలో వచ్చే పదాన్ని తెలపండి?
1. Mobile 2. Master 3. Manner
4. Market 5. Minister
ఎ) Master బి) Minister
సి) Market డి) Mobile

16. అపసవ్యదిశ వర్ణమాల ప్రకారం కుడి నుంచి 12 వ అక్షరానికి గల అయిదో ఎడమ అక్షరం?
ఎ) P బి) R సి) Q డి) J

17. వర్ణమాలలోని మొదటి సగం అక్షరాలను సవ్య దిశలో రాసి రెండో సగం అక్షరాలను అపసవ్య దిశలో రాశారు. దీని ప్రకారం ఎడమ నుంచి పదో అక్షరానికి గల అయిదో కుడి అక్షరం?
ఎ) Z బి) Y సి) X డి) W

18. సవ్యదిశ వర్ణమాలలో కుడి ఆరో అక్షరం నుంచి పది అక్షరాలను అపసవ్యదిశలో రాసి మిగిలిన అక్షరాలను యథాతథంగా రాశారు. దీని ప్రకారం ఎడమ నుంచి పదో అక్షరానికి గల నాలుగో కుడి అక్షరం?
ఎ) U బి) R సి) T డి) S

19. 1956 ఆగస్టు 2న ఏవారమవుతుంది?
ఎ) శుక్రవారం బి) శనివారం
సి) గురువారం డి) బుధవారం

20. ఈ రోజు ఆగస్టు 19 గురువారం. ఇది లీపు సంవత్సరమయితే మూడేళ్ల క్రితం ఇదే తేదీకి ఏ వారం వస్తుంది?
ఎ) ఆదివారం బి) శనివారం
సి) సోమవారం డి) బుధవారం

21. 2001 జనవరి 1 శుక్రవారం అయితే తదుపరి వచ్చే ఏ సంవత్సరంలో జనవరి 1 శుక్రవారమవుతుంది?
ఎ) 2001 బి) 2007 సి) 2008 డి) ఏదీకాదు

22. ఈ రోజు నవంబరు 14 గురువారం. ఇది లీపు సంవత్సరం. అయితే అయిదేళ్ల తరవాత ఇదే తేదీకి ఏ వారమొస్తుంది?
ఎ) బుధవారం బి) మంగళవారం
సి) గురువారం డి) ఏదీకాదు

23. గడియారంలో సమయం గం.1.30ని. అయితే నిముషాల ముల్లు, గంటల ముల్లు మధ్య కోణం?
ఎ) 180° బి) 120° సి) 135° డి) 140°

24. విక్రం 50 మీ ఉత్తరానికి నడచిన తరవాత కుడివైపునకు తిరిగి 40 మీ నడిచాడు. మరల కుడివైపునకు తిరిగి 35 మీ నడచిన తరవాత కుడివైపునకు తిరిగి 25 మీ నడిచాడు. చివరగా ఎడమవైపునకు తిరిగి 15 మీ నడిచాడు. అయితే ప్రస్తుతం విక్రం బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఏ దిశలో ఉన్నాడు?
ఎ) 15 మీ తూర్పు బి) 15 మీ పడమర
సి) 15 మీ ఉత్తరం డి) 15మీ దక్షిణం

25. గడియారంలో సమయం గం.12.00 అయింది. గంటల ముల్లు తూర్పును చూపిస్తోందనుకొంటే గం3.30నిల సమయంలో నిముషాల ముల్లు ఏ దిక్కును సూచిస్తోంది?
ఎ) తూర్పు బి) ఉత్తరం సి) దక్షిణం డి) పడమర

26 - 30

A, B లు భార్యాభర్తలు. X, Y లు సోదరులు. A కుమార్తె K. Y తల్లి B. M తండ్రి Y. Z కుమార్తె M. F భార్య K. T కుమారుడు A. K కుమారుడు N. పై సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి?

26. T కి B ఏమవుతారు?
ఎ) కోడలు బి) అత్తగారు
సి) మామగారు డి) ఏదీకాదు

27. M కి K ఏమవుతారు?
ఎ) మేనల్లుడు బి) మేనత్త
సి) మేనమామ డి) మేనకోడలు

28. Z కి A ఏమవుతారు?
ఎ) అత్తగారు బి) కోడలు
సి) అల్లుడు డి) మామగారు

29. X కి N ఏమవుతారు?
ఎ) మేనకోడలు బి) మేనమామ
సి) మేనల్లుడు డి) మేనత్త

30. B కి F ఏమవుతారు?
ఎ) అల్లుడు బి) కోడలు
సి) మేనల్లుడు డి) మేనకోడలు

31 - 35

1. ఒక కళాశాలలో A, B, C, D, E, F, G, H, I, J అనే పది పరీక్షలను వారం రోజుల్లో నిర్వహించదలిచారు. ఆదివారం సెలవు. ప్రతి రోజు ఒకటి/ రెండు పరీక్షలు జరుగుతాయి.
2. B పరీక్షతోపాటు మరో పరీక్ష ఉంటుంది. కాని గురువారం కాదు.
3. A తో పరీక్షలన్నీ మంగళవారం మొదలౌతాయి
4. చివరి రోజు, శుక్రవారంనాడు ఒక పరీక్ష మాత్రమే ఉంటుంది. శుక్రవారం నాడు J పరీక్ష నిర్వహిస్తారు.
5. H పరీక్ష, D తరవాత ఉంటుంది. D పరీక్ష, F తరవాత ఉంటుంది.
6. చివరి రోజున E పరీక్ష ఉంటుంది. J పరీక్ష తరవాతి రోజు G, సెలవు రోజుకి ముందు రోజు I పరీక్ష ఉంటాయి. ఈ సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

31. సెలవు రోజుకి ముందు నిర్వహించే పరీక్షలు?
ఎ) D, B బి) G, I సి) H, C డి) ఏదీకాదు

32. H పరీక్ష రోజున ఉన్న మరో పరీక్ష?
ఎ) B బి) F సి) C డి) ఏదీకాదు

33. బుధవారం రోజున ఉన్న పరీక్ష?
ఎ) C, H బి) B, D సి) G, I డి) ఏదీకాదు

34. C పరీక్ష తరవాతి రోజు ఉండే పరీక్ష?
ఎ) E బి) F సి) J డి) ఏదీకాదు

35. మొదటి రోజు జరిగే పరీక్షలు?
ఎ) A, F బి) C, H సి) G, I డి) D, B

36. వినయ్ పడమరకు 80 మీ నడచిన తరవాత ఎడమవైపునకు తిరిగి 30 మీ నడిచాడు. మరల ఎడమకు తిరిగి 20 మీ నడిచాడు. చివరగా ఉత్తరానికి 110 మీ నడిచాడు. అయితే ఇప్పుడు వినయ్ బయలు దేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఏ దిశలో ఉన్నాడు?
ఎ) 100 మీ నైరుతి బి) 100 మీ వాయవ్యం
సి) 100 మీ ఈశాన్యం డి) 100 మీ ఆగ్నేయం

37 - 38

కింది పదాలకు అర్థవంతమైన రీతిలో సరైన క్రమాన్ని meaningful sequence of order తెలపండి

37. 1. Walls 2. Windows 3. Foundation
4. Roof 5. Room 6. Floor
ఎ) 3, 2, 5, 4, 1, 6 బి) 3, 1, 2, 4, 6, 5
సి) 3, 1, 2, 6, 4, 5 డి) 3, 1, 2, 4, 5, 6

38. 1. Rain 2. Rainbow 3. Child
4. Sun 5. Happy
ఎ) 1, 4, 2, 3, 5 బి) 1, 2, 3, 4, 5
సి) 1, 2, 4, 5, 3 డి) 1, 3, 4, 2, 3

సమాధానాలు

1) డి	7) ఎ	13) ఎ	19) సి	26) ఎ	33) బి
2) ఎ	8) సి	14) బి	20) ఎ	27) బి	34) సి
3) సి	9) బి	15) ఎ	21) బి	28) డి	35) ఎ
4) ఎ	10) ఎ	16) సి	22) ఎ	29) సి	36) బి
5) బి	11) సి	17) బి	23) సి	30) ఎ	37) బి
6) సి	12) బి	18) డి	24) ఎ	31) బి	38) ఎ
			25) డి	32) సి	

ఉద్యోగాలు — JOBS

టిఎస్‌సిఎబి

తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ (టిఎస్‌సిఎబి)- ఆర్‌బిఐ/ నాబార్డ్ సహకారంతో కింది అయిదు డిసిసిబి బ్యాంకుల్లో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

డిసిసిబి బ్యాంకులు: హైదరాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.

వయసు: 55 ఏళ్ల మించరాదు

అర్హత: పీజీ/ సీఏ/ డిగ్రీ + సిఏఐఐబి/ డిబిఎఫ్/ డిప్లొమా(కో ఆపరేటివ్ బిజినెస్ మేనేజ్‌మెంట్)/ పీజీడిసిఆర్‌ఎస్ పూర్తిచేసి ఉండాలి. బ్యాంకింగ్ రంగంలో కనీసం ఎనిమిదేళ్ల మిడిల్/ సీనియర్ మేనేజ్‌మెంట్ కేడర్‌లో పనిచేసి ఉండాలి.

దరఖాస్తు ఫీజు: రూ.500

ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తుఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని నింపి కింది చిరునామాకు పంపుకోవాలి.

దరఖాస్తు డౌన్‌లోడింగ్‌కు ఆఖరు తేదీ: ఆగస్టు 31

దరఖాస్తు సబ్మిషన్‌కు ఆఖరు తేదీ: సెప్టెంబరు 7

చిరునామా: Managing Director, TSCAB, Head Office, Troop Bazar, Hyderabad- 500001

వెబ్‌సైట్: www.tscab.org

స్కాలర్‌షిప్

టైమ్-క్యాట్ మాక్ టెస్ట్

మేనేజ్‌మెంట్ ఎంట్రెన్స్ టెస్ట్‌లకు శిక్షణ ఇచ్చే ప్రముఖ సంస్థ 'టైమ్' క్యాట్ ఔత్సాహికుల కోసం దేశ వ్యాప్తంగా ఆగస్టు 13న ఆల్ ఇండియా ఫ్రీ మాక్ టెస్ట్‌ను నిర్వహించనుంది. ఇన్విజిలేటెడ్, నాన్ ఇన్విజిలేటెడ్ పద్ధతుల్లో ఈ మాక్ టెస్ట్ ఉంటుంది. ఈ టెస్ట్‌లో చక్కని ప్రతిభ చూపిన వారికి 2017/18 క్యాట్ క్లాస్ రూమ్ ప్రోగ్రామ్, టెస్ట్ సిరీస్‌లపై ఫీజులో రాయితీ ఇస్తారు. అయితే ఈ అవకాశం ఇన్విజిలేటెడ్ మోడ్‌ను ఎంపిక చేసుకున్న వారికి మాత్రమే వర్తిస్తుంది. రియల్ టైమ్ ఎగ్జామ్ ఎక్స్‌పీరియెన్స్ కల్పించేలా ఈ మాక్ టెస్ట్‌ను రూపొందించినట్లు టైమ్ క్యాట్ కోర్స్ డైరెక్టర్ రామనాథ్ కనకదండి తెలిపారు.

రిజిస్ట్రేషన్ లింక్: http://www.time4education.com/local/articlecms/page.php?id=1030

వెబ్‌సైట్: www.time4education.com

మెదడులోని ఏ భాగాన్ని ఆల్కహాల్ ప్రభావితం చేస్తుంది?

మానవ శరీరం

1. మానవ శరీరంలోని అతిపెద్ద గ్రంథి ఏది?
ఎ) అవటు గ్రంథి బి) క్లోమ గ్రంథి
సి) కాలేయం డి) పీయూష గ్రంథి
2. మానవ దేహంలోని అతి పెద్ద అవయవం ఏది?
ఎ) కాలేయం బి) చర్మం
సి) అవటు గ్రంథి డి) గుండె
3. మానవ శరీరంలోని అంతర్గత అవయవాల్లో పెద్దది?
ఎ) కాలేయం బి) చర్మం
సి) గుండె డి) పీయూష గ్రంథి
4. మానవ దేహంలో యూరియా సంశ్లేషణ జరిగే ప్రదేశం?
ఎ) మూత్రపిండాలు బి) ప్లీహం
సి) క్లోమం డి) కాలేయం
5. మానవ శరీరంలో పొడవైన ఎముక ఏది?
ఎ) స్టెపిస్ బి) ఫిమర్ సి) టిబియ డి) టార్సస్
6. మానవ శరీరంలోని చిన్న ఎముక ఏది?
ఎ) స్టపిస్ బి) ఫిమర్ సి) టిబియ డి) టార్సస్
7. వయోజన మానవునిలో ఉండే మొత్తం ఎముకలెన్ని?
ఎ) 180 బి) 306 సి) 156 డి) 206
8. మానవునిలో ఉండే పక్కటెముకల సంఖ్య?
ఎ) 33 బి) 26 సి) 12 జతలు డి) 14
9. వయోజన మానవుని వెన్నువముకలో ఎన్ని ఎముకలుంటాయి?
ఎ) 33 బి) 26 సి) 22 డి) 14
10. మానవుని కపాలంలో ఎన్ని ఎముకలుంటాయి?
ఎ) 22 బి) 14 సి) 8 డి) 18
11. మానవుని పుర్రెలో ఎన్ని ఎముకలుంటాయి?
ఎ) 14 బి) 8 సి) 22 డి) 26
12. మానవుని ముఖ భాగంలో ఉండే ఎముకలు ఎన్ని?
ఎ) 14 బి) 22 సి) 8 డి) 30
13. మానవ శరీరంలోని థర్మోస్టాట్ అని దేన్ని పిలుస్తారు?
ఎ) థైమస్ బి) కాలేయం
సి) హైపోథాలమస్ డి) ప్లీహం
14. మానవ శరీరంలో రక్తనిధి అని దేన్ని పిలుస్తారు?
ఎ) కాలేయం బి) ప్లీహం సి) గుండె డి) ఎముక
15. ఎర్రరక్త కణాల శ్మశానవాటిక అని దేన్ని అంటారు?
ఎ) ఎముక బి) గుండె సి) కాలేయం డి) ప్లీహం
16. మెదడులోని ఏ భాగాన్ని ఆల్కహాల్ ప్రభావితం చేస్తుంది?
ఎ) మస్తిష్కం బి) అనుమస్తిష్కం
సి) ద్వారగోర్థం డి) హైపోథాలమస్
17. జ్ఞాపకశక్తిని నియంత్రించే మెదడులోని భాగం?
ఎ) మస్తిష్కం బి) అనుమస్తిష్కం
సి) ద్వారగోర్థం డి) హైపోథాలమస్
18. కోపాన్ని నియంత్రించే మెదడులోని భాగం?
ఎ) ద్వారగోర్థం బి) హైపోథాలమస్
సి) అనుమస్తిష్కం డి) మస్తిష్కం
19. మెదడులోని ఏ భాగాన్ని అనుమస్తిష్కం అని అంటారు?
ఎ) ముందు భాగం బి) మధ్య భాగం
సి) వెనుక భాగం డి) హైపోథాలమస్



ఆర్. సురేష్
సీనియర్ ఫ్యాకల్టీ


19. పోరాట, పలాయన హార్మోన్ అని దేన్ని పిలుస్తారు?
ఎ) థైరాక్సిన్ బి) ఎపినెఫ్రిన్
సి) పారాథైరాక్సిన్ డి) ఇన్సులిన్
21. మాస్టర్ గ్రంథి అని దేన్ని పిలుస్తారు?
ఎ) పీయూష గ్రంథి బి) అవటు గ్రంథి
సి) క్లోమ గ్రంథి డి) అధివృక్క గ్రంథి

పోటీ పరీక్షల ప్రత్యేకం - బయాలజీ

22. ఆడమ్స్ ఆపిల్ గ్రంథి అని దేన్ని పిలుస్తారు?
ఎ) అవటు గ్రంథి(థైరాయిడ్) బి) పీయూష గ్రంథి
సి) అధివృక్క గ్రంథి డి) క్లోమం
23. కింది వాటిలో మిశ్రమ గ్రంథి ఏది?
ఎ) క్లోమం బి) కాలేయం సి) థైమస్ డి) పైవన్నీ
24. మూత్రపిండాలపై ఉండే గ్రంథి?
ఎ) థైమస్ బి) క్లోమం
సి) అధివృక్క గ్రంథి డి) అవటు గ్రంథి
25. ఇన్సులిన్ హార్మోన్‌ను స్రవించే గ్రంథి?
ఎ) క్లోమం బి) కాలేయం
సి) ప్లీహం డి) పీయూష గ్రంథి
26. మరుగుజ్జుల్లో తక్కువగా ఉండే హార్మోన్ ఏది?
ఎ) ఇన్సులిన్ బి) థైరాక్సిన్
సి) పెరుగుదల హార్మోన్ డి) పైవన్నీ
27. 'క్రెటినిజం' వ్యాధి ఉన్న పిల్లల్లో ఏ హార్మోన్ తక్కువగా ఉంటుంది?
ఎ) థైరాక్సిన్ బి) ఇన్సులిన్
సి) వాసోప్రెసిన్ డి) ఎపినెఫ్రిన్
28. ప్రసవ సమయంలో ఉత్పత్తి అయ్యే హార్మోన్ ఏది?
ఎ) ఆక్సిటోసిన్ బి) ప్రొజెస్టిరాన్
సి) ప్రోలాక్టిన్ డి) ఈస్ట్రోజన్
29. రక్తంలో ఉండే పాస్ఫేట్ల స్థాయిని నియంత్రించే గ్రంథి?
ఎ) అవటు గ్రంథి బి) పార్శ్వ అవటు గ్రంథి
సి) పీయూష గ్రంథి డి) క్లోమ గ్రంథి
30. ఉరఃకుహరంలో ఉండే గ్రంథి?
ఎ) థైమస్ బి) పీయూష గ్రంథి
సి) అవటు గ్రంథి డి) ఏదీకాదు
31. పేస్ మేకర్ ఏ అవయవానికి సంబంధించింది?
ఎ) గుండె బి) మూత్రపిండం
సి) కాలేయం డి) మెదడు
32. లింఫోసైట్ కణాలను ఉత్పత్తి చేసే గ్రంథి?
ఎ) క్లోమం బి) కాలేయం
సి) థైమస్ డి) జఠర గ్రంథి
33. లాలాజల గ్రంథులు స్రవించే ఎంజైమ్ ఏది?
ఎ) ట్రిప్సిన్ బి) పెప్సిన్ సి) లైపేజ్ డి) టైలిన్
34. జఠర గ్రంథులు స్రవించే ఎంజైమ్ ఏది?
ఎ) ట్రిప్సిన్ బి) పెప్సిన్ సి) లైపేజ్ డి) అమైలేజ్
35. ఎంజైములు, హార్మోన్‌లను ఉత్పత్తి చేసే గ్రంథి?
ఎ) పీయూష గ్రంథి బి) కాలేయం
సి) క్లోమం డి) జఠర గ్రంథి
36. క్లోమ గ్రంథి స్రవించే ఎంజైమ్ ఏది?
ఎ) ట్రిప్సిన్ బి) లైపేజ్ సి) అమైలేజ్ డి) పైవన్నీ
37. డయాబెటిస్ ఇన్ సిపిడస్ వ్యాధి ఉన్నవారిలో ఏ హార్మోన్ తక్కువగా ఉంటుంది?
ఎ) ఇన్సులిన్ బి) థైరాక్సిన్
సి) వాసోప్రెసిన్ డి) గ్లూకగాన్
38. టిటనీ వ్యాధి ఉన్నవారిలో ఏ హార్మోన్ లోపిస్తుంది?
ఎ) పారాథైరాక్సిన్ బి) థైరాక్సిన్
సి) ప్రోలాక్టిన్ డి) ఇన్సులిన్
39. మెదడులోని ఏ భాగాన్ని చిన్న మెదడు అని అంటారు?
ఎ) మస్తిష్కం
బి) అనుమస్తిష్కం
సి) హైపోథాలమస్
డి) ద్వారగోర్థం



40. వ్యాధికారక బ్యాక్టీరియాను చంపే రక్తకణాలు?
ఎ) రక్త ఫలకికలు బి) ఎర్రరక్త కణాలు
సి) తెల్లరక్త కణాలు డి) పైవన్నీ
41. వయోజన మానవుని శ్వాసక్రియ రేటు?
ఎ) 32 బి) 18 సి) 72 డి) 10
42. మెదడు : మెనింజెస్ :: ఊపిరితిత్తులు : ....
ఎ) వాయుగోణులు బి) క్షయ
సి) ప్లూరా డి) వృక్కాలు
43. హిమోసైటోమీటర్‌ను దేని కోసం ఉపయోగిస్తారు?
ఎ) రక్త పీడనం కొలిచేందుకు
బి) రక్తకణాలను లెక్కించేందుకు
సి) రక్తాన్ని శుద్ధి చేయడం కోసం
డి) గుండె పనితీరు తెలుసుకోవడం కోసం
44. ఎర్రరక్త కణం సగటు జీవితకాలం ఎన్ని రోజులు?
ఎ) 180 బి) 90 సి) 120 డి) 13
45. మానవునిలో ఉండే జ్ఞానదంతాలు ఎన్ని?
ఎ) 4 బి) 2 సి) 8 డి) 6
46. కింది ఏ జంతువులో రథనికలు క్షీణించి ఉంటాయి?
ఎ) పులి బి) గేదె సి) కుక్క డి) ఏదీకాదు
47. మానవ శరీరంలోని అతిచిన్న కణం?
ఎ) అండం బి) నాడీకణం
సి) ఎర్రరక్తకణం డి) శుక్రకణం
48. ఏ అవయవం పనిచేయనప్పుడు డయాలసిస్ చేస్తారు?
ఎ) గుండె బి) ఊపిరితిత్తులు
సి) మూత్రపిండాలు డి) కాలేయం
49. పైత్య రసాన్ని స్రవించే గ్రంథి ఏది?
ఎ) కాలేయం బి) క్లోమం
సి) థైమస్ డి) ప్లీహం



50. కింది వాటిలో జ్ఞానేంద్రియం కానిది?
ఎ) చర్మం బి) కన్ను సి) నాలుక డి) ఉండుకం
51. ఫారన్ హీట్ డిగ్రీల్లో మానవుని సాధారణ ఉష్ణోగ్రత ఎంత?
ఎ) 37 బి) 72 సి) 98.4 డి) 104
52. ఎలర్జీ ఉన్న వ్యక్తి రక్తంలో ఏ కణాలు పెరుగుతాయి?
ఎ) రక్తఫలకికలు బి) ఎర్రరక్త కణాలు
సి) ఇసినోఫిల్స్ డి) లింఫోసైట్లు
53. ఆరోగ్యవంతుడైన మానవుని నాడీ పీడనం ఎంత?
ఎ) 72 బి) 120 సి) 40 డి) 18
54. బ్లడ్ బ్యాంకుల్లో రక్తాన్ని నిల్వ చేసేందుకు రక్తంలో కలిపే పదార్థం?
ఎ) సోడియం క్లోరైడ్ బి) సోడియం సిట్రేట్
సి) అమ్మోనియం క్లోరైడ్ డి) పైవన్నీ
55. మానవ గర్భావధి కాలం?
ఎ) 360 రోజులు బి) 270 రోజులు
సి) 180 రోజులు డి) 240 రోజులు

సమాధానాలు		17) ఎ	27) ఎ	37) సి	47) డి
1) సి	9) బి	18) ఎ	28) ఎ	38) ఎ	48) సి
2) బి	10) సి	19) సి	29) బి	39) బి	49) ఎ
3) ఎ	11) సి	20) బి	30) ఎ	40) సి	50)డి
4) డి	12) ఎ	21) ఎ	31) ఎ	41) బి	51) సి
5) బి	13) సి	22) ఎ	32) సి	42) సి	52) సి
6) ఎ	14) బి	23) ఎ	33) డి	43) బి	53) సి
7) డి	15) డి	24) సి	34) బి	44) సి	54) బి
8) సి	16) డి	25) ఎ	35) సి	45) ఎ	55) బి
		26) సి	36) డి	46) బి	

JOBS ఉద్యోగాలు

పిజెటిఎస్‌ఎయు

హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్(ఎస్సీ& ఎస్టీ బ్యాక్‌లాగ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 18
విభాగాలవారీ ఖాళీలు: అగ్రికల్చర్ 10, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ 5, హోం సైన్స్ 3
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 12
దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 21
వెబ్‌సైట్: www.pjtsau.ac.in

ఐటిబిపి

ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటిబిపి)- **సబ్ ఇన్‌స్పెక్టర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 21 (మహిళలకు 3, పురుషులకు 18)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 22
వెబ్‌సైట్: www.recruitment.iitbpolice.nic.in
www.itbpolice.nic.in

విఎస్‌ఎస్‌సి

ఇస్రో ఆధ్వర్యంలోని విక్రం సారాభాయ్ స్పేస్ సెంటర్ (విఎస్‌ఎస్‌సి)- **టెక్నీషియన్ అప్రెంటిస్‌ల** భర్తీకి ప్రకటన విడుదల చేసింది.
మొత్తం ఖాళీలు: 158
విభాగాలవారీ ఖాళీలు: ఆటోమొబైల్ 8, కెమికల్ 25, సివిల్ 8, కంప్యూటర్ సైన్స్ 15, ఎలక్ట్రికల్ 10, ఎలక్ట్రానిక్స్ 40, ఇన్‌స్ట్రుమెంట్ టెక్నాలజీ 6, మెకానికల్ 46
ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
అర్హత: 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో మూడేళ్ల డిప్లొమా పూర్తిచేసి ఉండాలి. అయితే 2015 ఏప్రిల్ తరవాత డిప్లొమా పూర్తిచేసినవారు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. శాండ్‌విచ్ డిప్లొమాస్/ ప్రైవేట్ డిప్లొమాస్/ షార్ట్ టర్మ్ కోర్సులు/ సర్టిఫికెట్ కోర్సులను పరిగణనలోకి తీసుకోరు.
వయసు: ఇంటర్వ్యూ నాటికి 30 ఏళ్లు మించరాదు
స్టయిపెండ్: నెలకు రూ.3542
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా **ఇంటర్వ్యూ:** ఆగస్టు 19
వేదిక: Govt.polytechnic College, kalamassery, Ernakulam District, Kerala
ఆసక్తిగల అభ్యర్థులు ముందుగా www.mhrdnats.gov.in/ www.sdcentre.org వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి.
వెబ్‌సైట్:
http://www.vssc.gov.in/VSSC V4/images/

కొచ్చిన్ షిప్‌యార్డ్

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్- **గ్రాడ్యుయేట్, టెక్నీషియన్ అప్రెంటిస్‌ల** భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ **ఖాళీలు:** 72
విభాగాలవారీ ఖాళీలు: ఎలక్ట్రికల్ 12, మెకానికల్ 27, ఎలక్ట్రానిక్స్ 6, సివిల్ 12, కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ అప్లికేషన్స్/ ఐటి 8, సేఫ్టీ 3, మెరైన్ 2, నేవల్ ఆర్కిటెక్చర్ & షిప్ బిల్డింగ్ 2
అర్హత: సంబంధిత విభాగంలో బిఇ/ బిటెక్ పూర్తిచేసి ఉండాలి.
ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
స్టయిపెండ్: నెలకు రూ.8,000
టెక్నీషియన్ అప్రెంటిస్ **ఖాళీలు:** 100
విభాగాలవారీ ఖాళీలు: ఎలక్ట్రికల్ 22, మెకానికల్ 28, ఎలక్ట్రానిక్స్ 8, ఇన్‌స్ట్రుమెంటేషన్ 7, సివిల్ 9, కంప్యూటర్ 6, కమర్షియల్ ప్రాక్టీస్ 20
అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా పూర్తిచేసి ఉండాలి.
ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
స్టయిపెండ్: నెలకు రూ.7,000
ఎంపిక: అకడమిక్ మెరిట్ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31
వెబ్‌సైట్: www.cochinshipyard.com/ career/ Notification

లైంగిక దాడి ఘటనపై డీఎస్పీ విచారణ

ఇందుకూరుపేట : ముదివర్తిపాళెంలో దళితవాడకు చెందిన బాలికపై కొంతకాలంగా లైంగికదాడి జరిగిన కేసును శుక్రవారం రూరల్ డీఎస్పీ రాఘవరెడ్డి గ్రామంలో విచారించారు. అదే గ్రామానికి చెందిన యువకుడు బాలికను భయాందోళనకు గురి చేసి కొంతకాలంగా లైంగికదాడి చేస్తున్న విషయం పోలీసుల దృష్టికి వచ్చింది. దీంతో వారు వెంటనే కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఏఎస్ఐ మధుసూదన్‌రావు కేసు నమోదు చేసి రూరల్ డీఎస్పీకు బదిలీ చేయడంతో ఆయన శుక్రవారం మహిళా పోలీసు అధికారిని, సిబ్బందితో గ్రామంలో విచారించారు.

వైభవంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠ

విడవలూరు: చౌకిచర్ల గ్రామంలో వినాయక విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం అత్యంత ఘనంగా జరిగింది. ఆలయ పూజారి కిశోర్ స్వామి తొలుత భూమిశుద్ధి, బలిహారణ పూజలు చేశారు. అనంతరం వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. తదుపరి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచు సమాధి కృష్ణవేణి, శ్రీనివాసులు, దంపతులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఇందుకూరుపేటలో..



ఇందుకూరమ్మ, దేశమ్మ విగ్రహాలు

ఇందుకూరుపేట: ఇందుకూరుపేట గ్రామ దేవతలైన ఇందుకూరమ్మ, దేశమ్మ గ్రామ దేవత ఉత్సవ మూర్తులకు అత్యంత వైభవంగా ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం గ్రామోత్సవం నిర్వహించి అనంతరం వేద పండితుల సమక్షంలో వైభవంగా అలంకరించిన మండపంలో సుగంధ, విశేష పుష్పాలతో అమ్మవార్లను అలంకరించి ఈ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందుకూరుపేట, కొత్తూరు, పాములవారిపాళెం తదితర ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన ప్రసాద వినియోగం జరిగింది.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రి అందజేస్తున్న హెచ్‌ఎం

ఇందుకూరుపేట : పల్లెపాడు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఉచితంగా విద్యాపరికరాలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులురెడ్డి తన సొంత నిధులతో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు, పలకలు, జామెంట్రీ బాక్సులు తదితర సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మంజు, స్కూల్ కమిటీ చైర్మన్ స్వాతి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతి

ఓజిలి: ఓజిలి మండలం కురుగొండకు చెందిన జి చలపతి (51) శుక్రవారం అనారోగ్యం కారణంగా మృతి చెందాడు. మండలంలోని చిల్లమానుచేను జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన వారం రోజులుగా నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

అసౌకర్యాల నడుమ..

కునారిల్లుతున్న సంక్షేమ హాస్టళ్లు




ఎస్సీ బాలుర హాస్టల్‌లో దెబ్బతిన్న తలుపులు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలోని పలు సంక్షేమ హాస్టళ్లు అసౌకర్యాల నడుమ నడుస్తుండడంతో విద్యార్థినీ విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్‌లో 99 మంది తలదాచుకుంటున్నారు. ఇక్కడి మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. హాస్టల్ నిర్మించినప్పటి మరుగుదొడ్లే నేటికి ఉపయోగంలో ఉన్నాయి. భవనానికి సంబంధించిన పిల్లర్లు సైతం దెబ్బతింటున్నాయి. పలు గదులకు ఉన్న తలుపులు విరిగిపోయి ఉన్నాయి. కిటికీలకు ఏర్పాటు చేసి మెష్‌లు దెబ్బతినడంతో దోమల బెడద అధికమైంది. హాస్టల్ ఆవరణలో ఉన్న తాగునీటి బోరు అలంకారప్రాయంగా ఉంది. ఎస్సీ-1, ఎస్సీ-2 బాలికల వసతి గృహాలలో సైతం సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఈ రెండు వసతిగృహాల్లో 175 మంది విద్యార్థినులున్నా అందుకు తగ్గ వసతులేవి ఇక్కడ కనిపించడం లేదు. ఎస్సీ బాలికల హాస్టల్‌లో 90 మంది విద్యార్థినులకు కేవలం మూడు మరుగు దొడ్లే ఉన్నాయి. ఎస్సీ-2 హాస్టల్‌లో కొళాయిలు మరమ్మతులకు గురైనా పట్టించుకునే వారే కరువయ్యారు. అధికారులు హాస్టళ్లలో సౌకర్యాలు మెరుగుపర్చాల్సిన అవసరం ఉంది.



అలంకారప్రాయంగా బోరు



ఎస్సీ బాలుర హాస్టల్‌లో కంపుకొడుతున్న మరుగుదొడ్లు

చంద్రన్న రైతు క్షేత్రాలపై అవగాహన

కోవూరు: చంద్రన్న రైతు క్షేత్రాలపై రైతులందరికీ అవగాహన కల్పించాల్సిందిగా వ్యవసాయశాఖ అదనపు సంచాలకులు రవికుమార్ కోరారు. సంఘమిత్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగు లోపాల్ని గుర్తించి రైతులకు వివరించాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. చందన్న క్షేత్రాల్లో సాగుచేస్తున్న విధి విధానాల్ని రైతులకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో ఏడీ కుప్పయ్య, వ్యవసాయాధికారులు కల్యాణి, సురేంద్రరెడ్డి, శైలజకుమారి, ఏఈవో జయలక్ష్మీ, ఎంపీఈవో రాజశేఖర్, ఆత్మ ఏటీఎం దయానా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవికుమార్

గృహ నిర్మాణాలపై దామరమడుగులో గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో సుజాత

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని దామరమడుగులో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద గృహ నిర్మాణాల కోసం శుక్రవారం ఎంపీడీవో సుజాత ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె లబ్ధిదారులతో మాట్లాడుతూ పల్స్ సర్వేలో నమోదు కాకపోయిన అర్హులైన వారు గృహ నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పల్స్ సర్వేలో గృహ నిర్మాణాలకు దరఖాస్తు చేసుకొని ఉన్న అనర్హత కలిగి ఉంటే వారి పేరు జాబితా నుంచి తొలగిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురేష్, గ్రామపంచాయితీ అధికారితో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. పలువురు నిరుపేదలు ఇళ్లకోసం దరఖాస్తులు చేసుకున్నారు.

సొంతంగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలి

కోవూరు: భవిష్యత్తులో సొంతంగానే ఫ్యాక్టరీల్ని ఏర్పాటుచేసుకొనే విధంగా విద్యార్థులు ఎదగాలని ఎమ్ఎస్ఎమ్ఈ సహాయక డైరక్టర్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో వ్యవస్థాపకత అంశంపై శుక్రవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రపంచీకరణ వల్ల పాత పరిస్థితులన్నీ మారాయన్నారు. స్వేచ్ఛావిపణితో వ్యవస్థాపకతకు ప్రాధాన్యం చేకూరిందన్నారు. ఇంజనీరింగ్ పట్టభద్రులు దేశ ఆర్థిక వ్యవస్థను సుసంపన్నం చేయాల్సిందిగా కోరారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపల్ సుబ్బారావు, జిల్లా పారిశ్రామిక కేంద్రం సహాయక డైరక్టర్ వెంకట సురేష్, సమరశేఖర్‌రెడ్డి, తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

వైభవంగా శ్రావణ శుక్రవారం పూజలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడ ఆలయంలో శ్రీ మల్లికార్జున కామాక్షితాయివార్లకు శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఆలయానికి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు ఉదయం పిండి దీపారాధనలు, రాహు కాల దీపారాధనలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కామాక్షితాయికి ఉదయం నవావరణపూజలు, నిత్యకల్యాణం, సాయంత్రం సామూహిక కుంకుమార్చన, పల్లకీసేవలు జరిగాయి. కాగా మల్లికార్జున స్వామికి ఉదయం అభిషేకం జరిగింది. ఆలయానికి అత్యధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు నిత్య అన్నదాన సదనంతో పాటు కాశీ అన్నపూర్ణేశ్వరి, అన్నదానం సత్రంలో భోజన వసతి కల్పించారు.

ఇందుకూరుపేట : మండలంలోని పలు ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా వైభవంగా పూజలు జరిగాయి. ఇందుకూరుపేట లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, కొత్తూరు లలితా పరమేశ్వరి ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, గంగపట్నం చాముండేశ్వరి ఆలయం, మైపాడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయం, లేబూరు కుంకాళమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

వైభవంగా లక్ష కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

కోవూరు: పాటూరురోడ్డులోని శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం లక్షకుంకుమార్చన పూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మనోహర్ శర్మ కుంకుమపూజ చేయించారు.

ప్రత్యామ్నాయ ఇళ్ల స్థలాలు కేటాయించండి

బుచ్చిరెడ్డిపాళెం: మలిదేవివాగుకు సమీపంలో డంపింగ్‌యార్డ్ పక్కనే పూరిగుడిసెల్లో నివాసం ఉంటున్న గిరిజన కుటుంబాలను శుక్రవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కమలకూమారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ వద్ద గిరిజనులు నివాసం ఉండడం ఏ మాత్రం క్షేమకరం కాదన్నారు. గిరిజనులకు మరోచోట ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, తహసీల్దార్ రవీంద్ర బాబు, సర్పంచు స్నేహలత, తదితరులు ఉన్నారు.


విద్యార్థి గణన వేగవంతం చేయాలి

సీతారామపురం: విద్యార్థి గణన ప్రక్రియను వేగవంతం చేయాలని ఎస్‌ఎస్‌ఏ అకడమిక్ మానటరింగ్ అధికారి సయ్యద్ అబ్దుల్‌హమీద్ పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో సీఆర్పీలతో సమీక్షించారు. బడిబయట పిల్లల వివరాలు సేకరించి వెంటనే వారిని పాఠశాలల్లో చేర్పించాలన్నారు. శాలశుద్ధి అమలుపై ఆరాతీసి ఈనెల 16వ తేదీలోపు విద్యార్థి గణన పూర్తి చేయాలని సూచనలిచ్చారు. ఎంఈవో మస్తాన్‌వలి, డీఎంఎల్‌పీ జయరావు, సీఆర్పీలు, ఐఈడీ ఎమ్మార్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల పాకలుగా అంగన్‌వాడీ భవనాలు!

దుత్తలూరు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు పశువులు కొట్టాలుగా మారాయి. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో దుత్తలూరు మండలంలో 14 అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించారు. 2015లో ఈ భవనాల శ్లాబు పనులు పూర్తయ్యాయి. అప్పట్నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో చుట్టుపక్కల నివాసముండే వారు ఆ భవనాలను పశువులు కొట్టాలుగా ఉపయోగించుకుంటున్నారు. రాచవారిపల్లి, దుత్తలూరు బీసీ కాలనీ, ఏఏ కాలనీ, తెడ్డుపాడు ఎస్సీ కాలనీ, వడ్డిపాళెం ఎస్సీ కాలనీ, భైరవరం, తురకపల్లి, నర్రవాడ, నర్రవాడ బీసీ కాలనీ, తిమ్మాపురం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. రూ.6.50 లక్షలు మంజూరు చేస్తే ప్లాస్టింగ్, ఇతర పనులు పూర్తై వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. బిల్లులు మంజూరు కాకపోవడంతో గుత్తేదారులుపనులు చేసేందుకు వెనుకంజ వేస్తున్నారు. ప్రస్తుతం ఆయా కేంద్రాలను ప్రభుత్వ పాఠశాల వరండాలు, అద్దె గదుల్లో నిర్వహిస్తున్నారు. దీంతో చిన్నారులు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి భవనాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.


దుత్తలూరు అంగన్‌వాడీ భవనంలో కట్టేసిన పశువులు


రాచవారిపల్లిలో అర్ధాంతరంగా నిర్మాణం ఆగిపోయిన భవనం

బెల్టు దుకాణాల నిర్మూలనపై అవగాహన

సీతారామపురం: బసినేనిపల్లిలో శుక్రవారం ఉదయగిరి ఎక్సైజ్ సీఐ నరసింహారావు ఆధ్వర్యంలో బెల్టు దుకాణాల నిర్మూలనపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అనంతరం, విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం, సర్పంచ్ రమాదేవి, సీపీఎం నాయకులు కొడె రమణయ్య, గ్రామ పెద్దలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

వింజమూరు: స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు.ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు

ఇంటర్వ్యూ



ఆత్మగౌరవం

లక్ష్యాలు పూర్తి చేయాలి

ప్రత్యూష, ఎంపీడీవో

?. మండలంలో ఎన్ని మరుగుదొడ్లు మంజూరయ్యాయి.

!. మండలంలో 4,323 మరుగుదొడ్లు మంజూరయ్యాయి.

?. వాటిలో ఎన్ని పూర్తయ్యాయి, ఎన్ని నిర్మాణంలో ఉన్నాయి.

!. మంజూరైన వాటిలో 4,044 నిర్మాణం పూర్తి చేసుకోగా, 279 వివిధ దశల్లో ఉన్నాయి. త్వరలో వాటిని కూడా పూర్తి చేస్తాం.

?. బిల్లులు ఎంతమేర చెల్లించారు.

!. అడ్వాన్స్‌గా నిర్మాణాలు చేయించాం. ప్రభుత్వ నిబంధనల మేరకు పంచాయతీల వారీగా చెల్లింపులు చేస్తున్నాం.

?. పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేపట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

!. వ్యక్తిగతంగా అవగాహన కల్పించడం, నేచురల్ లీడర్ల ద్వారా నిర్మాణాల పూర్తికి కృషి చేస్తున్నాం.

- వింజమూరు

పాఠశాలల బంద్

ఉదయగిరి: మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలల బంద్ నిర్వహించారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సిసింద్రీ డిమాండ్ చేశారు. ఎంఎస్ఎఫ్ నాయకులు కిరణ్‌మాదిగ, హజరత్తయ్య, రాజా, మణి, రాజారత్నం, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాలు సేకరించాలి

ఉదయగిరి: రైతుల నుంచి మట్టి నమూనాలు సేకరించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు సత్యవాణి కోరారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులు, ఏఈవోలు, ఎంపీఈవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి మండలానికి 200 చొప్పున మట్టి నమూనాలు అక్టోబర్‌లోగా చేపట్టాలన్నారు. వ్యవసాయాధికారులు జహీర్, చెన్నారెడ్డి, వెంకటసుబ్బయ్య, రాధా తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పాలకవర్గ సమావేశం

వరికుంటపాడు: తూర్పుబోయమడగల పంచాయతీ పాలకవర్గ సమావేశం శుక్రవారం సర్పంచ్ చెంచయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలోని పాత పంచాయతీ భవనానికి మరమ్మతులు, తాగునీటి సమస్య పరిష్కారానికి, పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభుదాస్, వార్డుసభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణాల పరిశీలన

వింజమూరు: స్థానిక గంగమిట్ట ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లను శుక్రవారం ఎంపీడీవో ప్రత్యూష, ఈవో రామారావు పరిశీలించారు. ఇంటి యజమానులకు పలు సూచనలు అందచేశారు. మరుగుదొడ్ల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలన్నారు. పూర్తయిన వాటికి వెంటనే బిల్లులు చెల్లిస్తామన్నారు.

వివాహ వేడుకకు ప్రముఖుల హాజరు

వింజమూరు: ఉదయగిరి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు దంతులూరి వెంకటేశ్వరరావు కుమారుడు వెంకటప్రవీణ్ వివాహానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, ఇతర ప్రముఖులు హాజరై వరుడిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి అన్ని మండలాల దేశం నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

గేదె మృతిపై ఫిర్యాదు

వరికుంటపాడు: జీ.కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బయ్యపురెడ్డి అనే రైతుకు చెందిన గేదె మృతిచెందడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. బయ్యపురెడ్డికి చెందిన గేదె మూడు రోజులుగా కనిపించలేదు. శుక్రవారం గ్రామ సమీపంలోని కమ్మిత చిలకలయ్య పొలంలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందిఉండగా, స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గేదె విలువ రూ.60 వేలు ఉంటుందని తెలిపారు.

ఉదయగిరి ప్రతిష్ఠ దిగజార్చారు

సీతారామపురం: పసుపు కుంభకోణంలో నిందితులుగా మారిన అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఉదయగిరి ప్రతిష్ఠను దిగజార్చారని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెంచలబాబుయాదవ్ విమర్శించారు. ఆయన శుక్రవారం సీతారామపురంలో విలేఖరులతో మాట్లాడుతూ గతంలో వెంకయ్యనాయుడు, ధనెంకుల, చెంచురామయ్య, మాదాల వంటి వారు ఉదయగిరి కీర్తి ప్రతిష్ఠలను పెంచారన్నారు. ప్రస్తుతం పసుపు కుంభకోణం, కరువు భత్యం బొక్కేయడం, ఉపాధి అవినీతి, నీరు-చెట్టులో అక్రమాలకు పాల్పడుతుండడంతో పరిస్థితి కంచే చేను మేసిందన్న చందంగా మారిందన్నారు. దోషులను ఇంతవరకు అరెస్టు చేయకపోవడం శోచనీయమన్నారు. నంద్యాలలో మైనారిటీ అభ్యర్థిని కాంగ్రెస్ బరిలో దింపడంతో ఓటింగ్ శాతం పెరుగుతుందన్నారు. అధికారులు ఇప్పటికైనా అధికార పార్టీ నాయకుల ప్రలోభాలకు తలొగ్గకుండా విధులు నిర్వహిస్తే బాగుంటుందని, లేకపోతే మూకుమ్మడిగా ఇంటిబాట పట్టాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ పెద్దపులి హైదర్‌అలీ, కాంగ్రెస్ నాయకులు సుమన్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చెంచలబాబుయాదవ్

సంతానలక్ష్మి అమ్మవారికి నల్లపూసల దండ సమర్పణ

ఉదయగిరి: స్థానిక ఆనకట్ట సమీపంలోని సంతానలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం నాల్గో శుక్రవారం సందర్భంగా అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. కుంకుమార్చన, పంచామృతాభిషేకాలు చేశారు. స్థానికులే కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. దుర్గంపల్లిలోని ఉదయలక్ష్మి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా సీతారామపురం మండలం జయపురం గ్రామానికి చెందిన రామచంద్ర, పుష్ప దంపతులు రూ.34 వేల విలువ కలిగిన నల్లపూసల దండను అమ్మవారికి సమర్పించారు. ఈ ఆభరణాన్ని ఆలయ నిర్వాహకులు తిరుపతయ్యకు అందచేశారు. అంతకుముందు అమ్మవారికి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.


నల్లపూసల దండ అందచేస్తున్న భక్తులు

ఆడిట్‌లో పారదర్శకత పాటించాలి


ఏపీడీకి ఫిర్యాదు చేస్తున్న పీసీ అల్లూరురాజు

సీతారామపురం: సామాజిక తనిఖీల్లో పారదర్శకత పాటించాలని వైసీపీ నాయకుడు పీసీ అల్లూరురాజు కోరారు. ఆయన శుక్రవారం ఉపాధి హామీ పనుల్లో భారీస్థాయిలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని ఉదయగిరి ఏపీడీ శ్రీహరికి ఫిర్యాదు చేశారు. సామాజిక తనిఖీ బృంద సభ్యులను ప్రలోభాలకు గురిచేసే అవకాశమున్నందున తనిఖీల్లో రాజీపడకూడదన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ఉదయగిరి రూరల్: స్థానిక బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ అల్లూరు మండలం నార్త్ ఆములూరుకు బదిలీ అయిన ఆకుల శ్రీనివాసులురెడ్డిని శుక్రవారం ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఎంఈవోలు పి.మోహన్‌రావు, షేక్ అల్లాబక్ష్ మాట్లాడుతూ ఆరేళ్లుగా శ్రీనివాసులురెడ్డి విద్యాభివృద్ధికి ఎనలేని సేవలందించి ప్రశంసలు పొందారన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ జమీర్, హెచ్ఎంలు నాగయ్య, సాదిక్ బాషా, ఉపాధ్యాయులు షేక్ ఎండీ కరీం, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

వరికుంటపాడు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దిరెడ్డిపల్లి, విరువూరు, తిమ్మారెడ్డిపల్లి, జడదేవి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్రీడా పోటీలు నిర్వహించారు.

వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలి

ఉదయగిరి రూరల్: రాష్ట్రంలో వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తించాలని బీజేపీ జాతీయ మహిళా మోర్చా నాయకురాలు, మాజీ కేంద్రమంత్రి దగ్గుపాటి పురందేశ్వరిని విజయవాడలో కలిసి వినతిపత్రం అందజేసినట్లు వాల్మీకి సంఘ నాయకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు వాల్మీకులను ఎస్టీల్లో చేర్పాలని బీజేపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రవీంద్రరాజు, రాష్ట్ర ఓబీసీ అధ్యక్షుడు జల్లి మధుసూదన్‌లను సైతం కలిసి వినతిపత్రాలు సమర్పించినట్లు వివరించారు. వాల్మీకులను ఎస్టీలో చేర్చేందుకు తమ పూర్తి మద్దతు ప్రకటిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి సంఘ యువసేన నాయకులు క్రాంతినాయుడు, గుజ్జుల రమేష్‌నాయుడు, కావలి సునీల్‌కుమార్, జే.శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ఉదయగిరి రూరల్: నియోజకవర్గ పరిధిలోని దుత్తలూరుకు చెందిన పొన్నూరు కోటయ్య శుక్రవారం పురుగులమందు సేవించి ఆత్మహత్యకు యత్నించాడు వివరాల మేరకు.. కుటుంబంలో ఏర్పడ్డ కలహాల కారణంగా మనస్తాపం చెందిన కోటయ్య పురుగులమందు సేవించాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 3, 8

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. ప్రేమానుబంధాలు బలపడతాయి. చిట్‌ఫండ్‌లు, పొదుపు పథకాలు లాభిస్తాయి. చిన్నారుల వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. సంకల్పం నెరవేరుతుంది.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): దూరంలో ఉన్న ప్రియతములు ఇల్లు చేరుతారు. వేడుకలు, బృందకార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తారు. రాజకీయ, సినీరంగాల వారు కీలక పదవులు అందుకుంటారు. కీలక పత్రాలు అందుకుంటారు.

మిథునరాశి: (మే21-జూన్21): బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం లభిస్తుంది. సమావేశాలు, చర్చలు ఫలిస్తాయి. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. ప్రముఖుల్ని కలుసుకుంటారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు. లక్ష్యం నెరవేరుతుంది.

సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): కొత్త వ్యూహాలు అమలు చేసి సత్ఫలితాలు సాధిస్తారు. న్యాయ, బోధన, రవాణా రంగాల వారికి అనుకూలం. నూతన ప్రాజెక్టులను విజయవంతంగా చేపడతారు. మనసు ఉల్లాసంగా ఉంటుంది.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సంస్మరణలు, ఆధ్యాత్మిక సమావేశాల్లో పాల్గొంటారు. పూర్వ మిత్రులకు సంబంధించిన చర్చలు ఫలిస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. యోగ, ధ్యానాలపై దృష్టి పెడతారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. పందాలు, పోటీల్లో విజయం సాధిస్తారు. ప్రేమలు ఫలిస్తాయి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఆస్పత్రులు, ఫార్మా, రెస్టారెంట్లు, రిక్రియేషన్ రంగాల వారు పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వ్యవసాయం, పరిశ్రమల రంగాల వారికి ప్రోత్సాహకరం. విందు వినోదాల్లో ఉల్లాసంగా పాల్గొంటారు.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. ప్రియతములకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. బంధుమిత్రులతో సమావేశాలు, వేడుకల్లో పాల్గొంటారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): గృహావసరాల కోసం అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. ఆర్థిక విషయాల్లో కుటుంబ సభ్యుల సహకారం లభిస్తుంది. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకర సమయం.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): బంధుమిత్రుల కలయిక ఆనందం కలిస్తుంది. జనసంబంధాలు విస్తరిస్తాయి. స్టేషనరీ, ప్రింటింగ్, కమ్యూనికేషన్ల రంగాల వారికి శుభప్రదం. ప్రియతములతో ఉల్లాసంగా గడుపుతారు.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అనుకూలం. సహోద్యోగుల ఆర్థిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, చిట్‌ఫండ్‌లలో పనిచేసే వారికి ప్రోత్సాహకరం

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

ఫ్యాక్షన్ రాష్ట్రంగా మార్చేందుకు జగన్ యత్నం

- జగన్ చేసిన నేరాలకు 84 ఏళ్ల జైలు ఖాయం
- రావణుడి లాంటి జగన్ ఉంటేనే రాముని లాంటి బాబుకు ఖ్యాతి
- జగన్‌ను రాజకీయాల నుంచి తొలగించాలి
- నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (వేదాయపాళెం) : ప్రశాంతతకు మారుపేరైన, అన్నపూర్ణగా వెలుగొందుతున్న రాష్ట్రాన్ని ఫ్యాక్షన్ రాష్ట్రంగా మార్చేందుకు వైసీపీ అధినేత జగన్ ప్రయత్నిస్తున్నారని నుడా చైర్మన్, టీడీపీ నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి విమర్శించారు. శుక్రవారం నగరంలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బీహార్‌లో ఉన్నటువంటి పరిస్థితితులను రాష్ట్రంలో సృష్టిచేందుకు జగన్ ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. ఇటీవల నంద్యాలలో ముఖ్యమంత్రిని నడిరోడ్డుపై కాల్చి చంపాలని చెప్పి తెలుగువారి ప్రతిష్టను దెబ్బతీశారన్నారు. దీనిపై ఈసీకి జగన్ వివరణ ఇచ్చారన్నారు. రాజకీయ నేతలు హూందాగా వ్యవహరించాలని ఈసీ చీఫ్ భన్వర్‌లాల్ సూచించారని పేర్కొన్నారు. ఇది జరిగి 24 గంటలు గడవక ముందే మళ్లీ అదే ముఖ్యమంత్రిని నడిరోడ్డుపై ఉరి తీయాలని జగన్ చెప్పడం ఆయన ఫ్యాక్షనిజానికి నిదర్శనమన్నారు. దీనిని ఈసీ సుమోటాగా స్వీకరించి జగన్‌ను శాశ్వతంగా రాజకీయాల నుంచి తొలగించాలని డిమాండు చేశారు. అసలు ముఖ్యమంత్రి చంద్రబాబును ఎందుకు చంపాలని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన తరువాత రూ.16వేల కోట్ల లోటులో ఉన్న రాష్ట్రాన్ని కనీవినీ ఎరుగని తీరిలో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాందుకా, రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణామాఫీ చేసినందుకా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా వేల కోట్ల రూపాయలను అందిస్తున్నందుకా అని ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నేతగా రావణుడి లాంటి జగన్ ఉంటేనే రాముని లాంటి చంద్రబాబుకు ఖ్యాతి దక్కుతుందన్నారు. జగన్ మీద ఉన్న 12 చార్జ్‌షీట్లకు నేరం రుజువైతే సుమారు 84 ఏళ్ల జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. నంద్యాల ఉప ఎన్నికలో టీడీపీ విజయం తరువాత వైసీపీ సగం ఖాళీ అవుతుందని జోస్యం చెప్పారు. 2019 నాటికి ఆ పార్టీ బంగాళా ఖాతంలో కలిసి పోవడం ఖాయమన్నారు. రాష్ట్రంలో ఇంత అభివృద్ధి జరుగుతున్నా జరగడంలేదని వైసీపీ అధినేత జగన్‌తో పాటు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రజలకు వివరిస్తున్నారని తెలియజేశారు. ప్రజలు వైసీపీ నేతలు చెప్పే అబద్దాలు నమ్మే స్థితిలో లేరన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వైసీపీ నేతలు చర్చకు సిద్ధమా అని ఆయన సవాలు విసిరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్, టీడీపీ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు మొయినుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, జిల్లా గ్రంథాలయాల సంస్థ డైరెక్టర్ జలదంకి సుధాకర్, నేతలు ఉచ్చూరు శ్రీనివాసులు నాయుడు, కువ్వారపు బాలాజీ, పెద్దబాబు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి కంప్యూటర్ శిక్షణ

నెల్లూరు (క్యాంపస్) : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీ నుంచి ఉపకార వేతనంతోకూడిన కంప్యూటర్ శిక్షణ ప్రారంభిస్తున్నామని నేషనల్ హ్యూమనిటీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎస్‌కేఎం బాబు తెలిపారు. నెల్లూరులోని ఆ సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ శిక్షణ అందిస్తుందన్నారు. పదో తరగతి పాసైన వారందరూ అర్హులని తెలిపారు. మూడు నెలలు శిక్షణ అనంతరం మూడు నెలల స్టైఫండ్, ప్రభుత్వ సర్టిఫికెట్, కంప్యూటర్ అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న యువత ఈనెల 14, 15, 16 తేదీలలో సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 79930 66312, 79930 66313 నెంబర్లను సంప్రదించాలన్నారు.

రేపు మంత్రి కామినేని రాక

నెల్లూరు(కలెక్టరేట్): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదివారం నెల్లూరుకు వస్తున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు నెల్లూరకు చేరుకుని, సాయంత్రం నాలుగు గంటలకు రూరల్ మండలంలోని దేవరపాళెంలో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని, అనంతరం తిరుమలకు బయలుదేరి వెళతారని అధికారులు తెలిపారు.

మాలమాదిగల మధ్య చిచ్చును సహించం

నెల్లూరు (వేదాయపాళెం) : ఎస్సీ వర్గీకరణ పేరుతో అన్నదమ్ములుగా కలిసి ఉన్న మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టేందుకు రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తే సహించేది లేదని ఏపీ మాల మహానాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గున్నం చిన్నయ్య, అరవ పీటర్ హెచ్చరించారు. మాల మృత వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నగరంలోని వీఆర్‌సీ సెంటర్ వద్ద వారు విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అరవ పుష్పరాజు, కేసీపాల్, సురేష్, ప్రశాంత్‌కుమార్, దాసరి ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు 12 మేకల మృతి



మృతిచెందిన మేకలు

బిట్రగుంట: బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయతీకి చెందిన డేగ కొండయ్య 12 మేకలు శుక్రవారం పిడుగుపాటుకు మృతి చెందాయి. డేగ మాలకొండయ్య కుమారులు కొండయ్య, మాధవయ్య ఎప్పటిలాగే గొర్రెలు, మేకలు తోలుకొని మేపుతుండగా వ ర్షం పడుతూ ఉరుములు, మెరుపులతో పిడు గు పడగా వర్షానికి తాటి బొంద కిందకు వె ళ్లిన 12 మేకలు అక్కడికక్కడే మృతిచెందా యి. తండ్రి వద్దనే నున్న కుమారుడు మదన్‌కు కూడ విద్యుత్ షాక్ కొట్టినట్లు తెలిపాడు. గుట్టగా చెల్లాచెదురుగా మేకలు పడిఉండటం వారిని వేదనకు గురిచేసింది. ఘటనా స్థలానికి మాజీ సర్పంచ్ మేకల కొండ య్య, చిత్తూరి శీనయ్య, గోపాలమిత్ర సభ్యుడు ప్రసాద్, గ్రామస్థులు వెళ్లి రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు.

హైవే నిర్వాసితులకు మౌలిక వసతులు కల్పించాలి : జేసీ



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ ఇంతియాజ్ అహ్మద్

నెల్లూరు(కలెక్టరేట్): జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా నిర్వాసితులకు మౌలిక వసతులు కల్పించాలని జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ భారత జాతీయ రహదారుల సంస్థ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల విస్తరణపై శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సమీక్షించారు. నిర్వాసితులకు పరిహారం ఎంతమేర చెల్లించినది, చెల్లించవలసినది, నిధులు, మౌలిక వసతులు ఎలా కల్పిస్తున్నారు అనే అంశాలపై జాతీయ రహదారుల ఇంజనీర్లను ప్రశ్నించారు. మౌలిక వసతుల కల్పనకు సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్-2 వెంకట సుబ్బారెడ్డి, డీఆర్వో వెంకట సుబ్బయ్య, జాతీయ రహదారుల శాఖ టెక్నికల్ మేనేజర్ విజయవాణి, ఏఈఈ అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

22 క్యారెట్స్ బంగారం

గ్రాము ధర	-	2,782
సవర (8 గ్రాములు)	-	22,256
వెండి కిలో ధర	-	42,200
వెండి గ్రాము ధర	-	42.20

చికెన్ ధరలు

వెన్‌కాబ్..

బాయిలర్ రైతు ధర	76
లేయర్	82
స్కిన్ చికెన్	126
స్కిన్‌లెస్ చికెన్	149
లేయర్ మాంసం	140

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్..

బాయిలర్ లైవ్	85
లేయర్ లైవ్	82
స్కిన్ చికెన్	140
స్కిన్‌లెస్	164
లేయర్	140

నిమ్మ ధరలు (బస్తా) గూడూరు

పచ్చివి: 1200 రూపాయల నుంచి 2200 వరకు

పండ్లు: 800 రూపాయల నుంచి 1200 వరకు

జలాశయాల్లో నీటిమట్టాలు

సోమశిల

పూర్తి సామర్థ్యం:	78 టీఎంసీలు
ప్రస్తుత నీటినిల్వ:	6.283 టీఎంసీలు
ఇన్‌ఫ్లో :	------------
అవుట్‌ఫ్లో :	200 క్యూసెక్కులు
ఆవిరి :	47 క్యూసెక్కులు

సంగం ఆనకట్ట

నీటిమట్టం :	-------------
కనిగిరికాలువ :	-------------
ఎడమ కాలువ :	-------------
కనుపూరు కాలువ:	-------------
బీపీఆర్ కాలువ :	------------
నెల్లూరుచెరువుకాలువ :	------------

ఏనుగులు చాలా తెలివైనవి. వాటికి జ్ఞాపకశక్తి ఎక్కువ. మనుషుల్లానే వాటికీ భావోద్వేగాలుంటాయి. మనుషులతో చాలా స్నేహంగా ఉంటాయి. కానీ రోజు రోజుకూ వాటి సంఖ్య తగ్గిపోతోంది. దంతాల కోసం, శరీర భాగాల కోసం అమానుషంగా వాటిని కొందరు చంపేస్తున్నారు. అయినా ఆ భారీ జంతువులకు మనుషుల మీద కోపం రాలేదు. ఆకారం భారీగా ఉన్నా అందరితో ప్రేమగా మెదిలే ఏనుగులను కాపాడాలనే ఉద్దేశంతో 'ప్రపంచ ఏనుగుల దినోత్సవం' మొదలైంది.



ఏనుగమ్మ.. ఏనుగు

ఏనుగులు మనుషులతో ఇట్టే కలిసిపోతాయి. భారతీయ సంస్కృతిలోనూ ఏనుగులకు విశిష్ట స్థానం ఉంది. నాలుగు వేల సంవత్సరాల నుంచి మానవులతో మైత్రి కొనసాగిస్తున్న గజరాజులకు.. మానవుల వల్లే ప్రమాదం పొంచి ఉంది. గత పది సంవత్సరాల్లో ఏనుగుల సంఖ్య 62 శాతం తగ్గింది. ప్రతిరోజు దాదాపు 100కు పైగా ఏనుగులు చనిపోతున్నాయి. ఏనుగు మాంసం, శరీర భాగాలు, దంతాల కోసం వేటగాళ్లు వాటిని చంపుతున్నారు. ఇది ఇలానే కొనసాగితే మరో పదిహేను, ఇరవై సంవత్సరాల్లో ఏనుగులు అంతరించిపోతాయని అంటున్నారు పర్యావరణవేత్తలు. అరణ్యంలో దొరికిన అనాథ ఏనుగుల్ని 'టూరిజమ్ ఇండస్ట్రీ', 'సర్కస్', 'టూరిస్ట్ పార్కు'లకు విక్రయించడంతో పాటు, అడవుల సంఖ్య తగ్గడం వల్ల కూడా వీటి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఇది గమనించిన కెనడియన్ ఫిల్మ్‌మేకర్ ప్యాట్రిసియా సిమ్స్, 'థాయ్‌లాండ్ రీ ఇంట్రడక్షన్ ఫౌండేషన్' సాయంతో ఆగస్టు 12న 'ప్రపంచ ఏనుగుల దినోత్సవా'న్ని జరుపుకోవాలని పిలుపునిచ్చాడు. ఏనుగులను కాపాడుకోవటం అందరి బాధ్యతంటూ సిమ్స్ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాడు.

ఎన్నెన్నో ఏనుగులు

ఆసియా ఏనుగులు:

- ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఏనుగుల్లో కేవలం పది శాతం మాత్రమే ఆసియా ఏనుగులున్నాయి. జన్యు వ్యత్యాసాల ఆధారంగా ఏనుగులను మూడు ఉప జాతులుగా విభజించారు. ఇవి ఇంచుమించు నాలుగు వేల నుంచి ఐదు వేల వరకు ఉన్నాయి.
- **శ్రీలంక ఏనుగు :** ఆసియా ఏనుగులన్నింటిలోనూ పెద్దది. ఇవి శ్రీలంకలో మాత్రమే ఉన్నాయి.
- **ఇండియన్ ఎలిఫెంట్ :** ఇవి భారత దేశం నుంచి ఇండోనేషియా వరకు విస్తరించి ఉన్నాయి. వీటి సంఖ్య దాదాపు 35 వేల వరకు ఉండొచ్చు.
- **సుమత్రా ఏనుగు :** ఇవి అన్నింటికన్నా చిన్న పరిమాణంలో ఉంటాయి.

ఆఫ్రికా ఏనుగులు :

- ఆఫ్రికా ఖండంలో 37 దేశాల్లో ఇవి విస్తరించి ఉన్నాయి.
- ఇవి ఆసియా ఏనుగులకంటే పెద్దవిగా ఉంటాయి. వీటి చెవులు చాలా విశాలంగా, చెవులు చూడటానికి ఆఫ్రికా ఖండం ఆకారంలో ఉండటం విశేషం.



రక్షించుకుందాం !

WORLD elephant DAY
August 12th

- అరణ్యాల్లో పోలీసుల సంఖ్య పెంచడం వల్ల వేటగాళ్ల నుంచి ఏనుగులను రక్షించుకోవచ్చు.
- గాయపడ్డ ఏనుగులకు ప్రత్యేక చికిత్సలను అందిస్తే, ఎన్నో ఏనుగులను కాపాడుకోవచ్చు.
- అనాథ ఏనుగులను టూరిజం ఇండస్ట్రీకి ఇవ్వకుండా ప్రత్యేక చట్టాలను రూపొందించడం ద్వారా కూడా వీటిని రక్షించుకోవచ్చు.
- ఏనుగుల శరీర భాగాలను స్మగ్లింగ్ చేస్తున్న వారికి కఠిన శిక్షలు విధించడం వల్ల కూడా గజరాజులను కాపాడుకోవచ్చు.

టంగ్ ట్విస్టర్స్

1. I see a sea down by the seashore.But which sea do you see down by the seashore?
2. There those thousand thinkers were thinking where did those other three thieves go through.
3. Five frantic frogs fled from fifty fierce fishes.

నవ్వుల్ నవ్వుల్


తండ్రి : ఏరా! గౌరీ! ఆవుకి ఆ కళ్లద్దాలు ఎందుకు పెట్టావు రా?
గౌరి : ఈ రోజు పచ్చగడ్డి దొరకలేదు. అందుకే ఆవుకు ఎండుగడ్డి వేసి పచ్చ కళ్లద్దాలు పెట్టాను.
తండ్రి : !!!!!!!!!!!!

సుత్తివేలు : అరేయ్! నువ్వు నిద్రపోయి లేచేసరికి నీకో కోటి రూపాయలు వచ్చాయనుకో! ఏం చేస్తావ్?
మిస్టర్ మేధావి : మళ్లీ పడుకుని ఇంకో కోటి రూపాయలు వస్తాయేమో చూస్తా!
సుత్తివేలు : !!!!!!!!!!!!!!

రంగులు వేయండి



చుక్కలు కలపండి



సూక్తి

మనిషికి వివేకాన్ని సంపాదించి పెట్టేవి అతనికి తగిలే ఎదురుదెబ్బలే.

చెప్పగలరా?


పదిలో ఉన్నాను కానీ గదిలో లేను
గర్వంలో ఉన్నాను కానీ సర్వంలో లేను
వాలులో ఉన్నాను కానీ వారులో లేను
అయితే నేనెవర్నో చెప్పగలరా?

ఔనా!

- గోల్డెన్ ఈగల్ గంటకు 250 కిలో మీటర్ల వేగాన్ని కూడా అందుకోగలదు.
- ఇది ఆరు వేల అడుగుల ఎత్తు వరకు ఎగరగలదు.



దారి కనుక్కోండి



పదాలు గుర్తించండి

R	B	Z	B	V	S	W	W	H	K	F	C	T	Q	C
R	S	G	U	O	C	A	W	F	M	O	E	S	F	L
Y	H	M	T	N	K	T	V	X	R	O	B	I	N	K
W	O	Y	T	O	Q	G	R	E	E	N	Y	Q	W	Z
O	W	Z	E	C	T	T	O	X	T	L	A	Z	P	A
T	E	Y	R	L	I	K	R	O	E	V	H	M	W	Y
G	R	Z	F	E	P	D	J	Z	A	T	V	O	Y	K
A	S	D	L	A	Q	A	Y	S	P	P	B	A	G	T
R	I	M	Y	N	G	N	W	E	Y	N	L	J	V	B
D	K	W	K	I	S	D	T	S	I	Q	Y	D	L	L
E	P	A	Z	N	M	E	M	A	Y	F	A	I	W	O
N	G	N	V	G	V	L	R	S	B	I	E	S	H	S
U	L	I	O	Y	K	I	K	J	B	I	Y	T	Y	S
Z	Y	N	R	F	L	O	W	E	R	S	C	K	E	O
Y	Q	K	P	I	C	N	I	C	W	O	B	N	U	M

జంతర్‌మంతర్

1. కచిలు ▶ ....
2. రుపుమ ▶ ....
3. పిపులు ▶ ....

జంబ్లింగ్ వర్డ్స్

1. STEA ▶ ....
2. RHUS ▶ ....
3. SLEA ▶ ....

జవాబులు

చెప్పగలరా? : పగలు జంతర్‌మంతర్ : 1. చిలుక 2. మరుపు 3. పిలుపు జంబ్లింగ్ వర్డ్స్ : 1. EAST/SEAT 2. RUSH 3. SALE/ SEAL

పుష్పయాగ వేదికపై పాలకవర్గము, ఉభయకర్తలు



వైభవంగా చెంగాళమ్మకు

పుష్పయాగం

సూళ్లూరుపేట : నవదుర్గాం మహా కాళీం...బ్రహ్మ విష్ణు శివాత్మికాం..త్రికాల జ్ఞాన సంపన్నాం..నమామి భువనేశ్వరీం.... అంటూ ఆవిరులు సైతం అమ్మణ్ణి పాదాలను తాకి ప్రార్థించాయి. మల్లెలు, మరువాలు, ముద్దబంతులు, చామంతులు, కమలములు, కనకాంబరాలు, రోజాలు ఇలా వివిధ పుష్పాలతో వేదపండితులు పెద్దఎత్తున సూళ్లూరుపేట చెంగాళమ్మకు పుష్పయాగం నిర్వహించారు. శ్రావణ శుక్రవారం రాత్రి ఈ యాగం జరిగింది. అమ్మణ్ణి ఉత్సవమూర్తిని వేదికపై ప్రతిష్ఠించి ప్రత్యేకంగా అలంకరిం పచేశారు. ఆలయంలోని మూలవిరాట్‌ను ఈ సందర్భంగా స్వర్ణకవచము, స్వర్ణ కిరీటము, స్వర్ణాభరణాలతో ముస్తాబుచేశారు. ముందుగా ఈ పుష్పయాగం ఉభయకర్తలు నంబూరు మోహన్‌రావు, సులోచనమ్మ, నంబూరు మనోజ్‌సాయి, లతలతోపాటు ఆలయ పాలకవర్గం చైర్మన్ ముప్పాళ్ల వెంకటేశ్వర్లురెడ్డి, విజయలక్ష్మి, కార్యనిర్వాహణాధికారి ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, పాలకవర్గ సభ్యులు పుష్పాలతో అమ్మణ్ణి మూలవిగ్రహం చెంతకుచేరి పూజలుచేసి పుష్పయాగానికి అనుమతి పొందారు. అనంతరం మంగళ వాయిద్యాలతో పుష్పయాగ వేదికకు చేరుకున్నారు. అనంతరం పుష్పయాగం కనుల పండువగా జరిగింది. ఆలయ మాజీ చైర్మన్‌లు బద్దెపూడి వేణుగోపాల్ రెడ్డి, ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి, కాళంగి ప్రభాకర్, మాజీ ఎంపీపీ పిట్ల సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. పాలకవర్గ సభ్యులు అలవల సూరి బాబు, రమేష్, చిట్టేటి పేరుమాల్, యుగంధర్, శ్రీనివాసులురెడ్డి, వేనాటి గోపాల్‌రెడ్డి, పిట్ల సుహాసిని పాల్గొన్నారు.



అమ్మణ్ణిని దర్శనానికి బారులు తీరిన భక్తజనం



పుష్పయాగం కోసం వివిధ పుష్పాలు


నెల్లూరుకు వన్నెతెచ్చిన వెంకయ్య

సామాన్య కార్యకర్త నుంచి ఉప రాష్ట్రపతి వరకు ఎదిగిన ముప్పవరపు వెంకయ్య నాయుడు నెల్లూరు జిల్లాకు వన్నెతెచ్చారని అభినందిస్తూ శుక్రవారం ఉపరాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆయన సూక్ష్మ చిత్రాన్ని రావి ఆకుపై చిత్రించి శుభాకాంక్షలు తెలిపారు ముత్తుకూరు జడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు పండిట్ సోమా పద్మారత్నం. ఉపరాష్ట్రపతి పదవికి మరింత వన్నె తెస్తారని ఆయన ఆకాంక్షించారు.

-ముత్తుకూరు



చిత్రకారుడు సోమా పద్మారత్నం



'కోన'లో నేడు లక్ష తులసీ దళార్చన

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో శ్రీ హేమళంబి నామ సంవత్సర శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం శత సహస్ర (లక్ష) దళార్చన, లక్ష కుంకుమార్చన పూజలకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ తానంకి నానాజీ, ఈవో శనగవరం శ్రీరామమూర్తి తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లును శుక్రవారం పరిశీలించారు. శ్రీవారి ఆలయం ఎదుగా ఉన్న భారీ మండపంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీవారికి అత్యంత ప్రీతికరమైన తులసీ దళములతో, అమ్మవారికి కుంకుమార్చన విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రూ.10వేలు ఇచ్చేదాతలను మహాజరా పోషకులు, రూ.5వేలు ఇచ్చే దాతలను రాజ పోషకులు, వెయ్యి రూపాయలు ఇచ్చే దాతలను పోషకులుగా పరిగణిస్తామని తెలిపారు. సామూహికంగా జరిగే ఈ కార్యక్రమంలో దంపతులు సంప్రదాయ దుస్తులతో హాజరుకావాలన్నారు. భక్తులకు అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు.



కోనలో ముస్తాబైన మండపం



ఆంధ్రా అదుర్స్

● మూడు విభాగాలలో విజయం కైవసం ● ముగిసిన జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు



ఫైనల్లో తలపడుతున్న క్రీడాకారులు

నెల్లూరు (క్యాంపస్) : ఏడో జాతీయ మినీ సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ బాలుర, బాలికల జట్లు విజేతలుగా నిలిచి అదుర్స్ అనిపించాయి. అండర్ -12 బాలబాలికల విభాగాలలో, అండర్- 10 బాలుర విభాగంలో విజయాన్ని కైవసం చేసుకొని తమ సత్తా చాటాయి. అండర్ -10 బాలికల విభాగంలో ఏపీ జట్టు మూడో స్థానాన్ని సాధించింది. స్థానిక విఆర్‌సి మైదానంలో ప్రారంభమైన ఈ పోటీలు శుక్రవారం ముగిశాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఆసక్తికరంగా ఫైనల్ పోటీలు

వీఆర్సీ మైదానంలో ఉదయం 7గంటల నుంచే ఫైనల్ పోటీలు ప్రారంభమయ్యాయి. అండర్-12 బాలురు విభాగంలో ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ జట్లు తలపడ్డాయి. ఆంధ్రప్రదేశ్ జట్టు అత్యుత్తమ ప్రతిభ చూపి ప్రథమ విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానాన్ని రాజస్థాన్ కైవసం చేసుకొంది. మూడు, నాలుగు స్థానాలను తెలంగాణ ఢిల్లీ జట్లు సొంతం చేసుకున్నాయి.

అండర్ - 12 బాలికల విభాగంలో ఫైనల్‌లో ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ జట్లు తలపడగా ఆంధ్రప్రదేశ్ జట్టు తిరుగులేని విజయం సాధించింది. రన్నర్‌గా రాజస్థాన్, మూడు, నాలుగు స్థానాల్లో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర నిలిచాయి. అండర్ - 10 బాలురు విభాగంలో ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ జట్లు తుదిపోరులో నువ్వా, నేనా అన్నట్టుగా పోటీపడ్డాయి. హోరీ హోరీగా సాగిన ఈ పోటీలో ఆంధ్రప్రదేశ్ జట్టు విజయం సొంతం చేసుకోంది. రాజస్థాన్ రన్నర్‌గా మూడు, నాలుగు స్థానాల్లో మధ్యప్రదేశ్, కర్నాటక జట్లు నిలిచాయి. అండర్ - 10 బాలికల విభాగంలో మధ్యప్రదేశ్ , తెలంగాణ జట్ల మధ్య తుదిపోరు జరిగింది. మొదటి రెండు స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్, పంజాబ్ జట్లు మూడు, నాలుగు స్థానాలను సొంతం చేసుకున్నాయి ఫైనల్స్ పోటీలను తిలకించేందుకు అధిక సంఖ్యలో నగరప్రజలు వీఆర్సీ మైదానానికి వచ్చారు. కేకలు వేస్తూ, చప్పట్లు చరుస్తూ క్రీడాకారులను ప్రొత్సాహిం చారు.



యాహూ... ట్రోఫీ సాధించా...

జోరు వర్షంలోనే విజేతలకు బహుమతులు

జోరు వర్షంలో మాజీ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. కప్పులు, మెడల్స్ బహూకరించి అభినందించారు. స్థానిక వీఆర్సీ మైదానంలో జరిగిన ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా క్రీడలకూ, క్రీడాకారులకూ ఎప్పుడూ ప్రోత్సాహం అందిస్తునే ఉంటుందన్నారు. గతంలో జిల్లాలో ఎన్నో జాతీయ స్థాయి పోటీలు జరిగాయన్నారు. జిల్లాకు వచ్చిన ఇతర రాష్ట్ర క్రీడాకారులను ఎంతో సంతోషంగా తిరిగి వారి ప్రాంతాలకు పంపామన్నారు. వారు నెల్లూరు గొప్పతనాన్ని చెబుతుంటారన్నారు. ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు సాఫ్ట్‌బాల్‌లో ఇంతటి ప్రతిభ చూపడం ఆనందంగా ఉందని అంతర్జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చూపాలని కోరారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సీఈవో ప్రవీణ్ అనోకర్ మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలను నెల్లూరు జిల్లాలో ఎంతో గొప్పగా నిర్వహించారని అభినందించారు. ఆంధ్రప్రదేశ్‌లో సాఫ్ట్‌బాల్‌కు ఎక్కువ ఆదరణ ఉందని తెలపడానికి ఈ విజయాలు నిదర్శనమన్నారు. అనంతరం నిర్వాహకులను అభినందించారు. క్రీడాకారులకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సీ వెంకటేశ్వర్లు, పోని ఫెడరేషన్ సింగపూర్ అడ్మినిస్ట్రేటర్ సన్నిసుల్తాన్, పోని ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ రాకేష్ మిస్రా, డీఎస్‌డీవో పీవీ రమణయ్య, కార్పొరేటర్ రంగమయూర్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి రామ్మూర్తి, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లిరెడ్డి కోటారెడ్డి, టోర్నమెంట్ నిర్వాహకులు సీహెచ్ రవికుమార్ పాల్గొన్నారు.



బాలుర జట్టుకు ట్రోఫి అందజేస్తున్న ఆనం రామనారయణ రెడ్డి

విద్యార్థులకు ఎంఆర్ టీకాలు

ఆత్మకూరు: మున్సిపాలిటీ పరిధిలోని పేరారెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం ఎంఆర్ టీకాలను వేసినట్లు మహిమలూరు పీహెచ్‌సీ విస్తరణాధికారి జావీద్ తెలిపారు. టీకాలు వేయించుకుంటే తట్టు, రూబెల్లా వ్యాధులు సోకకుండా ఉంటాయన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. చిన్నారులను ప్రాణాంతక వ్యాధుల బారి నుంచి కాపాడుకునేందుకు తల్లిదండ్రులు తప్పనిసరిగా ఎంఆర్ టీకాలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్‌రెడ్డి, ఎ.శ్రీనివాసులురెడ్డి, ఏఎన్ఎంలు భూదేవి, కె.సామ్రాజ్యం, ఆశావర్కర్లు, అంగన్‌వాడీకార్యకర్తలు పాల్గొన్నారు.

● ఇంటర్వ్యూ



పంచాయతీల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలు

రఫీఖాన్, ఎంపీడీవో

?. మండలంలో ఎన్ని డంపింగ్ యార్డులు మంజూరయ్యాయి.

!. ఒక్కో గ్రామ పంచాయతీలో ఒక్కో డంపింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. స్థల సమస్య కారణంగా ఒకటి తప్ప, అన్ని పంచాయతీల్లో డంపింగ్‌యార్డుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. 8 డంపింగ్‌యార్డులు మంజూరయ్యాయి.

?. ఒక్కో యార్డు నిర్మాణానికి ఎన్ని నిధులు మంజూరయ్యాయి.

!. గ్రామ జనాభాను బట్టి ఒక్కో డంపింగ్ యార్డ్ నిర్మాణానికి ఉపాధి హామీ పథకంలో రూ. 3 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు మంజూరవుతుంది. మక్తాపురం డంపింగ్‌యార్డ్‌కు రూ. 3.5 లక్షలు నిధులు మంజూరయ్యాయి. సంగం డంపింగ్ యార్డ్‌కు రూ. 10 లక్షలు మంజూరయ్యాయి.

?. డంపింగ్ యార్డ్‌తోఉపయోగం ఏమిటి.

!. గ్రామాల్లోని చెత్తను సేకరించి, దాని ద్వారా సంపద సృష్టించేందుకుప్రణాళికలు తయారు చేశారు. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడడంతోపాటు కొందరికి జీవనోపాధి కలుగుతుంది. పంచాయతీకి ఆదాయం చేకూరుతుంది.

? మండలంలో ఆత్మగౌరవం పథకం పూర్తయిందా

!. ఆత్మగౌరవం పథకంలో మండలంలోని 20 పంచాయతీల్లో 6,230 మరుగుదొడ్లు మంజూరుకాగా ఇప్పటి వరకు 5205 మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయింది. 1025 వివిధ దశలల్లో ఉన్నాయి. 15వ తేదికల్లా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.

- సంగం

పాఠశాల ప్రాంగణం ఎత్తు పెంచండి

అనంతసాగరం: మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల ప్రాంగణం చిన్నపాటి వర్షానికే బురదమయం అవుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. రోడ్డు కన్నా పాఠశాల ప్రాంగణం ఎత్తు తక్కువగా ఉండడంతో చిన్నపాటి వర్షం పడినా పాఠశాలలో వర్షపునీరు చేరి విద్యార్థులకు అసౌకర్యంగా ఉందని ఆరోపిస్తున్నారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారానైనా గ్రావెల్ తోలించి పాఠశాల ప్రాంగణం ఎత్తు పెంచేలా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ..అంకెల గారడీ!

● కేంద్రాల్లో నలుగురైదుగురే.. ● రిజిస్టర్లలో 100 శాతం హాజరు ● ఇష్టానుసారంగా రికార్డుల నిర్వహణ




జీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో హాజరైన చిన్నారులు

ఏఎస్‌పేట: అంగన్‌వాడీ కేంద్రాలు అంకెల గారడీతో నడుస్తున్నాయి. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఐదేళ్లలోపు పిల్లలను పాఠశాలలకు అలవాటు చేసేందుకు ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిని కార్పొరేట్‌స్థాయికి తీసుకెళ్తామని పాలకులు చెబుతున్న మాటలు నీటిమూటలుగా మిగులుతున్నాయి. కార్పొరేట్ స్థాయి అటుంచితే అసలుకే ముప్పు ఏర్పడిందనే విమర్శలు వినవస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రికార్డుల్లో ఇష్టానుసారంగా లెక్కలు నమోదవుతున్నాయి. పిల్లలు 100 శాతం హాజరవుతున్నట్టు రికార్డుల్లో నమోదుచేస్తున్నారు. కేంద్రాలకు 30, 40 శాతమే హాజరవుతున్నారు. పౌష్టికాహారం అందించండంలోనూ ఇలాంటి కాకిలెక్కలు చూపుతున్నారు. ఏఎస్‌పేట మండలం కావలియడవల్లి గ్రామంలోని జీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తే ఇలాంటి ఆరోపణలు నిజమేననిపిస్తున్నాయి.

ఏఎస్‌పేట మండలం కావలియడవల్లి గ్రామ జీసీకాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆంధ్రజ్యోతి పరిశీలించింది. ఆ సమయంలో అంగన్‌వాడీ కార్యకర్త విధుల్లో లేరు. కేవలం నలుగురు చిన్నారులు, ఆయమ్మ మాత్రమే కనిపించారు. ఒక చిన్నారి తనకు పెట్టిన భోజనంలో సగం కింద, మరో సగం ప్లేట్‌లో ఉంచుకొని బిక్కుబిక్కుమంటూ తింటూ కన్పించింది. ఉన్న నలుగురిని సైతం సక్రమంగా పట్టించుకోకుండా వదిలేశారు. అంగన్‌వాడీ కార్యకర్త ఎక్కడ అని ఆయమ్మను అడిగితే సెలవులో ఉన్నారని తెలిపింది. అక్కడ రికార్డులోని అంశాలను తెలుసుకోగా ఆశ్చర్యకరమైన విషయాలు తెలిశాయి.

ఇష్టానుసారంగా రికార్డులు నమోదు

ప్రతి రోజూ 100 శాతం విద్యార్థులు వస్తున్నట్లు హాజరుపట్టికలో నమోదు చేసి ఉన్నారు. వాస్తవానికి అందుకు భిన్నంగా రోజూ ముగ్గురు, నలుగురు చిన్నారులే వస్తారని స్థానికులు తెలిపారు. బాలింతలకు ప్రతి రోజూ పౌష్టికాహారం అందించే రికార్డును పరిశీలించగా ఈ నెల 8వ తేదీ వరకే పంపిణీ చేసినట్టు ఉంది. దీనిని బట్టి కార్యకర్తలు ఎంత నిజాయతీగా రికార్డులను నిర్వహిస్తున్నారో అర్థమవుతోంది. 6 నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులకు అందించే పౌష్టికాహార రికార్డును పరిశీలిస్తే ఏకంగా ఆగస్టు 30వ తేదీ వరకూ అందించినట్లు నమోదు చేసి ఉన్నారు. ఇది ఒక్క జీసీకాలనీ అంగన్‌వాడీకేంద్రం పరిస్థితే కాదు. గ్రామాల్లోని చాలా అంగన్‌వాడీకేంద్రాల్లో ఇలాగే రికార్డులు నమోదవుతున్నాయని స్థానికుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. అంగన్‌వాడీకేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వారు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమావతిని వివరణ కోరగా రికార్డులు అవకతవకలు జరిగినట్లు తమ దృష్టికి రాలేదని, తాను పరిశీలిస్తాననీ, అలా జరిగి ఉంటే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఆగస్టు 30వ తేదీ వరకు పౌష్టికాహారం అందించినట్లు నమోదు చేసిన రిజిస్టరు

కలెక్టర్ ఆదేశాలతో కదిలిన అధికారులు

వసతి గృహాలను పరిశీలించిన సాంఘిక సంక్షేమ శాఖ డీడీ

చేజర్ల: చేజర్ల తహసీల్దారు కార్యాలయానికి గురువారం జిల్లా కలెక్టర్ తనిఖీ సందర్భంగా స్థానికులు బీసీ సంక్షేమ శాఖ వసతి గృహంపై ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఉన్న వసతిగృహంలో చాలీచాలని వసతులతో విద్యార్థులుఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని బీసీ, ఎస్సీ సాంఘీక సంక్షేమ వసతి గృహాలను డీడీ మధుసూదన్‌రావు పరిశీలించారు. ప్రస్తుతం ఎస్సీ వసతి గృహంలో విద్యార్థులు తక్కువగా ఉండడంతో పాటు, గదులు ఖాళీగా ఉండడంతో, బీసీ వసతిగృహంలోని విద్యార్థులందరినీ అక్కడికి మార్చేలా చర్యలు తీసుకోవాలని స్థానిక హాస్టల్ సంక్షేమ అధికారులను ఆదేశించారు.



వసతిగృహాన్ని పరిశీలిస్తున్న డీడీ మధుసూదన్‌రావు

ప్రస్తుతం నాలుగైదు రోజులు సెలవులుండడంతో, పాఠశాల తెరిచేలోగా అక్కడికి మారేలా చర్యలు తీసుకోవాలన్నారు.

చినుకుపడితే.. చిక్కులే!

● వీధుల్లో నిలిచిన నీరు

ఆత్మకూరు: మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో నాలుగు చినుకులు పడితే రోడ్డుపై వర్షపునీరు నిలచిపోయి బురదయమవుతోంది. దాంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. డ్రైనేజీ పనులు నత్తనడకన సాగుతుండడంతో మురుగునీరు ముందుకు సాగక, వర్షం పడినపుడు రోడ్డుపైకి చేరుతోంది. ఆత్మకూరు పట్టణంలోని జేఆర్‌పేట, టెక్కె, తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉంది. గురువారం ఉదయం కురిసిన వర్షానికి ఆయా ప్రాంతాల్లోని రోడ్లపై వర్షపునీరు నిలచిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. జేఆర్‌పేట నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చే ప్రాంతంలో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. రూ.38 కోట్లతో



4వ వార్డులో నిలచిన వర్షపునీరు

జరుగుతున్న డ్రైనేజి పనులు అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగునీరు ముందుకు సాగడం లేదు. అధికారులు స్పందించి వర్షపునీరు నిల్వ ఉండే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



సీఆర్‌పీలతో మాట్లాడుతున్న ఏఎమ్‌ఓ హమీద్

ఏఎంవో కేజీబీవీ సందర్శన

మర్రిపాడు: మర్రిపాడులోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం ఎస్ఎస్ఏ ఏఎమ్‌వో హమీద్ సందర్శించారు. రికార్డులను పరిశీలించి ఎంఈవో కార్యాలయంలో సీఆర్‌పీలతో సమావేశమయ్యారు. ఎప్పటికప్పుడు విధులు సక్రమంగా నిర్వహించి పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ, ఎంఆర్‌జీ రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

అనంతసాగరం: బొమ్మవరం పంచాయతీ వడ్డిపాళెం గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండరాముని ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమాలు అనంతరం కోదండరాముని కల్యాణం చేశారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. వడ్డిపాళెం, పరిసర గ్రామాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

కారు బోల్తా- ఐదుగురికి గాయాలు

మర్రిపాడు: బూదవాడ సమీపంలోని దోర్నాల జాతీయ రహదారిపై శుక్రవారం కారు బోల్తా పడి ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రకాశం జిల్లా పొదిలికి చెందిన మన్నెం నర్సింహులు, నాగమణి, నరసింహరావు, పూజిత, దినేష్‌కుమార్‌లు బెంగుళూరు నుంచి కారులో స్వగ్రామానికి వెళ్తుండగా, గేదెలు అడ్డం రావడంతో అదుపుతప్పి బోల్తా పడింది. వెంటనే 108కు సమాచారం అందించండంతో క్షతగాత్రులను ఉదయగిరి వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అబ్దుల్‌రజాక్ తెలిపారు.

ట్రస్ట్ చైర్మన్ మృతికి సంతాపం

మర్రిపాడు: మర్రిపాడు మండలంలోని కదిరినాయుడుపల్లికి చెందిన సుజాతమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శేషారెడ్డి రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. శుక్రవారం ఆయన స్వగ్రామంలోని ఉన్నత పాఠశాలలో సంతాప సభను ఏర్పాటు చేసి ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. పాఠశాలల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు,ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న లారీ



ఢీకొన్న లారీలు

సంగం: రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు కృష్ణపట్నం నుండి బొగ్గుతో లోడుతో వెళ్తున్న లారీ వెంగారెడ్డిపాళెం సమీపంలో నిలిపి ఉండగా వెనుకవైపు నుండి వస్తున్న మరో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఢీకొట్టిన లారీ క్యాబిన్ నుజ్జయింది. దీంతో క్లీనర్ సుబ్బారావు కాలికి తీవ్రగాయమైయింది. బాధితున్ని 108 వాహనలో స్థానిక వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

ఆత్మకూరు: శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయం, కన్యకా పరమేశ్వరి, వెంకటేశ్వరస్వామి, అలఘునాథ స్వామి ఆలయాలు, కాశీనాయన ఆశ్రమంలో నిర్వహించిన పూజల్లో మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



డీసీసీబీ ద్వారా వంద రైతు రథాలు

● డీసీసీబీ చైర్మన్ ధనుంజయరెడ్డి

సంగం: వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లోని రైతులకు డీసీసీబీ ద్వారా వంద రైతు రథాలు అందజేయనున్నట్లు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి తెలిపారు. శుక్రవారం దువ్వూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో నిర్వహించిన మహాజన సభలో ఆయన మాట్లాడారు రైతుల శ్రేయస్సే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రైతుల కోసం ప్రభుత్వం రైతు రథాల పేరుతో భారీ రాయితీతో ట్రాక్టర్లు అందజేస్తోందన్నారు. డీసీసీబీకి వంద రైతు రథాలు ఇస్తామని వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. సొసైటీల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నారని తెలిపారు. 80 శాతం రాయితీతో రైతులకు పాడి పశువులను అందజేస్తున్నట్లు తెలిపారు. జాతీయ బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకి రైతులకు రుణాలు అందజేస్తున్నామన్నారు. దువ్వూరు సహకార సంఘం లాభాల బాటలో పయనిస్తోందన్నారు. దువ్వూరు రైతుల కోరిక మేరకు సొసైటీ భవనంపై కల్యాణ మండపం నిర్మాణానికి రూ. 15 లక్షలు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమయలో పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి పలువురు డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మహాజన సభలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి

రైతులకు అవగాహన సదస్సు



ఖాతాదారులతో మాట్లాడుతున్న చేజర్ల ఎస్‌బీఐ అధికారులు

చేజర్ల: తూర్పుకంభంపాడు గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేజర్ల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ం బ్యాంక్ మేనేజర్ సీహెచ్ఎల్ రమణమూర్తి రైతులు, ఖాతాదారులతో మాట్లాడుతూ రైతులకు అతితక్కువ శాతం వడ్డీతో రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. సంవత్సరం లోపు రుణాలు చెల్లించిన వారికి నికరంగా 33 శాతం మాత్రమే వడ్డీ ఉంటుందని వివరించారు. ఆన్‌లైన్ బ్యాంకింగ్, నగదు బదిలీ విధాలనాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ బ్యాంకింగ్‌లో మోసాలు అధికమవుతుండడంతో ఏటీఎం పిన్ నెంబర్ జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు శ్రీనివాసులునాయుడు, రమేష్‌నాయుడు, బ్యాంక్ మేనేజర్ శ్రీరాములు, సిబ్బంది ఓబులకొండయ్య, గ్రామస్థులు, రైతులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

రామాలయంలో మనగుడి



పూజలు చేయిస్తున్న గీతాజ్ఞాన పరిషత్ సభ్యులు

సంగం: ఆర్యవైశ్య బజార్ సెంటర్‌లోని రామాలయంలో గీతాజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం మనగుడి కార్యక్రమం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి అందిన వేంకటేశ్వరస్వామి కంకణాలను ఆలయంలో ఉంచి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో వేదపండితుడు కేసరికుమారిస్వామి గోపూజ నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. గీతాజ్ఞాన పరిషత్ నిర్వాహకులు సాంబయ్య, మెంటా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సంగంలో వైద్య శిబిరం



శిబిరానికి హాజరైనవారిని పరీక్షిస్తున్న అపోలో వైద్యులు

సంగం: మండల కేంద్రమైన సంగంలో అపోలో వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. సంగమేశ్వరాలయ ప్రాంగణంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి హాజరైనవారిని అపోలో వైద్యశాలకు చెందిన డాక్టర్లు పరీక్షించి, మందులు పంపిణీ చేశారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు

ఆత్మకూరు: భారత ఉప రాష్ట్రపతిగా ముప్పవరపు వెంకయ్యనాయుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టడంతో బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. ఆయనను కలిసేందుకు ఆత్మకూరు నియోజకవర్గం నుంచి పలువురు నేతలు ఢిల్లీ తరలివెళ్లారు. ఉప రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం కలిసి అభినందనలు తెలిపారు. బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, టొబాకో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ చెరుకూరు రమణయ్యనాయుడు, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కాలం బుజ్జిరెడ్డి, చెర్లో శ్రీనివాసులురెడ్డి, తలచీరు ప్రసాద్‌బాబు ఢిల్లీకి వెళ్లిన వారిలో ఉన్నారు.

అనంతసాగరం: భారత ఉపరాష్ట్రపతిగా ముప్పవరపు వెంకయ్యనాయుడు శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టడంతో అనంతసాగరం బీజేపీ కార్యాలయం వద్ద బీజేపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచిపెట్టి వెంకయ్యనాయుడు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు అల్లంపాటి రమణారెడ్డి, మండల బీజేపీ నాయకులు బట్రెడ్డి జనార్ధన్‌రెడ్డి, కొమ్మి తిరుపతినాయుడు, అనంతసాగరం మత్స్యసొసైటీ ప్రెసిడెంట్ మౌలా, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



అనంతసాగరం బీజేపీ కార్యాలయం వద్ద మిఠాయిలు పంచుతున్న నేతలు

గాడితప్పుతున్న గ్రామీణ విద్య

ఏఎస్‌పేట: గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలకు ఉపాధ్యాయులు సక్రమంగా హాజరుకాకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఏఎస్‌పేట మండలంలోని కావలియడవల్లి గ్రామ జీసీ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ముగ్గురు ఉపాధ్యాయులకు గాను ఒక్కరే కనిపించారు. పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్లు నాలుగు రోజులుగా మెడికల్ లీవ్‌లో ఉన్నారని, ఉపాధ్యాయురాలు ప్రమీల సీఎల్ పెడుతున్నట్లు ఫోన్ ద్వారా మెసేజ్ పంపిందని, ఉపాధ్యాయుడు రమేష్ తెలిపారు. 1 నుంచి 5 వ తరగతి వరకు సుమారు 45 మంది విద్యార్థులుండడంతో, హాజరైన ఒక్క ఉపాధ్యాయుడు వీరందరికీ చదువు చెప్పాల్సి వస్తోంది. ఆయన ఒక తరగతికి వెళ్లినపుడు, మిగిలిన తరగతుల విద్యార్థులు ఆడుకుంటున్నారు. గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఇద్దరు, ముగ్గురిని నియమించినా, ఒక్కరు మాత్రమే విధులకు హాజరవుతారని, ఉపాధ్యాయులందరూ పాఠశాలకు రావడం అరుదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులు సక్రమంగా హాజరుకాకపోవడంతో విద్యార్థులు చదువుల్లో వెనుకబడిపోతున్నారని, వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందని చెబుతున్నారు. దీంతో స్థోమత లేకపోయినా వేల రూపాయల ఫీజులు చెల్లించి ప్రైవేట్ పాఠశాలలకు పంపించడానికే తల్లిదండ్రులు మొగ్గుచూపుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఉపాధ్యాయులు లేకపోవడంతో తరగతి గదిలో ఆడుకుంటున్న విద్యార్థులు

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్ఎం, విద్యార్థులు

ఆత్మకూరు: ఏసీఎస్ఆర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు పి.పెంచలయ్య, గంగాధరం, మంజువాణి బదిలీపై వెళుతుండడంతో శుక్రవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు వారిని సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు రెహ్మాన్ మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా పాఠశాల అభివృద్ధికి చేసిన సేవలను, ఆదర్శ పాఠశాలగా మార్చడంలో కృషిని ప్రశంసించారు. ఉపాధ్యాయులు ఎ.సురేంద్రరెడ్డి, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వెన్నవాడలో శీతల యంత్ర ప్రతిష్ఠ

ఆత్మకూరు: మండలంలోని వెన్నవాడ గ్రామంలో శుక్రవారం బ్రహ్మశ్రీ కనుమళ్ల సత్యనారాయణశర్మ నేతృత్వంలో శీతల యంత్ర ప్రతిష్ఠ (బొడ్డురాయి) చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, చండీ యాగం నిర్వహించారు. మరో రెండు రోజుల పాటు గ్రామంలో ప్రత్యేక పూజలు కొనసాగుతాయని గ్రామపెద్దలు తెలిపారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

డక్కిలి: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వెంబులూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు దూడల పెంచలయ్య పేర్కొన్నారు. విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, పరుగుపందెం వంటి ఆటలు నిర్వహించామన్నారు. విజేతలకు స్వాతంత్ర దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామన్నారు.

ఎర్రచందనం అరుదైన సంపద

రాపూరు: ఎర్రచందనం అరుదైన సంపద అని, దానిని కాపాడుకోవడం అందరి బాధ్యతని టాస్క్‌ఫోర్సు డీఆర్వో రామకృష్ణ తెలిపారు. ఏపూరు గ్రామంలో ఎర్రచందనంపై రోడ్‌షో, లేజర్ షో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, పాపారావు, రమేష్, హరి, బాలాజీ, సాయి, రాంబాబు, కరిముల్లా పాల్గొన్నారు.

ఎమ్మార్ వ్యాక్సిన్ తప్పని సరి

రాపూరు: తొమ్మిది నెలల నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలందరూ తప్పని సరిగా ఎమ్మార్ వ్యాక్సిన్ వేయించుకోవాలని వైద్యులు సునీల్ బాబు, నర్మదాదేవి కోరారు. వేపినాపి ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం వ్యాక్సిన్ వేశారు. ఈ వ్యాక్సిన్ వేయించుకుంటే తట్టు, రూబెల్లా దరిచేరవన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గూడూరు(రూరల్): మండలంలోని 132 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో రెండో శనివారం సందర్భంగా మరమ్మతులు చేపడుతున్నామని, ఈ కారణంగా ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆ శాఖ డీఈ అనిల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో గూడూరు పట్టణం, మండలం, చిల్లకూరు, సైదాపురం, రాపూరు, మనుబోలు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. దీనికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సమస్యలు పరిష్కరించండి సారూ..

● ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు వినతి

గూడూరు: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు ఆయన నివాసం వద్ద ప్రజలు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఇళ్ల నిర్మాణాలు, పింఛన్లు అందజేయాలని కోరారన్నారు. ఇప్పటికే పట్టణంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా గృహాలు, పింఛన్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే వారికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు పేదలకు ఎన్నో పథకాలను అందజేస్తున్నారన్నారు. సీఎం సహాయ నిధి ద్వారా పేదల వైద్య ఖర్చులకు నిధులు అందజేస్తున్నారన్నారు. చంద్రన్న బీమా పథకం ద్వారా ప్రమాదవశాత్తు మృతి చెందిన వారికి రూ. 5 లక్షలు, సాధారణంగా మృతి చెందిన వారికి రూ. 30 వేలు అందజేస్తున్నారన్నారు. వీరికి మరింత అండగా నిలిచేందుకు ఈ నెల 15 వతేదీ నుంచి సాధారణంగా మృతి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

చెందిన వారి కుటుంబసభ్యులకు అందజేసే రూ.30 వేల బీమాను రూ.2 లక్షలు అందజేయనున్నారన్నారు. పేద ప్రజలు సీఎంకు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో వాటంబేడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ వితరణ



పాఠశాలకు టీవీ అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

గూడూరు(రూరల్): నెల్లటూరు ఉన్నత పాఠశాలకు పూర్వపు విద్యార్థి, డీకే ఫౌండేషన్ నిర్వాహకుడు చంద్రహాస ఆధ్వర్యంలో శుక్రవారం ఏల్‌ఈడీ టీవీని వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా లయన్ క్లబ్ అధ్యక్షుడు నెలబల్లి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పాఠశాల అభివృద్ధికి సీఆర్ రావు ఎంతో దోహదపడ్డారన్నారు. అదేవిధంగా చంద్రహాస తల్లిదండ్రులు ఈ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తూ పాఠశాల అభివృద్ధికి దోహదపడ్డారన్నారు. వీరి అడుగుజాడలలో చంద్రహాస కూడా పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, మయూరి శ్యామ్‌సుందర్, వీ శ్రీనివాసులు, రమేష్, ప్రియాంక కీర్తి, సురేష్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు పాస్‌లు పంపిణీ

వాకాడు: వాకాడు ముస్లిం కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 35 మందికి శుక్రవారం సర్పంచు దువ్వూరు భార్గవ్‌రామ్ సొంత నిధులు వెచ్చించి బస్సు పాస్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జాలాది కిషోర్, ఆర్టీసీ సిబ్బంది జార్జి, భాస్కర్ పాల్గొన్నారు.



బస్సు పాసులు అందజేస్తున్న భార్గవ్‌రామ్



కోట బజారు సెంటర్‌లో చెత్త

- పల్లెల్లో వెదజల్లుతున్న దుర్గంధం
- అడుగడుగున చెత్త కుప్పల దర్శనం
- డ్రైనేజీ కాలువల్లో కదలని మురుగు
- రేయింబవళ్లు విజృంభిస్తున్న దోమలు
- వ్యాధుల భయంతో గ్రామీణ ప్రజలు
- ఎన్‌ఆర్‌హెచ్ నిధులు దుర్వినియోగం

పడకేసిన పారిశుద్ధ్యం

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయింది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో దుర్గంధం వెదజల్లుతుండటంతో ప్రజల ముక్కుపుటాలు అదురుతున్నాయి. ఎక్కడికక్కడ దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారి రేయింబవళ్లు ప్రజలపై దాడి చేస్తున్నాయి. ఈ క్రమంలో ఎక్కడ రోగాలు సంభవిస్తాయోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్యం మెరుగుకు మంజూరయ్యే ఎన్‌హెచ్‌ఆర్ నిధులు సక్రమంగా ఖర్చు చేయకపోగా దుర్వినియోగం అయ్యాయని తెలుస్తోంది. వర్షాకాలం సమీపిస్తుండటంతో అడుగడుగున పేరుకుపోయిన చెత్తతో ఎక్కడ సీజనల్ వ్యాధులు ప్రబలుతాయోనన్న భయం ప్రజలను వెంటాడుతోంది.

- కోట

కోట మండలంలో 21 పంచాయతీలు ఉన్నాయి. ప్రతి గ్రామంలో పారిశుధ్యం మెరుగుకు 2017-18 ఆర్థిక సంవత్సరానికి ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో పంచాయతీకి రూ.10 వేల చొప్పున ఎన్‌ఆర్‌హెచ్ నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో పంచాయతీ అధికారులు, ఆరోగ్య సిబ్బంది పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి వీధుల్లో చెత్త నిల్వలు లేకువడా చూడాల్సి ఉంది. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరిచి దుర్గంధం వెదజల్లకుండా మురుగు కాలువల వద్ద, వీధుల్లో బ్లీచింగ్ చల్లాల్సి ఉంది. అవసరాన్ని బట్టి రసాయనిక మందులు చల్లాలి. ప్రతి ఏడాది జనవరిలో మంజూరు కావాల్సి ఉండగా ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో ప్రభుత్వం విడుదల చేసింది. కొన్ని పంచాయతీల్లో ఈ నిధులను ఆగమేఘాలపై డ్రా చేసిన సిబ్బంది పారిశుధ్య పనులకు ఖర్చు చేయకనే దుర్వినియోగం చేసినట్లు తెలుస్తోంది.



కాలువలో పేరుకుపోయిన చెత్త

● పంచాయతీ కార్యదర్శి, ఏఎన్‌ఎం బ్యాంకు జాయింట్ ఖాతాలో జమయ్యే ఎన్‌ఆర్‌హెచ్ నిధులను వారిద్దరి సంతకంతో డ్రా చేయాలి. ఆ నిధులను వారిద్దరి పర్యవేక్షణలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి. ఇలా ఇద్దరూ కలసి నిధులు డ్రా చేసినప్పటికీ ఇప్పటి వరకు కొన్ని పంచాయతీల్లో పారిశుధ్య పనులకు పైసా ఖర్చు చేసిన దాఖలాలు లేవు. కొన్ని పంచాయతీల్లో మొక్కుబడిగా పనులు చేపట్టి మమా అనిపించారన్న ఆరోపణలున్నాయి. ఈ నిధులపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేని కారణంగా దుర్వినియోగం అవుతున్నాయని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


● కోట మేజర్ పంచాయతీలో పలు చోట్ల చెత్తాచెదారం నిల్వచేరి దుర్గంధ భరితంగా మారింది. ప్రధానంగా బజారు సెంటర్, రవినగర్, ఎన్‌సీఆర్ నగర్, శ్యామసుందరపురం, శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీలో మురుగు కాలువల్లో బ్లీచింగ్ చల్లని కారణంగా దుర్గంధం వెదజల్లుతుందని స్థానికులు వాపోతున్నారు. విద్యానగర్, ప్రకాశం కాలనీలో ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోయిన కారణంగా స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

● మండలంలోని మేజర్ పంచాయతీలైన కోట, గూడలి, కేశవరం, నెల్లూరుపల్లి, సిద్ధవరం, కొత్తపట్నం, పంచాయతీలకు కేవలం చాలీచాలని పారిశుధ్య నిధులు రావడంతో అక్కడి పాలకులు ఇబ్బందులు పడుతున్నారు. మైనర పంచాయతీలకు ఇచ్చిన విధంగానే మేజర్ పంచాయతీలకు రూ.10 వేలు ఇవ్వడంపై అటు స్థానికులు, ఇటు పంచాయతీ పాలకులు అభ్యంతరాలు తెలుపుతున్నారు. అంతేకాకుండా ఆయా పంచాయతీలో ఎక్కడపడితే అక్కడ మురుగు, చెత్తాచెదారం నిల్వచేరి ఉండటం వల్ల ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో ఎక్కడ అంటు వ్యాధులు ప్రబలుతాయోనని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అదేవిధంగా రాజీవ్ ఆరోగ్య మిషన్ ద్వారా మంజూరయ్యే నిధులు కూడా ఈ ఆర్థిక సంవత్సరానికి విడుదల కాకపోవడం వల్ల ఆయా పంచాయతీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరకొరగా మంజూరైన నిధులు సక్రమంగా వినియోగించకపోవడం పట్ల మండల ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ నిధులపై పర్యవేక్షణ చేసి పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



విద్యానగర్‌లో పేరుకుపోయిన మురుగు

పారిశుధ్యం అస్తవ్యస్తం



విద్యానగర్ ప్రకాశం కాలనీలో ఎక్కడ పడితే అక్కడ చెత్త ఉంది. దీంతో సీజనల్ వ్యాధులు వస్తాయన్న భయం ఉంది. చెత్త నుంచి వచ్చే దుర్గంధం భరించలేకున్నాం. వర్షాకాలం మొదలవడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. తక్షణ చర్యలు చేపట్టాలి.

- వెంకటరమణయ్య, విద్యానగర్

ఎన్‌ఆర్‌హెచ్ నిధులు ఇచ్చేశాం



మండలంలో 21 పంచాయతీలకు పారిశుధ్య నిధులు (ఎన్‌ఆర్‌హెచ్) రూ. 2.10 లక్షలు పంచాయతీ కార్యదర్శి, ఏఎన్‌ఎంల బ్యాంకు ఖాతాలో వేశాం. కొన్ని పంచాయతీల్లో ఆ నిధులు డ్రా చేశారు. ఇకపై పనుల పర్యవేక్షణకు శ్రీకారం చుడుతాం.

- డాక్టర్ ప్రసన్నకుమార్, వైద్యాధికారి, వల్లిపేడు పీహెచ్‌సీ

పర్యవేక్షణ చేస్తాం

పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగు పర్చేందుకు ప్రభుత్వం పారిశుధ్య నిధులు మంజూరు చేస్తుంది. ఈ నిధులను పంచాయతీ కార్యదర్శి, ఏఎన్‌ఎంల జాయింట్‌లో వేస్తాం. ఆ నిధులు వారిద్దరూ సంతకం చేసి డ్రా చేసి అవసరమైన మేరకు ఖర్చు చేయాలి. ఇకమీదట ఆ నిధుల వినియోగంపై పర్యవేక్షణ చేస్తాం. కొన్ని పంచాయతీల్లో ఈ నిధులను వినియోగించారు. కొన్ని పంచాయతీల్లో ఇప్పుడిప్పుడే పనులు చేపట్టి నిధులు ఖర్చు చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ పారిశుధ్య పనులపై పర్యవేక్షణ చేపడతాం.

- డాక్టర్ ఇందీవర, వైద్యాధికారి, చిట్టేడు పీహెచ్‌సీ

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

వాకాడు: తిరుమూరు ప్రాథమిక పాఠశాలకు శుక్రవారం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు శుక్రవారం కంప్యూటర్ బహూకరించారు. ఈ మేరకు హెచ్ఎం సుబ్రహ్మణ్యం, యువత అధ్యక్షుడు కుంచం దయాకర్‌కు కంప్యూటర్‌తో పాటు విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు.



హెచ్ఎంకు కంప్యూటర్ అందజేస్తున్న విద్యార్థులు

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రత పూజలు

గూడూరు: శ్రావణ మాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని పట్టణంలో అమ్మవార్ల ఆలయాల్లో శుక్రవారం సామూహిక వ్రత పూజలు నిర్వహించారు. నారాయణమ్మ పేరంటాళ్ల ఆలయంలో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, విశేష పూజలు, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి, గంగమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్థానిక సాయి సత్సంగ నిలయంలో నిర్వాహకులు కోట సునీల్‌కుమార్, కోట ప్రకాశం ఆధ్వర్యంలో విజయదుర్గాదేవికి ఉదయం అభిషేకం, అష్టోత్తర పూజ, సామూహిక వ్రత పూజలు వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా ముత్తైదువులకు పసుపు కుంకుమలు అందజేసి ఆశీర్వాదాలు పొందారు.



గూడూరు వాసవీకన్యకపరమేశ్వరి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

చిల్లకూరు: తూర్పుకనుపూరు ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకాలంకారంలో ఉంచి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక అలంకరణలో ఉంచి వైభవంగా పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఎంఎస్ఎఫ్ నాయకుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఎస్ఎఫ్ నాయకులు

గూడూరు(టౌన్): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు శుక్రవారం పట్టణంలో ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు మణి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేపట్టి చట్టభద్రత కల్పించాలన్నారు. ఎస్సీ వర్గీకరణే ధ్యేయంగా తాము ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా విద్యాసంస్థల బంద్ నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, పవన్, శ్రీనాథ్, నాని, చిన్నా పాల్గొన్నారు.

మెహందీ ఒక ప్రత్యేక ఆకర్షణ

గూడూరు: ప్రస్తుతం పెళ్లి వేడుకలలో మెహందీ ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని మహిళా న్యాయవాది చక్రాల శార్వాణి అన్నారు. శుక్రవారం స్థానిక సునీతా సేవా సంస్థ కార్యాలయంలో సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు మెహందీ అలంకరణపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుపుతున్నమెహందీలో శిక్షణ పొందిన మహిళలు తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నీతి కథల పోటీలు

వాకాడు: వడ్డిపాళెం ప్రాథమిక పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం విద్యార్థులకు నీతి కథలపై రాత పరీక్ష నిర్వహించారు. హెచ్ఎం ఆత్మకూరు భారతి ఆధ్వర్యంలో విద్యార్థులు బొమ్మలు గీసి నీతి కథల సారాంశాన్ని వివరిస్తూ ప్రదర్శనకు ఉంచారు. వాటిలో కొన్నింటిని ఉత్తమమైనవిగా ఎంపిక చేశారు. విజేతలకు స్వాతంత్ర దినోత్సవం రోజు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

పనిదినాలు పెంచేందుకు చర్యలు

చిల్లకూరు: ఉపాధి కూలీలకు పనిదినాలు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఏపీవో గిరిబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని నల్లయ్యగారిపాళెం గ్రామంలో చేస్తున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిదినాలు పెంచేదుకు గతంలో చిన్న చిన్న పంట సంజీవని గుంటల పని చేసేవారన్నారు. ఈ గుంటలు వారం రెండు వారాలలోపు పూర్తి చేసేవారన్నారు. ప్రస్తుతం పెద్ద గుంటల పనులు చేపడుతున్నామన్నారు. ఈ గుంటల పనులు నెల రోజులపాటు ఉంటాయన్నారు.

ఒక్క టీకాతో రెండు వ్యాధులు దూరం

గూడూరు(టౌన్): ఒక్క ఎమ్మార్ టీకాతో ప్రమాదకరమైన తట్టు, రూబెల్లా వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చునని డాక్టర్ రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో బాలికలకు ఎమ్మార్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా ఈ టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ప్రజలు, చిన్నారులు ఈ టీకా పట్ల అవగాహన పెంచుకుని టీకాలు వేయించుకోవాలన్నారు. నూరుశాతం టీకాలు వేసేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పార్వతి, సుదర్శనకుమారి, రాజేశ్వరి, లావణ్య, సుబ్బరావమ్మ, గాయత్రి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



గూడూరు(టౌన్): మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

వాకాడు: స్థానిక సెయింట్ పాల్స్ పాఠశాలలో విద్యార్థులకు ఎమ్మార్ టీకాలు వేశారు. ఈ టీకాల కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ ఉమా మహేశ్వరి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సుమంత్‌రెడ్డి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోట: ఎమ్మార్ వ్యాక్సిన్ వేసుకోవడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని చిట్టేడు ప్రభుత్వ వైద్యాధికారిణి డాక్టర్ ఇందీవర అన్నారు. మండలంలోని విద్యానగర్ బాలభారతి, వివేకానంద, శ్రీనివాస, విద్యావికాస్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఎమ్మార్ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బందితో పాటు పాఠశాలల కరస్పాండెంట్లు కర్ర శ్రీనివాసమూర్తి, నీలం సురేంద్రరెడ్డి, రమేష్‌బాబు, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి అక్రమ తరలింపును అడ్డుకోండి

కోట : గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నప్పటికీ ఓ వ్యక్తి తన స్వార్థ ప్రయోజనాల కోసం నీటిని అక్రమంగా తరలిస్తూ వ్యాపారం చేసుకుంటున్నాడని, అతనిపై చర్యలు తీసుకొని నీటి తరలింపును అడ్డుకోవాలని కోరుతూ మద్దాలి కండ్రిగ గ్రామస్తులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్దాలి కండ్రిగలో నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అయితే అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా బోర్ పాయింట్ వేసి ఆ నీటిని ట్యాంకర్ల ద్వారా చిట్టేడులోని పలు పరిశ్రమలకు సరఫరా చేస్తున్నారన్నారు. దీని వల్ల గ్రామంలో అరకొరగా పనిచేసే తాగునీటి చేతిపంపులు కూడా భూగర్భ జలాలు అడుగంటి నీరు రావడం లేదన్నారు. అనంతరం తహసీల్దార్ రోజ్‌మాండ్‌కు వినతిపత్రం అందజేశారు.



ఆందోళన చేస్తున్న మద్దాలి కండ్రిగ గ్రామస్థులు

నేడు వైసీపీలో చేరనున్న 'చిల్లకూరు'

కోట: మండలంలోని దొరువుకట్ట గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చిల్లకూరు దశరథరామిరెడ్డి శనివారం వైసీపీలో చేరుతున్నట్లు శుక్రవారం తన నివాసంలో ప్రకటించారు. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో కర్నూలు జిల్లా నంద్యాలలో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. దశరథరామిరెడ్డికి సముద్ర తీర ప్రాంతంలోని 7 పంచాయతీల్లో ప్రాబల్యం ఉంది. ఈయన దివంగత మాజీ సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి ముఖ్య అనుచరుడిగా కొనసాగారు. అయితే వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన ఎన్నికల హామీలపై ఆకర్షితుడినై ఆ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. తన చేరికకు ప్రసన్నకుమార్‌రెడ్డితో పాటు వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్, తదితరుల సహకారం ఉందన్నారు. అనంతరం ఆయన తన అనుచరులతో నంద్యాలకు బయలుదేరి వెళ్లారు.



చిల్లకూరు దశరథరామిరెడ్డి

సినిమా గైడ్

గూడూరు

శ్రీనివాస్ తేజ:	నేనే రాజు నేనే మంత్రి
సుందరమహల్:	జయ జానకి నాయక
పీవీ :	ఫిదా
సంగం:	లై

కోట

ఆర్ఆర్‌టీ :	ఫిదా
రామ్‌రాజ్:	జయ జానకి నాయక
అరుణ:	నేనే రాజు నేనే మంత్రి

8 పాఠశాలలకు బిస్కెట్ ప్యాకెట్ల పంపిణీ

సూళ్లూరుపేట : స్వాతంత్ర్యదినోత్సవ సంబరాలలో తమ ప్రాంతంలోని 8 పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసేందుకు బిస్కెట్ ప్యాకెట్లను యల్లశిరి సుధాకర్‌రెడ్డి సమకూర్చారు. సుగ్గుపల్లికి చెందిన సుధాకర్‌రెడ్డి అక్కడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను దత్తత తీసుకొని కార్పొరేట్‌స్థాయి కల్పించి నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన తమ పాఠశాలతోపాటు దామానెల్లూరు కాంప్లెక్ పరిధిలోని ఒక జడ్పీ పాఠశాల, 7 ప్రాథమిక పాఠశాలల్లోని 400 మంది విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లను సమకూర్చి వాటిని స్థానిక ఎంఈవో ఉదయ్‌కుమార్‌కు చేరవేశారు.

ఆటంకం లేకుండా ఇసుక సరఫరా

● పోలీసు, రెవెన్యూ అధికారుల సమావేశంలో ఆర్డీవో శీనానాయక్

నాయుడుపేట : ప్రభుత్వ అభివృద్ధి పనులు, గృహ ప్రయోజనాలకు ఎటువంటి ఆటంకం లేకుండా ఇసుక సరఫరా అయ్యేలా చూడాలని ఆర్డీవో శీనానాయక్ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పోలీస్, రెవెన్యూ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం ఇసుకరీచ్‌కు ప్రభుత్వ గుర్తింపు ఉందన్నారు. పరిశ్రమలకు, డివిజన్‌లోని ఇతర ప్రాంతాలకు అలాగే గృహ ప్రయోజనాలకు ఇసుక రెవెన్యూ, పోలీస్ పరిరక్షణలో సరఫరా అయ్యేలా చూడాలన్నారు. ఇసుక రవాణాకు, ఇసుక కూలీలను ప్రభుత్వం నిర్ణయించిన మేర ట్రాక్టర్‌కు 3 క్యూబిక్ ల ఇసుక



పోలీస్, రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో శీనానాయక్

ఎత్తివేతకు 300 రూ, రవాణా 5 కిలోమీటర్ల వరకు 600రూ, 30 కిలోమీటర్ల వరకు 400రూ, 10 కిలోమీటర్ల వరకు 1200రూ, 30 కిలోమీటర్లు మించితే 1200 రూపాయల తోపాటు కిలో మీటరుకు 30 రూపాయల వంతున చెల్లించాలన్నారు. డివిజన్‌లోని నాయుడుపేట మండలంలో తన్నమాల వద్ద పులికాలువ, ఓజిలి మండలంలో బల్లవోలు, దొరవారి సత్రంలో పూలతోట, కొత్తపల్లి, పెళ్లకూరు మండలంలో పుల్లూరులో స్థానిక మండల పరిధిలో ప్రభుత్వ అభివృద్ధి పనులకు, గృహ ప్రయోజనాలకు త్వరలో తాత్కాలిక రీచ్‌లు రెవెన్యూ, పోలీస్ పర్యవేక్షణలో చేపట్టాల్సి ఉందన్నారు.

ఈ సమావేశంలో సీఐ రత్తయ్య, తహసీల్దార్ మైత్రేయ, ఎస్సై రవినాయక్, వీఆర్వో శేషగిరి, గోవర్ధన్, తదితరులు ఉన్నారు.

కామిరెడ్డికే నాయుడుపేట మండల పీఠం

నాయుడుపేటరూరల్ : నాయుడుపేట టీడీపీ మండల అధ్యక్షుడిగా కామిరెడ్డి రాజారెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా పార్టీ కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు అందాయి. తెలుగుదేశంపార్టీలో రాజారెడ్డి ఆవిర్భావం నుంచి కొనసాగుతున్నారు. పార్టీలో ఆయన చెరగని ముద్ర వేశారు. టీడీపీ జిల్లా కార్యదర్శిగా ఉన్న ఆయన మండలపార్టీ బలోపేతానికి ఎంపిక చేశారు. కామిరెడ్డికి ఎంపికపై టీడీపీ సీనియర్ నాయకులు తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త టీడీపీ యువనాయకులు తంబిరెడ్డి మోహన్‌రెడ్డి, టీడీపీ మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి పనబాక భూలక్ష్మి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ కుమార్, టీడీపీ నాయకులు వేనాటి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



కామిరెడ్డి రాజారెడ్డి

ఓజిలి పగ్గాలు విజయకుమార్‌నాయుడికే

ఓజిలి: తెలుగుదేశం పార్టీ ఓజిలి మండల అధ్యక్షుడిగా పున్నేపల్లికి చెందిన గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు ఎంపికయ్యారు. ఈమేరకు శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయం నుంచి నియామక పత్రం అందింది. మండల పార్టీలో విజయలునాయుడుగా పిలువబడుతున్న ఆయన పార్టీలో అందరిని కలుపుకుపోయే తత్వంతో పనిచేశారు. గత 15 ఏళ్ళుగా మండల పార్టీ సారధ్యబాధ్యతలు చేపడుతున్నారు.



గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు

నాయకుల హర్షం : విజయకుమార్‌నాయుడు ఎంపికపై పార్టీ సీనియర్‌నాయకుడు వల్లూరు సూర్యప్రకాశరావు, పెద్దపరియ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కొండూరు సుబ్రమణ్యంరాజు, యువనాయకులు కంకణాల సత్యవరప్రసాద్ రావు, మాజీ సర్పంచ, గూడూరు ఏఎంసీ డైరెక్టర్ పాడి వెంకట సుబ్బయ్య, తెలుగుయువత అధ్యక్షుడు అర్జున్‌రాజు, కోఆప్షన్ సభ్యులు ఖలీల్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

డీవీసత్రం టీడీపీ అధ్యక్షుడిగా వేనాటి

దొరవారిసత్రం: టీడీపీ మండల అధ్యక్షుడిగా వేనాటి సతీష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పామంజి శ్రీనివాసులు ఎంపికయ్యారు. ఎన్‌డీసీసీబీ ఛైర్మన్‌గా పనిచేసి దివంగతులైన వేనాటి మునిరెడ్డి తనయుడైన వేనాటి సతీష్‌రెడ్డి తన చిన్నాన్న జడ్పీ ఫ్లోర్ లీడర్ వేనాటి రామచంద్రారెడ్డి ఆశీస్సులతో గత స్థానికసంస్థల ఎన్నికల ముందు రాజకీయరంగ ప్రవేశం చేశారు. నాటి నుంచి దొరవారిసత్రం మండల బాధ్యతలను అన్నీతానై వ్యవహరిస్తూ పార్టీని నడిపిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు, అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ గెలుపు కోసం మండలంలో తీవ్రంగా కృషిచేశారు.



వేనాటి సతీష్‌రెడ్డి

నంద్యాల ఉప ఎన్నికల్లో విజయం మాదే :వేలూరు

పెళ్లకూరు : నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి విజయం ఖాయమని టీడీపీ మండల అధ్యక్షుడు వేలూరు మురళీ కృష్ణారెడ్డి తెలిపారు. పెళ్లకూరులో ఆయన శుక్రవారం విలేఖర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు నంద్యాల అభ్యర్థి విజయానికి దోహదపడుతాయన్నారు. జిల్లాస్థాయిలో ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారుల పనితీరు కూడా మారాలని లేకుంటే ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు వస్తుందని తెలిపారు. ప్రభుత్వం నీరు-పథకం పథకం కింద పలు అభివృద్ధి పనులను ఇరిగేషన్‌శాఖ ద్వారా చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ పనులను చేపడుతున్న గుత్తేదారులు, అధికారుల పనితీరుపై ఇటీవల కొన్ని పత్రికల్లో వస్తున్న కథనాలను ఆధారంగా చేసుకొని జిల్లా ఇరిగేషన్ ఉన్నతాధికారులు ఇష్టమొచ్చినట్లు ఏఈ స్థాయి అధికారులను బదిలీ చేయడం తగదన్నారు. సమావేశంలో స్వర్ణముఖి ఆనకట్ట ఛైర్మన్ పేరం రమేష్‌నాయుడు ఉన్నారు.



మాట్లాడుతున్న మురళీకృష్ణారెడ్డి

సినిమా థియేటర్ పరిశీలన



థియేటర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో

నాయుడుపేటరూరల్ : నాయుడుపేట పట్టణంలో నూతనంగా ప్రారంభించిన శ్రీ వెంకటేశ్వర థియేటర్‌ను శుక్రవారం నాయుడుపేట ఆర్డీవో శీనానాయక్ పరిశీలించారు. థియేటర్‌ను మరమ్మతులు పూర్తిచేసి నూతనంగా ప్రారంభించడంతో అనుమతుల కోసం రెవెన్యూ శాఖకు దరఖాస్తులు చేసుకోవడంతో సినిమాహాలు పరిశీలించినట్లు ఆర్డీవో తెలిపారు. ఆర్డీవో వెంట థియేటర్ యజమాని గూడూరు రఘునాధరెడ్డి, ఆర్ఐ షీరాజ్, వీఆర్వో శ్రీనివాసులు ఉన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం

ఓజిలి: ఓజిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ బదిలీపై వెళుతున్న బీ శ్రీనివాసులును ఉపాధ్యాయులు సన్మానించారు. మండల ఎంఈవోగా,హెచ్‌ఎంగా ఆయన అందించిన సేవలను ఈసందర్భంగా ఉపాధ్యాయులు కొనియాడారు.

తడకండ్రిగలో పారిశుధ్య చర్యలు

తడ : వాతావరణంలో మార్పులతోపాటు పంచాయతీలలో మురుగునీళ్లు నిల్వ ఉండటంతో దోమల లార్వా వృద్ధి చెందుతుందని తడకండ్రిగ పంచాయతీ అధికారులు గ్రామాల్లో ఫాగింగ్ చేస్తున్నారు. కొద్ది రోజులుగా గ్రామంలో జ్వరాలు అధికమవుతుండటంతో పంచాయతీ అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టారు. గ్రామాల్లో ఉన్న చెత్త కుప్పలను ఏరివేస్తున్నారు. మురికిగుంటలపై కిరోసిన్‌ను పిచికారి చేస్తున్నారు. గ్రామాల్లో బ్లీచింగ్ చల్లుతున్నారు.

బడిబయట 101మంది

● సర్వశిక్ష అభియాన్ ప్లానింగ్ జిల్లా కోఆర్డినేటర్

తడ : బడి బయట పిల్లలలో ఇంకా 101 మందిని గుర్తించాల్సి ఉందని సర్వశిక్ష అభియాన్ ప్లానింగ్ జిల్లా కోఆర్డినేటర్ షేక్ ఎండీ రహీమ్ తెలిపారు. స్థానిక మండల రిసోర్స్ కేంద్రానికి శుక్రవారం వచ్చిన ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఈ ఏడాది స్థానిక విద్యాశాఖ అధికారుల లెక్కల ప్రకారం బడి బయట పిల్లలు 1,783 మంది ఉన్నారని అయితే ప్రజాసాధికారిక సర్వేలో తేడా వచ్చిందన్నారు. విద్యార్థి గణన ప్రకారం 1,682 మందిని గుర్తించామని తెలిపారు. ఇంకా 101 మందిని గుర్తించాల్సి ఉందని వీరిలో వలసవెళ్లిపోయిన వారు మైగ్రేషన్ ద్వారా ఇతర రాష్ట్రాలలో చదివే వాళ్లు ఉన్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని వారిని గుర్తించాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో ఆయనతోపాటు ఎంఈవో పూర్ణచంద్రరావు, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రహీమ్, చిత్రంలో ఎంఈవో, తదితరులు

ఆధునిక వలయం ఏర్పాటుకు స్థల పరిశీలన

నాయుడుపేటరూరల్ : నాయుడుపేటలోని గడియారం సెంటర్ వద్ద ఆధునిక వలయం ఏర్పాటు చేసేందుకు ఆర్డీవో శీనానాయక్ శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. గడియారం సెంటర్ వద్ద గతంలో పాత పోలీస్ స్టేషన్ భవనం ఉండేది. ప్రస్తుతం అందులో పోలీస్, గ్యాస్ గోదాములు ఉండటంతో దానిని వలయం ఏర్పాటు కోసం తొలగించారు. పోలీసుల గోదాముకు అనువైన స్థలం కేటాయించాలని సీఐ రత్తయ్య, ఎస్ఐ రవినాయక్ కోరారు. దీంతో నగరపంచాయతీ, పోలీస్‌శాఖల మధ్య స్థలవివాదం సర్దుబాటుకాకపోవడంతో ఆర్డీవో రంగంలో దిగారు. స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆర్డీవో శీనానాయక్ మాట్లాడుతూ కలెక్టర్‌తో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే గాంధీమందిరం వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న పార్కు స్థలాన్ని ఆర్డీవో పరిశీలించారు. గోమతి సెంటర్ వద్ద సర్కిల్ కోసం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సర్కిల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రత్తయ్య, కమిషనర్ ఆవినేని ప్రసాద్, నగర పంచాయతీ ప్లానింగ్ అధికారి చంద్రశేఖర్, ఆర్ఐ షీరాజ్, వీఆర్వో శ్రీనివాసులు, నగరపంచాయతీ సిబ్బంది రవి, తదితరులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో శీనానాయక్, సీఐ, కమిషనర్ తదితరులు

శ్రీ చైతన్యలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



గోపిక, కృష్ణుల వేషధారణలో చిన్నారులు

సూళ్లూరుపేట : శ్రీ చైతన్య పాఠశాలలో శుక్రవారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు కోలాహలంగా జరిగాయి. చిన్నారులు కృష్ణులు, గోపికల వేషధారణలతో అలరింపచేశారు. ప్రిన్సిపాల్ సాయిరాం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఏజీఎం శ్రీకాంత్, డీన్ వెంకటేశ్వర్లు, రాధిక, పూర్ణిమ, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
12
సూళ్లూరుపేట
శనివారం, 12 ఆగస్టు 2017

మద్యం దుకాణం తొలగించండి

సూళ్లూరుపేట : మండలంలోని కోటపోలూరు పంచాయతీ పరిధిలో వేనాటి లేఅవుట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మద్యందుకాణాన్ని తొలగించాలంటూ గాయత్రినగర్‌లో నివసించే షార్ విశ్రాంత ఉద్యోగులు కలెక్టర్‌కు ఓ వినతి పత్రాన్ని పంపుతున్నట్లు తెలిపారు. షార్‌లో ఉద్యోగులుగా పనిచేసిన తాము ఉద్యోగుల విరమణ అనంతరం ఇక్కడ ప్రశాంతంగా జీవిస్తున్నామని ప్రస్తుతం మద్యం దుకాణంతో తమ ప్రాంతంలో ప్రశాంతతకు విఘాతం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ఈ మద్యం దుకాణాన్ని తొలగించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

రెండు లారీల ఢీ

దొరవారిసత్రం: దొరవారిసత్రం మండలం ఎన్ఎంఅగ్రహారం వద్ద చెన్నైవైపు వెళ్లే మార్గంలో హైవే పక్కన ఆగి ఉన్న కంటైనర్ లారీని సిలికా లోడ్‌తో వెళుతున్న టిప్పర్ అదుపు తప్పి ఢీకొనింది. ఈ ప్రమాదంలో టిప్పర్‌లారీ డ్రైవర్ ప్రభాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రభాకర్‌ను స్థానికులు టోల్‌ప్లాజా హైవే అంబులెన్స్ సాయంతో సూళ్లూరుపేటకు తరలించి చికిత్స అందించారు. అనంతరం క్షతగాత్రుడిని చెన్నైకు తరలించారు. ఈ ప్రమాదంపై స్థానిక పోలీసులు కేసున మోదు చేశారు.

ఉపాధ్యాయుడి మృతి

ఓజిలి: ఓజిలి మండలం కురుగొండకు చెందిన జి చలపతి (51) శుక్రవారం అనారోగ్యం కారణంగా మృతి చెందాడు. మండలంలోని చిల్లమానుచేను జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన వారం రోజులుగా నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతదేహాన్ని కురుగొండకు తీసుకువచ్చి అంత్యక్రియలను నిర్వహించారు. ఉపాధ్యాయుడు చలపతి మృతిపై పలు ఉపాధ్యాయ సంఘాలు సంతాపం ప్రకటించాయి. అంత్యక్రియల కోసం ప్రభుత్వం మంజూరుచేసిన నిధులను కుటుంబానికి అందజేశారు.

ఓజిలి ఎన్ఎస్ఆర్ గిరిజన కాలనీకి చెందిన ట్రైనింగ్ ఎస్ఐ రాజ్‌కుమార్ తండ్రి మారెళ్ల రమణయ్య (53) శుక్రవారం గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఉన్నట్టుండి అనారోగ్యానికి గురైన నేపథ్యంలో చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిసింది.

నేడు విద్యుత్‌కు అంతరాయం

తడ : విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం 4 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని ఆశాఖ ఏఈ హరికృష్ణ తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తడ.. తడకండ్రిగలో విద్యుత్‌ను నిలిపివేస్తామని తెలిపారు.

చిలకల కొలికిగా శ్రీమహాలక్ష్మి

సూళ్లూరుపేట : ఆ అమ్మణ్ణికి ఇరువైపుల చిలకలు... ముత్యాలతో కిరీటం, ఆభరణం... అమ్మవారి ఆసనంపై ముత్యాల అలంకారం... ఇలా ముత్యాలతో మహాలక్ష్మిదేవి అలంకారానికి సూళ్లూరుపేటకు చెందిన సూక్ష్మ కళాకారిణి చలువాది మల్లి విష్ణువందన వివిధ ఆకృతులను తయారుచేశారు. శ్రావణ శుక్రవారం బాలాంజనేయస్వామి ఆలయంలో మహాలక్ష్మిదేవికి మూలమంత్ర హోమం సందర్భంగా వీటిని సమర్పించి అమ్మవారిని అలంకరింపచేశారు.



ముత్యాల అలంకారం చేస్తున్న విష్ణువందన

'శ్రావణ' సందడి



మహాలక్ష్మికి మూలమంత్రహోమం

శ్రావణ శుక్రవారం సందర్భంగా సూళ్లూరుపేట చిత్రకూటమిలోని బాలాంజనేయస్వామి ఆలయంలో మహాలక్ష్మిదేవికి మూలమంత్రహోమం అట్టహాసంగా నిర్వహింపచేశారు. 108 కమలములు, పసుపు, కుంకుమ, 108 విశేష ద్రవ్యములతో అమ్మణ్ణికి హోమం చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకులు దివీ లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

\- సూళ్లూరుపేట



వైభవంగా దీపలక్ష్మి పూజ

నాయుడుపేట పట్టణం శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు దీపలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి అభిషేకాలు, కుంకుమపూజ, అష్టోత్తరపూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి అధికసంఖ్యలో మహిళలు పాల్గొని దీపలక్ష్మి పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు విట్టా శ్రీనివాసశర్మ, ఆర్యవైశ్య సంఘ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

\- నాయుడుపేటరూరల్



వాసవమ్మకు చాక్లెట్ల అలంకారం

సూళ్లూరుపేట చిత్రకూటమిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని శ్రావణ శుక్రవారం సందర్భంగా వినూత్నంగా చాక్లెట్లతో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ అలంకారానికి ఆర్. శ్రీనివాసులు ఉభయకర్తగా వ్యవహరించారు. శ్రావణమాసం సందర్భంగా ప్రతి శుక్రవారం వాసవమ్మకు ఇలా వినూత్న అలంకారాలను కన్యకాపరమేశ్వరి వలంటీర్ సంఘం చేయిస్తోంది. 3వ శుక్రవారం చాక్లెట్ల అలంకారంలో ఉన్న కన్యకా పరమేశ్వరిని పెద్ద ఎత్తున భక్తులు సందర్శించుకున్నారు.

\- సూళ్లూరుపేట

ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయం



నిర్వాహకులను అభినందిస్తున్న యండవల్లి

సూళ్లూరుపేట : విద్యార్థుల హక్కులకోసం సమస్యల సాధనకోసం పోరాటాలు చేసే విద్యార్థి సంఘాలు ఆటలపోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ యండవల్లి శ్రీనివాసులురెడ్డి అన్నారు. పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ సంయుక్తంగా మూడు రోజులపాటు స్థానిక జూనియర్ కళాశాల ఆవరణంలో మండలంలోని విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించాయి. ముగింపు కార్యక్రమానికి శుక్రవారం ఎమ్మెల్సీ యండవల్లి శ్రీనివాసులురెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెద్ద ఎత్తున పోటీలు నిర్వహించిన విద్యార్థి సంఘాల నేతలను అభినందించి, విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మోదుగుల పార్థసారధి, మోదుగుల రమణయ్య, సీపీఎం పద్మనాభయ్య, యూటీఎఫ్ రాజశేఖర్, చాంపియన్ స్కూల్ చంద్రారెడ్డి, ఓగూరు కృష్ణయ్య, ఆనంద్‌బాబు, అల్లెయ్య, తదితరులు పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ నాగరాజు, గుణ, వినోద్, సుమన్, చందు, పీడీఎస్‌యు లోకేష్, రాజ, నరేంద్ర, ఏఐఎస్ఎఫ్ సూర్య, అజిత్‌లు ఈ ఆటలపోటీలను నిర్వహించారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



మిఠాయిలు తినిపించుకుంటున్న బీజేపీ నేతలు

సూళ్లూరుపేట : భారత ఉపరాష్ట్రపతిగా ముప్పవరపు వెంకయ్యనాయుడు శుక్రవారం దేశరాజధానిలో ప్రమాణస్వీకారం చేస్తుండగా సూళ్లూరుపేటలో బీజేపీ నేతలు, కార్యకర్తలు ఆనందోత్సవాలు నిర్వహించారు. మెడలో బీజేపీ పతాకాలు ధరించి బస్టాండ్‌కు చేరి బాణసంచ కాల్చారు. మిఠాయిలు పంపిణీ చేస్తూ ఆనందం వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. ఆపార్టీకి చెందిన ఇమ్మానేని చెన్నకేశవరావు, పులుగు శ్రీనివాసులురెడ్డి, ముతుకు కోటయ్యగౌడ్, ఆళత్తూరు సుబ్రహ్మణ్యంరెడ్డి, నూతలపాటి శ్రీనివాసులు, నాగరాజు, పురుషోత్తం, రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు, మునికుమార్, తదితరులు సంబరాల్లో పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ

తడ : స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు బస్‌పాస్‌లను అందజేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త జీవీఆర్ ఇన్‌ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ కొండేపాటి గంగాప్రసాద్ సుమారు 30వేల రూపాయలు వెచ్చించి 750 మంది విద్యార్థులకు బస్‌పాస్‌లను సమకూర్చారు. వీటిని శుక్రవారం సూళ్లూరుపేట ఆర్టీసీ సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం. కల్పన అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు రఘురామయ్య, వెంకటేశ్వర్లు, మనోహర్, యూనియన్ కార్యదర్శి ఎం. శేఖర్, ప్రధానోపాధ్యాయుడు నరసింహరావు పాల్గొన్నారు.



బస్‌పాస్‌లు అందుకుంటున్న విద్యార్థినులు

గిరిజన విద్యార్థులకు ఆధార్ ఏర్పాటు



గిరిజన విద్యార్థులకు ఆధార్ తీయిస్తున్న హెచ్ఎం

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట మున్సిపల్ పరిధిలోని పెదపాళెం గిరిజనవాడలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో నలుగురు విద్యార్థులకు ఆధార్‌కార్డును హెచ్ఎం, సీఆర్‌పీలు చొరవతీసుకొని ఏర్పాటు చేయిస్తున్నారు. విద్యార్థులకు కూడా ఆధార్‌కార్డులు ఉండాలని నిబంధనలు ఉన్నా పేదరికం కారణంగా పెదపాళెం గిరిజనులు తమ పిల్లలకు ఆధార్ తీయించలేదు. దీంతో చివరికి హెచ్ఎం చంద్రమౌళి, సీఆర్‌పీ సుధాకర్ నలుగురు పిల్లలను తమ మోటారు బైక్‌లపై సూళ్లూరుపేటకు తీసుకువచ్చి మీసేవ కేంద్రంలో ఆధార్‌కు ఏర్పాట్లు చేశారు. సొంతఖర్చుతో ఆ విద్యార్థులకు ఆధార్ తీయించిన హెచ్ఎం, సీఆర్‌పీలను ఎంఈవో అభినందించారు.

విద్యార్థికి ఆర్థికసాయం



విద్యార్థికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎంఈవో

తడ : ఆడుకొంటూ నోట్లోవేసుకున్న తామరగింజ ఊపిరితిత్తులో చేరిపోయి ఓ విద్యార్థి ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందజేశారు. కారిజాత ప్రాథమికోన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఎం. అవినాష్ ఇటీవల తామరగింజను నోట్లో వేసుకొని అస్వస్థతకు గురయ్యాడు. ఆ విద్యార్థికి చెన్నైలో చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న తడ ఉపాధ్యాయులు సూళ్లూరుపేట సేవాసమాఖ్య సభ్యులు 10,300 రూపాయలు, అపాచీ పరిశ్రమలో పనిచేసే ఓ అధికారి 5వేల రూపాయలు, ఆ విద్యార్థికి ఆర్థికసాయం చేశారు. ఆ నగదును శుక్రవారం ఎంఈవో పూర్ణచంద్రరావు అందజేశారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

మనుబోలు : వరల్డ్ విజన్ ఇండియా వారు శుక్రవారం నెల్లూరులో కలెక్టరేట్ వద్ద విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ చేశారు. మనుబోలు మండలంలోని యాచవరం గ్రామానికి చెందిన ప్రవల్లిక(9వ తరగతి), కోదండరావు రంకు చెందిన పంచేటి ప్రగతి(పాలిటెక్నిక్)కి జేసీ ఇంతియాజ్ అహ్మద్ సైకిళ్లు అందజేశారు. సంస్థ జిల్లా మేనేజర్ జోషిబాబు మాట్లాడుతూ 11 మండలాల్లోని పేద విద్యార్థినులను గుర్తించి సైకిళ్లు పంపిణీ చేశామన్నారు. విద్యార్థినులు చదువు కొనసాగింపునకు ఇది ఎంతో ఉపయోగ పడుతుందని భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ సాదే పాల్గొన్నారు.

• ఇంటర్వ్యూ



భూసారంపై అవగాహన కల్పిస్తున్నాం

వ్యవసాయాధికారి జ్యోత్స్న

? : భూమి సారవంతం చేయడానికి తీసుకుంటున్న చర్యలేమిటి.

! : నీరు-చెట్టు కార్యక్రమం ద్వారా పూడికతీత మట్టిని పంట పొలాలకు తరలించాం. ఈ విషయమై రైతుల్లో అవగాహన కల్పిస్తున్నాం.

? : భూసార పరీక్షలు ఎలా చేస్తున్నారు.

! : రైతులు పంటసాగుకు ముందు విధిగా భూసార పరీక్షలు చేయించుకునేలా చర్యలు తీసుకుంటున్నాం.

? : సేంద్రియ ఎరువుల వాడకం ఎలా ఉంది.

! : ఇప్పుడిప్పుడే రైతుల్లో సేంద్రియ వర్మికంపోస్టు ఎరువులు వాడకంపై చైతన్యం వస్తోంది. అక్కడక్కడ వానపాముల యూనిట్లు కూడా రైతులకు అందుబాటులోకి తెస్తున్నాం.

? : రాయితీ విత్తనాలేమైనా పంపిణీ చేస్తున్నారా.

! : రైతులకు సంబంధించి 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట ఎరువులైన జీలగలు, పిల్లిపెసర అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే దాదాపు 50 శాతంపైగా రైతులకు ఈ విత్తనాలు పంపిణీ చేశాం

- తోటపల్లిగూడూరు

బీజేపీ నాయకుల సంబరాలు

పొదలకూరు: భారతదేశ 13వ ఉప రాష్ట్రపతిగా శుక్రవారం ముప్పవరపు వెంకయ్యనాయుడు ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే పొదలకూరులో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక పంచాయతీ బస్టాండులో బాణ సంచా పేల్చి, మిఠాయిలు పంచిపెట్టి ఆనందాన్ని వ్యక్తంచేశారు. ఆ పార్టీ జిల్లా నాయకుడు వీరేపల్లి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నెల్లూరు జిల్లా చౌటపాళెంలో రైతు కుటుంబంలో జన్మించిన వెంకయ్యనాయుడు నేడు ఢిల్లీ స్థాయిలో భారతదేశ రెండో అత్యుత్తమ పదవిని చేపట్టి జిల్లా కీర్తి ప్రతిష్టలు ఇనుమడింప చేశారన్నారు. భవిష్యత్తులో దేశ అత్యుత్తమ పదవిని అలంకరించాలని , ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు ఇవ్వాలని ఆకాంక్షించారు. పార్టీనే కన్న తల్లిగా భావించి క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదిగిన వెంకయ్యనాయుడును నేటి తరం రాజకీయనాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు దాసరి సురేంద్రబాబు, నాయకులు రావపూటి ధనుంజయరావు, మల్లికార్జునరెడ్డి, మదనపల్లి రఘు, ఎం రవీంద్రయాదవ్, అమ్మవారిపాళెం లక్ష్మణనాయుడు, చిగురుపాటి రవి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుఖ్యాతిని నిలబెట్టాడు

మనుబోలు : ఉపరాష్ట్రపతిగా ముప్పవరపు వెంకయ్యనాయుడు విజయం సాధించి తెలుగుఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటారని బీజేపీ మండలాధ్యక్షుడు బోలా శ్రీనువాసులు అన్నారు. స్థానిక శివాలయ ప్రాంగణంలో శుక్రవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు వెంకయ్య ప్రమాణ స్వీకారంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బోలా మాట్లాడుతూ ఒక సామాన్య రైతు కుటుంబంలో మారుమూల పల్లెనుంచి అంచెలంచెలుగా ఎదిగి దేశ ద్వితీయ పౌరుడు హోదా పొందడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం కార్యకర్తలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు వీరప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరులో హర్షం ప్రకటిస్తున్న బీజేపీ నాయకులు



మనుబోలులో బీజేపీ నాయకులు హర్షం

చెట్టుపై నుంచి పడి ఒకరికి అస్వస్థత

మనుబోలు : మండలంలోని పల్లెపాళెం గ్రామానికి చెందిన తిన్నెలపూడి ప్రభాకర్ శుక్రవారం ఆకు కోయాలని గ్రామంలో ఉన్న చింతచెట్టు ఎక్కాడు. పట్టుతప్పి కింద పడిన ప్రభాకర్ అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు బాధితుడిని 108 ద్వారా గూడూరుకు తరలించారు.

నలుగురి అరెస్టు

మనుబోలు : మండలంలోని అనుపల్లిపాడుకు చెందిన గుండుబోయిన లావణ్యను వేధించిన కేసులో శుక్రవారం నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. లావణ్య అత్త గుండుబోయిన పద్మమ్మ,మామ దయాకర్, మరిది మస్తానయ్య, తోడికోడలు సుమలతలను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

హత్యకేసులో నిందితుడు..

ముత్తుకూరు: హత్యాయత్నం కేసులో నిందితుడిని శుక్రవారం ముత్తుకూరు ఎస్ఐ సాంబశివరావు అరెస్టు చేశారు. మండలంలోని దుత్తపాడులో ఉత్సవాల సందర్భంగా నెల్లూరు హరిబాబు, శ్రీకృష్ణ మధ్య ఘర్షణ పడ్డారు. దాడిలో శ్రీకృష్ణ బాటిల్‌తో హరిబాబు గొంతుపై పొడిచి పరారయ్యాడు. దర్యాప్తు అనంతరం నిందితుడు శ్రీకృష్ణను అదుపులోనికి తీసుకుని కోర్టుకు హాజరు పరిచారు.

మద్యం దుకాణం యజమాని..

ముత్తుకూరు: ముత్తుకూరు కూడలిలో బెల్టుదుకాణానికి మద్యం సరఫరా చేసిన దుకాణం యజమానిని ముత్తుకూరు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. జువ్వలైలో బెల్టు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ముత్తుకూరు ఎస్ఐ సాంబశివరావు దాడులు నిర్వహించి ముత్తుకూరు కూడలిలోని బెల్టు దుకాణం నిర్వాహకుడిని అరెస్టు చేశారు. దర్యాప్తులో గోపాలపురం దుకాణం నుంచి మద్యం సరఫరా చేశారని తెలియడంతో యజమాని రామచంద్రారెడ్డిని శుక్రవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు.

స్టేడియం భూమిపై విచారణ

ముత్తుకూరు: ముత్తుకూరులో నిర్మించ తలపెట్టిన స్టేడియం భూమికి సంబంధించి కోర్టు ఉత్తర్వుల మేరకు శుక్రవారం తహసీల్దారు చెన్నయ్య విచారణ చేపట్టారు. సబ్‌స్టేషన్ సమీపంలో స్టేడియం కోసం భూమి కేటాయించారు. ఈ భూమిలో ఆక్రమణలున్నాయని తొలగించేందుకు గతంలో గిరిజనులకు నోటీసులు ఇచ్చారు. అయితే ఈ స్థలంలో తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కొందరు గిరిజనులు కోర్టుకు వెళ్లారు. ఈ విషయంపై సమగ్రంగా దర్యాప్తుచేసి నివేదిక ఇవ్వాల్సిందిగా తహసీల్దారును కోర్టు ఆదేశించింది. తహసీల్దారు చెన్నయ్య తన కార్యాలయంలో నోటీసులు అందుకున్న వారిని విచారించారు. స్థలాలకు సంబంధించి వారి వద్ద ఉన్న ఆధారాలను సమర్పించాల్సిందిగా కోరారు. సమగ్ర విచారణ అనంతరం కోర్టు ఉత్తర్వుల మేరకు వ్యవహరిస్తామని తహసీల్దారు తెలిపారు.

18 నుంచి వెంకయ్య ఆరాధనోత్సవాలు

వెంకటాచలం : ఈ నెల 18 నుంచి 24 వతేదీ వరకు గొలగమూడి వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. 18 ఉదయం సర్వభూపాల వాహనసేవ, రాత్రికి కల్పవృక్ష వాహనసేవ, 19 ఉదయం హనుమంత వాహనసేవ, రాత్రికి చంద్రప్రభ వాహనసేవ, 20 ఉదయం చినశేష వాహనసేవ, రాత్రికి హంస వాహనసేవ, 21 ఉదయం సూర్యప్రభ వాహనసేవ, రాత్రికి గజవాహనసేవ, 22 ఉదయం అశ్వవాహనసేవ, రాత్రికి పెదశేషవాహనసేవ, 23 ఉదయం సింహ వాహనసేవ, రాత్రికి గరుడ వాహనసేవ, 24 ఉదయం రథోత్సవం, రాత్రికి తెప్పోత్సవం ఉంటాయని ఆయన వివరించారు. ఉత్సవాలు జరిగే రోజుల్లో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

ఏకాంత సేవతో ముగిసిన చెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలు

మనుబోలు : స్థానిక దళితవాడ చెన్నకేశవుడి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం అర్ధరాత్రి జరిగిన ఏకాంతసేవతో ముగిశాయి. ఈ నెల 2వ తేదీ నుంచి తొమ్మిది రోజులు పాటు 10 మంది మహిళలు కమిటీగా ఏర్పడి చందాలు సేకరించి స్వామివారి బ్రహ్మోత్సవాలను 35 ఏళ్ల తరువాత నిర్వహించారు. అర్చకులు రాఘవాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ఏకాంతసేవ నిర్వహించారు.

విద్యా సంస్థల బంద్ ప్రశాంతం

పొదలకూరు: ఎస్సీ వర్గీకరణ సాధనలో భాగంగా పొదలకూరులో శుక్రవారం మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) ఆధ్వర్యంలో చేపట్టిన విద్యా సంస్థల బంద్ ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు మూసివేసి బంద్‌కు సహకరించారు. ఎంఎస్ఎఫ్ సర్వేపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు చిడదల శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు ఉద్యమాలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సూరిపాక ఉదయకృష్ణమాదిగ, గార్ల యశ్వంత్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

వైపరీత్యాల సమాచారం తెలిపే టవర్ నిర్మాణం



నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ముత్తుకూరు: ప్రకృతి వైపరీత్యాలను ముందుగా తెలుసుకునేందుకు అవసరమైన టవర్‌ను ముత్తుకూరు తహసీల్దారు కార్యాలయం వెనుక నిర్మిస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు ఎల్ అండ్ టీ సంస్థ శుక్రవారం ప్రారంభించింది. ఆ సంస్థ రాష్ట్ర ప్రతినిధి సుజన్ మాట్లాడుతూ ఈ టవర్ నిర్మాణం ద్వారా సునామీ, తుపాను, పిడుగులు, భూకంపాల రావడానికి ముందే సమాచారం తెలుస్తుందన్నారు. తద్వారా ఏర్పడే ముప్పు నుంచి తప్పించుకునే అవకాశం ఉందన్నారు. తహసీల్దారు పర్యవేక్షణలో సమాచార నిర్వహణ ఉంటుందన్నారు. తొమ్మిది జిల్లాల్లో రూ.83 కోట్లతో 150 షెల్టర్లు, 16 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ అండ్ టీ ప్రతినిధులు అభిషేక్, ఫిరోజ్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

మనుబోలు : మండల పరిధిలోని మనుబోలు, చెర్లోపల్లి, వెంకన్నపాళెం, వీరంపల్లి సబ్‌స్టేషన్లలో శనివారం మరమ్మతులు చేపడుతున్నామని ట్రాన్స్‌కో ఏఈ పీ మునిశేఖర్ శుక్రవారం తెలిపారు. ప్రతినెలా రెండో శనివారం సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కోసం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 19 పంచాయతీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్న విషయాన్ని వినియోగదారులు గుర్తించుకోవాలన్నారు.

డొంకదారి తవ్వేశారని ఏఈకి ఫిర్యాదు

తోటపల్లిగూడూరు : ఆయకట్టు రైతుల కు సంబంధించి దిగువ పొలాలకు వెళ్లేందుకు ఉపయోగిస్తున్న డొంకదారిని తవ్వేశారని వరిగొండ గ్రామానికి చెందిన ఎలసిరి రాజేష్, ఎలసిరి శ్రీనివాసులు అదే గ్రామానికి చెందిన పోలంరెడ్డి అవినాష్‌రెడ్డిపై మండల నీటిపారుదలశాఖ సహాయక ఇంజనీరు కేవీఆర్ ప్రసాద్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు పోలంరెడ్డి అవినాష్‌రెడ్డి పొలం దిగువన ఎలసిరి రాజేష్, గుండాల ప్రభాకర్‌రెడ్డి, ఎలసిరి శ్రీనివాసులు, రావూరు సురేంద్రరెడ్డి, కోట రవణారెడ్డి, పొన్నూరు పెంచలరెడ్డి, పొన్నూరు సుకుమార్‌రెడ్డిలకు సంబంధించి దాదాపు 50 ఎకరాలకుపైగా భూమి ఉందన్నారు. ఈ భూమికి సంబంధించి ప్రధాన రహదారిగా ఉన్న నీటిపారుదలశాఖ కట్ట తమ పొలంలో ఉందని యంత్రం సాయంతో తొలగించడన్నారు. దీంతో దిగువ ఆయకట్టు రైతులకు దారిలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఏఈకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు తక్షణం లస్కర్ల ద్వారా తొలగింపు పనులు నిలిపివేయించి ఏ రెవెన్యూ పరిధిలో ఉందో గుర్తించడంతోపాటు ఎంత మేరకు ఇరిగేషన్ పరిధిలో ఉందని తెలుసుకున్న అనంతరం హద్దులు నిర్ణయిస్తామని ఏఈ తెలిపారు. ఇరిగేషన్‌కు సంబంధించి కట్టను తొలగించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

సాయి ద్వారక విగ్రహ ప్రతిష్ఠ

తోటపల్లిగూడూరు : మండలంలోని నరుకూరు గ్రామంలో కొత్తగా నిర్మించిన శ్రీ సాయి ద్వారక విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో భక్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా దీక్ష హోమం, యాగ మండప హోమాలు, చండీ హోమం నిర్వహించారు. ఉదయం 6 గంటలకు స్వామివారికి ప్రత్యేకపూజ, అభిషేకాలు జరిపించారు. సాయంత్రం జలాధివాసం, జలాదివాసాంగ హోమం, ప్రభాత బలి కార్యక్రమాలు నిర్వహించారు. నరుకూరు, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. గట్టుపల్లి అనీల్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బ్రహ్మశ్రీ శశిపాటి సత్యనారాయణమూర్తి, బ్రహ్మశ్రీ గొబ్బెళ్లపాటి వెంకట హనుమత్ సుబ్రహ్మణ్యం శర్మ, బ్రహ్మర్షివర్యులైన శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో గట్టుపల్లి శివకుమార్, పడుగుపల్లి గోపాలకృష్ణ, సాయిపవన్, ఈదర పవన్‌కుమార్, రాధాకృష్ణశర్మ చండీయాగం నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి
శనివారం,
12 ఆగస్టు 2017

వైభవంగా కోదండరాముడి విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న అర్చకులు

రాపూరు : టీటీడీ, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చుట్టుపాళెం దళితవాడలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయ ప్రారంభం, నూతన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా ఆలయం వద్ద ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించగా ఏర్పేడు దత్తాత్రేయ మఠం పీఠాధిపతులు దయానందస్వామి ఆలయాన్ని ప్రారంభించి విగ్రహ ప్రతిష్ఠాపన, గోపుర కలశాల ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచు భాగ్యమ్మ, నాయకులు చెన్ను బాలకృష్ణారెడ్డి, పాపకన్ను దయాకర్‌రెడ్డి, జిల్లా ధర్మప్రచారక్ వెంగళరెడ్డి, మండల ప్రచారక్ గణపతి పాల్గొన్నారు. గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రతి నిత్యం భజన కార్యక్రమాలు నిర్వహించి ప్రాచీన కళలు, సంప్రదాయాలకు పూర్వవైభవం తీసుకురావాలని పీఠాధిపతులు దయానందస్వామిజీ అన్నారు. ప్రతి గ్రామంలోని ఆలయాలు నిత్య ధూపదీప నైవేద్యాలతో కళకళలాడాలన్న ఉద్దేశంతోనే టీటీడీ పెద్ద ఎత్తున ఆలయాల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు.

తప్పులు లేని రికార్డులు తయారు చేయండి



రాపూరు: సమావేశం నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి

రాపూరు: భూ రికార్డులు డిసెంబరు నెలాఖరుకు తప్పులు లేకుండా తయారు చేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి తుకారం కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలోని ప్రతి ఒక్కరి భూముల వివరాలను పూర్తిగా సేకరించి నమోదు చేయాలన్నారు. అలాగే ఆ రికార్డులను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. తహసీల్దారు అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోలతో ప్రత్యేక అధికారి సమీక్ష

కలువాయి: భూమి రికార్డులు ప్యూరిఫికేషన్‌పై స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలతో ప్రత్యేక అధికారి తుకారం సమీక్షించారు. ఇంత వరకు గుర్తించిన తప్పులను వీఆర్వోలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 16వ తేదీ నాటికి వెబ్‌ల్యాండ్‌లో తప్పులు గుర్తించే ప్రక్రియ పూర్తికావాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దారు రవీంద్రనాథ్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వెంకటగిరి(టౌన్): పట్టణంలోని పాలకేంద్రం వద్ద ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్‌లో రెండవ శనివారం మరమ్మతులు కోసం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ ఐ. శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. దీనిలో భాగంగానే వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

కలువాయి: కలువాయిలో 11 కేవీ విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్లు తొలగింపు పనులు చేపడుతుండటంతో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇన్‌చార్జి ఏఈ శివారెడ్డి తెలిపారు.

రాపూరు: రాపూరు, వేపినాపి విద్యుత్తు సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ విద్యుత్తు సరఫరా నిలిపివేపి సబ్‌స్టేషన్‌లో, విద్యుత్తు లైన్ల మరమ్మతులు చేస్తున్నట్లు సబ్‌ఇంజనీరు కార్తీక్ తెలిపారు.

బెల్టు షాపుపై దాడి : ఒకరి అరెస్టు

రాపూరు: ఏపూరు గ్రామంలో మద్యం బెల్టుషాపు నిర్వహిస్తున్న లక్ష్మీరెడ్డిని శుక్రవారం అరెస్టు చేసి విక్రయానికి సిద్ధం చేసిన 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. బెల్టుషాపులు ఎక్కడైనా నిర్వహిస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

నేడు ఎన్టీఆర్ వైద్య శిబిరం

డక్కిలి: వెంకటేశ్వరపురం గిరిజన కాలనీలో శనివారం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నవీన్‌కుమార్ తెలిపారు. ఈ శిబిరంలో రెయిన్‌బో సూపర్ స్పెషాలిటీ, బొల్లినేని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు పాల్గొంటారని చెప్పారు.

ఎన్‌ఆర్‌ఐలు జన్మభూమి రుణం తీర్చుకోవాలి

● ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



శుద్ధి జల ప్లాంటును ప్రాంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

డక్కిలి: అత్యున్నతి స్థాయిలో వివిధ దేశాల్లో, రాష్ట్రాల్లో స్థిరపడిన ఎన్‌ఆర్‌ఐలు జన్మభూమి రుణం తీర్చుకునేందుకు ముందుకు రావాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కోరారు. ఆల్తూరుపాడు గ్రామంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు కాసరం చైతన్యరెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన శుద్ధి జల ప్లాంటును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఉన్నంతలో ఎంతోకొంత సేవ చేయాలన్నారు. చైతన్యను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రామాల అభివృద్ధి చెందాలని రకరకాల పథకాలు ప్రవేశ పెడుతున్నారని చెప్పారు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డ ప్రతి ఒక్కరు పుట్టిన గడ్డ కోసం ఎంతో కొంత సేవచేయాలన్న దృక్పథం కలిగి ఉండాలన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు తనకున్న అనుభవాన్నే పెట్టుబడిగా పెట్టి రాష్ట్రాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. జగన్ లాంటి అపరిచితుడు ఈ రాష్ట్రానికి ప్రతిపక్ష నేతగా కొనసాగడం దౌర్భాగ్యమన్నారు. చంద్రబాబును చంపి అయినా సీఎం కుర్చీ ఎక్కాలని జగన్ భావించడం చూస్తుంటే అతను ఎంత దుర్మార్గుడో ప్రజలకు అర్థం అయ్యే ఉంటుందన్నారు. ఉపాధి హామీ పథకంతో రోడ్లు వేసుకొంటుంటే వేసే దానికి లేదని జగన్ ఢిల్లీకి వెళ్లి లేఖ ఇచ్చారన్నారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేలు సమస్యలు వివరించాలని అనుకొంటే అసెంబ్లీ జరగకుండా అడ్డుకోవడం వంటి పనికిమాలిన చర్యలకు జగన్ దిగడం ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఆర్డీవో అరుణ్‌బాబు, ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి, జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య, వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, కేవీకే ప్రసాద్, దాత, సాఫ్ట్‌వేర్ ఇంజనీరు కాసరం చైతన్యరెడ్డి, పలుగోడు టీడీపీ నాయకుడు నెలబల్లి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి ఓటు వేయొద్దనడం సమంజసం కాదు

కలువాయి : నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీకి కాపులు ఓటు వేయొద్దు అని కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం అనడం సమంజసం కాదని పీసీసీ ఉపాధ్యక్షుడు మాదాసు గంగాధరం అన్నారు. కుల్లూరులో శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కాపు ఉద్యమనేత ముద్రగడ తీరు కాపులను తప్పుదోవ పట్టించేలా ఉందన్నారు. రాజకీయాలు చేయాలను కుంటే ఏదో ఒక పార్టీలో చేరి రాజకీయం చేయాలని సూచించారు. కాపు ఉద్యమనేతగా ఒక పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడం మంచిది కాదన్నారు. తాను కాపు సామాజిక వర్గానికి చెందిన నాయకుడిగా మాట్లాడుతున్నాని, దయచేసి కాపులను బలిపశువులు చేయవద్దని మాదాసు కోరారు. కాపులను అడ్డంపెట్టుకుని రాజకీయాలు చేయడం పద్మనాభంకు తగదన్నారు. నంద్యాల ఎన్నికల్లో ప్రజలు తప్పకుండా రాష్ట్రాభివృద్ధికి పాటు పడుతున్న పార్టీకి ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

వైభవంగా ఆదిలక్ష్మి ఆస్థానసేవ



ప్రత్యేక అలంకరణలో ఆదిలక్ష్మి

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో పెంచలస్వామి పట్టమనిషి ఆదిలక్ష్మిదేవికి శుక్రవారాభిషేకం, ఆస్థాన సేవ వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆదిలక్ష్మి అమ్మవారి ఉత్సవరులను పద్మపీఠంపై ఉంచి వివిధ ఆభరణాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ప్రత్యేక పల్లకిపై ఉంచి ఆస్థాన సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఆటలతో మానసిక ఉల్లాసం: ఎమ్మెల్యే కురుగొండ్ల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి(టౌన్): చిన్నతనం నుంచి ఆటలు నేర్చుకుంటే మానసిక ఉల్లాసంగా ఉంటారని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక విశ్వోదయ జూనియర్ కళాశాలలో సింహపురి యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లోలో రాణించిన వారికి తెలుగుదేశం ప్రభుత్వం గుర్తింపు ఇస్తుందన్నారు.

ఎన్‌టీఆర్ ఇళ్ల స్థలం పరిశీలన

ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఎన్‌టీఆర్ ఇళ్లు నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని గూడూరు ఆర్డీవో అరుణ్‌బాబు, మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్‌తో కలసి తిరుపతి రోడ్డులోని ప్రభుత్వ స్థలాన్ని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ త్వరలోనే ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నేరవేరుతుందన్నారు. అభివృద్ధి పనులకు ఎవరైనా ఆటంకం కల్గిస్తే సహించేది లేదన్నారు.

చంద్రన్న బీమా చెక్కుల పంపిణీ

చంద్రన్న బీమా చెక్కులు ప్రజలకు ఓ వరమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆయన నివాసంలోని పార్టీ కార్యాలయంలో బాధిత లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు శారద, తహసీల్దార్ కే.రాజ్‌కుమార్, జడ్పీటీసీ దట్టం గురునాథం, ఏఎంసీ చైర్మన్ పులికల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్, కోటేశ్వరరెడ్డి, ఐకేపీ అధికారి ఉమాదేవి, నిమ్మచీని శాస్త్రవేత్త బీ గోవిదరాజులు, సింహపురి యూత్ అసోషియేషన్ కార్యనిర్వహకులు జీ. ఉదయ్ కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

వైభవంగా గణపతిపూజ పూజ

కలువాయి: చింతలపాళెం ఎస్సీ కాలనీలోని మతమ్మగుడిలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం వైభవంగా గణపతిపూజ, పుణ్యావాచకము, నవగ్రహపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కుల్లూరు పీహెచ్‌సీలో సిబ్బంది కొరత!



కుల్లూరు పీహెచ్‌సీ వద్ద రోగులు

కలువాయి: మండలంలోని కుల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిబ్బంది కొరత పట్టి పీడిస్తోంది. మారుమూల ప్రాంతమైన ఇక్కడ వైద్యసేవలు ప్రజలకు అంతంత మాత్రం అందుతున్నాయి. గతంలో ఇక్కడ ఉన్న ఆసుపత్రిని పీహెచ్‌సీగా అభివృద్ధి చేశారు. ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరడంతో పీహెచ్‌సీని తెలుగుగంగ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. అక్కడ డాక్టర్‌తోపాటు ఓపీ ఏఎన్‌ఎం, ఫార్మాసిస్టు, ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వో, స్వీపర్ పోస్టులు ఉన్నాయి. వీటిలో ఒక్క ఎఫ్ఎన్‌వో మాత్రమే ఉన్నారు. మిగిలిన పోస్టులు అన్నీ ఖాళీగా ఉన్నాయి. చిత్తలూరు డాక్టర్ ఓబుల్‌రాజ్‌కు ఇక్కడ ఇన్‌చార్జి బాధ్యలు అప్పగించారు. కుల్లూరు పీహెచ్‌సీలో ప్రస్తుతం ఒక్కరే ఒక్కరు అన్నట్లు తయారైంది. ఈ పీహెచ్‌సీకి కోటి రూపాయిలతో కొత్త భవనం కూడా మంజూరైంది. మారుమూల ప్రాంతంలో ప్రజలకు సిబ్బంది కొరతతో వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని వాపోతున్నారు. ఉన్నాతాధికారులు స్పందించి వెంటనే ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సినిమాగైడ్

వెంకటగిరి

త్రిభువని:	లై
జ్యోతిమహల్:	నేనే రాజు నేనే మంత్రి
భ్రమరాంబ :	జయ జానకి నాయక

రాపూరు

శ్రీనివాసమహల్:	నేనే రాజు నేనే మంత్రి
వేంకటేశ్వరమహల్:	జయ జానకి నాయక